R E P O R T   R E S U M E S

ED 019 643   48   AL 000 904

GRADED READINGS IN MODERN LITERARY TELUGU--PRELIMINARY EDITION.

BY- REDDY, G.N.   MATSON, DAN M.
WISCONSIN UNIV., MADISON

REPORT NUMBER BR-5-1254   PUB DATE   64
CONTRACT OEC-4-14-043
EDRS PRICE MF-$1.00 HC-$8.88   220P.

DESCRIPTORS- *TELUGU, *READING MATERIALS, LITERATURE, LANGUAGE INSTRUCTION, COMPUTATIONAL LINGUISTICS

THE 16 CONTEMPORARY TELUGU SELECTIONS IN THIS READER WERE SELECTED TO ACQUAINT THE STUDENT WITH A VARIETY OF POPULAR LITERARY STYLES AND TECHNIQUES WHILE INSTRUCTING HIM EFFICIENTLY IN IMPORTANT READING SKILLS. ALL TELUGU MATERIAL IS WRITTEN IN DEVANAGARI SCRIPT. A BRIEF INTRODUCTION AND SHORT PARAGRAPHS CONCERNING EACH AUTHOR ARE WRITTEN IN ENGLISH. THE AUTHORS HAVE TRIED TO EXPOSE THE STUDENT EARLY AND REPEATEDLY TO THOSE FEATURES OF THE LANGUAGE WHICH OCCUR MOST FREQUENTLY. IN ORDER TO DETERMINE THE MOST FREQUENT FEATURES OF THESE SELECTIONS, THE ENTIRE TEXT WAS FED INTO A HIGH-SPEED ELECTRONIC COMPUTER AND ANALYZED FOR FREQUENCY. THE ABSOLUTE AND RELATIVE FREQUENCIES WERE DETERMINED FOR EACH LEXICAL WORD IN THE TEXT, AS WELL AS FOR SOME 90 INFLECTIONAL AFFIXES. A SPECIALLY DEVELOPED FORMULA WAS APPLIED TO ASSIGN TO EACH SELECTION A "SCORE" BASED ON THE LENGTH OF THE SELECTION, THE RELATIVE FREQUENCY OF THE WORDS AND AFFIXES IT CONTAINED, AND THE PROPORTION OF HIGH-FREQUENCY WORDS AND AFFIXES IT CONTAINED. ON THE BASIS OF THESE SCORES, THE SELECTIONS WERE ARRANGED IN THE ORDER IN WHICH THEY APPEAR IN THIS READER. IN THE EARLIER READINGS LOW-FREQUENCY WORDS WERE REPLACED WITH HIGH-FREQUENCY EQUIVALENTS AND THE INTRODUCTION OF CERTAIN DIFFICULT AND LESS FREQUENT GRAMMATICAL MATERIAL WAS POSTPONED UNTIL LATER IN THE TEXT. BY THE END OF THE EIGHTH STORY, MOST OF THE GRAMMAR USED IN THE TEXT HAS BEEN INTRODUCED, LEAVING THE SECOND HALF OF THE TEXT FOR REINFORCEMENT, ADDITIONAL VOCABULARY, AND IMPROVEMENT OF THE STUDENT'S READING EFFICIENCY. ADDITIONAL VOLUMES IN THIS SERIES INCLUDE A NEWSPAPER READER (AL 000 905) AND A GLOSSARY FOR BOTH READERS (AL 000 906). (JD)

GRADED READINGS IN

MODERN LITERARY TELUGU:

PRELIMINARY EDITION

U.S. DEPARTMENT OF HEALTH, EDUCATION & WELFARE

OEC-4-14-043
BR-5-1254
PA 48

ED019643

# GRADED READINGS IN MODERN LITERARY TELUGU: PRELIMINARY EDITION

U.S. DEPARTMENT OF HEALTH, EDUCATION & WELFARE
OFFICE OF EDUCATION

THIS DOCUMENT HAS BEEN REPRODUCED EXACTLY AS RECEIVED FROM THE PERSON OR ORGANIZATION ORIGINATING IT. POINTS OF VIEW OR OPINIONS STATED DO NOT NECESSARILY REPRESENT OFFICIAL OFFICE OF EDUCATION POSITION OR POLICY.

G. N. Reddy

Dan M. Matson

"PERMISSION TO REPRODUCE THIS COPYRIGHTED MATERIAL HAS BEEN GRANTED BY UNIVERSITY OF WISCONSIN TO ERIC AND ORGANIZATIONS OPERATING UNDER AGREEMENTS WITH THE U.S. OFFICE OF EDUCATION. FURTHER REPRODUCTION OUTSIDE THE ERIC SYSTEM REQUIRES PERMISSION OF THE COPYRIGHT OWNER."

THESE MATERIALS WERE PREPARED FOR EXPERIMENTAL USE IN THE CLASSROOM AND WILL BE REVISED.

SUGGESTIONS WILL BE APPRECIATED.

The University of Wisconsin
1964

AL 000 904

The research reported herein was supported by a contract with the United States Office of Education, Department of Health, Education and Welfare.

Copyright: University of Wisconsin, 1964

# F O R E W O R D

The sixteen selections in this reader were chosen from the works of contemporary Telugu writers; they were selected to acquaint the student with a variety of styles and techniques while instructing him efficiently in important reading-skills. They present material of carefully graded difficulty, on a variety of subjects.

In the preparation of this reader, our main premise was that the student will learn most efficiently if he is exposed early and repeatedly to those features of the language which occur most frequently. The reinforcement provided by repetition makes it easier for him to learn these features rapidly; later, when he meets words and patterns of lower frequency, the student will already know much of the other material, and will thus be able to concentrate on learning this less frequent material. The sooner this is accomplished, the sooner the student can devote his attention to absorbing the content of what he reads, and to increasing his reading-speed.

In order to determine which were the most frequent features of these selections, the entire text was fed into a high-speed electronic computer and analyzed for frequency. The absolute and relative frequencies were determined for each lexical word in the text, as well as for some ninety inflectional affixes.

A specially-developed formula was applied, to assign to each selection a "score" based on the length of the selection, the relative frequency of the words and affixes it contained,

and the proportion of high-frequency words and affixes it contained. On the basis of these scores, the selections were arranged in the order in which they appear in this reader.

This done, the next step was to control the introduction of new material: a student can hardly be expected to learn rapidly to read and comprehend rapidly if each page is filled with words and grammar which he has never seen before. Accordingly, we did our best to replace low-frequency items with higher-frequency equivalents, and to postpone the introduction of certain difficult and less frequent grammatical material until later in the text.

The result is a text which we hope will accomplish the aims stated in the first paragraph above. By the end of the eighth story, almost all of the grammar in the text has already been covered, leaving the second half of the text for reinforcement of the grammar, for enlarging the student's vocabulary, and for increasing his reading-efficiency.

In the preparation of the accompanying glossaries, in addition to providing the necessary semantic and grammatical information, we have tried to take most of the mechanical labor of dictionary-thumbing out of the hands of the student. The glosses and notes are arranged serially, in the order in which the student working through the text will need them. An alphabetical glossary is also provided, to enable the student to refresh his memory.

We wish you success and satisfaction as a user of this text. If you have any comments or suggestions, we would like to hear from you.

G. N. Reddy

Dan M. Matson

విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. నిరీక్షణ | శాంతి కృష్ణమూర్తి | 1 |
| 2. సోక్రటీస్ | అడపా రామకృష్ణారావు | 6 |
| 3. అప్రయోజకుని కోపం | కొమ్మూరి వేణుగోపాలరావు | 14 |
| 4. రెండు నాటికలు | పోతుకూచి సాంబశివరావు | 22 |
| 5. రెండు స్వప్నాలు | మాలతీ చందూర్ | 33 |
| 6. ప్రేమ - పెళ్ళి | కొడవటిగంటి కుటుంబరావు | 41 |
| 7. బాంధవ్యం | ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి | 54 |
| 8. శేషమ్మ | గుడిపాటి వెంకటాచలం | 65 |
| 9. ధర్మవడ్డీ | త్రిపురనేని గోపీచంద్ | 73 |
| 10. ఫస్ట్ కేస్ | మునిమాణిక్యం నరసింహారావు | 88 |
| 11. హత్యా? ఆత్మహత్యా? | పోతుకూచి సాంబశివరావు | 108 |
| 12. దాంపత్యం | నార్ల వెంకటేశ్వరరావు | 117 |
| 13. దేశం నాకిచ్చిన సందేశం | బుచ్చిబాబు | 130 |
| 14. మానవసేవ | ధనికొండ హనుమంతరావు | 162 |
| 15. ఏమి మగవాళ్ళు | పాకాల వెంకటరాజు మన్నారు | 176 |
| 16. పడవ ప్రయాణం | పాలగుమ్మి పద్మరాజు | 195 |




ERIC

# Introduction

The long literary tradition of the Telugu language began with sixth-century inscriptions. Classical Telugu literature dates from the eleventh century.

Though the Telugu language is of Dravidian origin, its literature has been, throughout its development, strongly influenced by Sanskrit. Sanskrit was studied widely in the Telugu area. It was the language of education and scholarship among the Telugus from the earliest times, and continued to be so even after the commencement of literary writing in Telugu. Proficiency in Sanskrit was considered indispensable to a Telugu poet or a scholar. All the Telugu poets and writers were great lovers of Sanskrit language and literature.

Over the nine hundred years of development of Telugu literature, this has resulted in (1) the extensive borrowing of Sanskrit words and expressions into Telugu and (2) the translation and adaptation of many Sanskrit works of literary merit into Telugu. It does not, however, mean that Old Telugu literature is poor in original works. Rather, it shows that the Telugu people were never against linguistic or literary borrowing. Indeed, this has been a national trait of the Telugus which is greatly reflected in their history, culture and literature.

With the political conquest of India by the British in the 19th century, English came to occupy a higher and a more privileged position than any of the Indian languages. Further, an attitude that 'education' means 'education in English' came to prevail among the Indians by the end of the 19th century. The impact which English education and Western thought had on all aspects of Indian life was soon felt, and an age of renaissance set in all over India.

In Andhra, Kandukuri Veeresalingam (1848-1919) and Gurujada Appa Rao (1865-1915), who were great social reformers, pioneered the modern period in Telugu literature with their writings.

In Old Telugu literature all the epics and classics (translations from Sanskrit or originals), were written mainly in the form of 'campu', a poetic style with rhetorical prose interspersed occasionally. The language commonly used was a literary standard, highly Sanskritic and far from the spoken form. The content of the old literature was largely legends and mythology. Plays and prose works are notably absent from Old Telugu literature. Grammars, treatises on science, and even lexicons were written only in verse.

Modern Telugu literature is significantly different in every aspect from the old literature.

With their traditional liking for borrowing, the first Telugu writers who studied English began to translate many literary works from English into Telugu. During the first phase of modern Telugu literature (1880-1920) the plays of Shakespeare, much of the poetry of the Romantic poets, and a few novels were rendered into Telugu. Soon the English-educated writers organised their own associations, Sāhitī Samiti (1919) and Navyāndhra Sāhitya Parishad (1930), to experiment and to enrich Telugu literature with original writings. They popularized literary forms found in English literature, such as plays, novels, short stories, one-act plays, and essays. The press also contributed much to the development of non-scholarly prose in Telugu.

The early writers of this century used the literary Telugu of the old classics-- which was taught and studied in schools and colleges-- as the standard form in their writings. This was, of course, rather archaic and was much different from the spoken form. Opposing the use of the old classical

Telugu, Gidugu Ramamurti (1863-1940) and Gurujada Appa Rao (1865-1915) launched a country-wide movement advocating the use of modern spoken Telugu as the medium of all writing in Telugu. In spite of the conservative opinion of the pandits, the spoken form of Telugu ultimately came to be accepted for almost every form of writing. (Even today, however, in schools and colleges the old literary Telugu style is used in the textbooks and in writing examinations!)

This acceptance gave writers more freedom in the use of the Telugu language, although not all dialects of spoken Telugu find equal favor in literary use. The dialect of the upper and middle classes of coastal Andhra is commonly used by all writers, though other dialects are occasionally used.

The modern Telugu writer is well-educated in English, and is very much alive to the thought and literature of the West. He is generally influenced by the major and leading writers of the West. Every 'ism' or school of thought in the West finds its echo in his writings in one form or another. The Telugus have no puritanical attitude toward their language, and the writers use English loans rather freely; present-day Telugu contains many English loans, both assimilated and unassimilated.

Poetry is not as popular as prose in modern Telugu, either with the writers or with the reading public. Fiction in the form of short stories and novels is more popular than any other literary genre. In fiction and also in plays, the Telugu writer attempts 'to hold mirror' to the varied problems of the society he lives in. Love, marriage, and sex often figure in short stories. The writer's outlook tends more toward realism than idealism, though some writers do write with the zeal of reformers.

Though theatre is not very popular in Andhra, full-length plays, one-act plays, and radio-plays are the next most popular form of writing in Telugu.

Though the playwrights favor the use of simple, direct and idiomatic Telugu, they hardly attempt to reduce the use of sanskritisms in their style.

Since Independence, literary production in Telugu has grown much in quantity and variety. The spread of literacy among the masses, the popular growth of periodicals, the patronage of the government to arts and literature, and the increasing reading public are greatly responsible for the increasing number of amateur and professional writers in Telugu.

The sixteen selections in this anthology are fairly representative of today's major and minor popular writers in Telugu. They also represent the trends in the content, language, and technique found in the short-stories and plays of modern Telugu literature.

A brief sketch regarding the author's importance in contemporary writing is given before each selection. The cooperation of each author in kindly permitting his work to be included in this reader is deeply appreciated.

# నిరీక్షణ

శ్రీ శొంఠి కృష్ణమూర్తి.

Sonthi Krishnamurti, (1925 --) is a prolific writer of short-stories in Telugu. He usually bases his stories on lighter aspects of social problems. The impact of modern times has given rise to many problems of social adjustment among the Telugu people. Krishnamurti focuses his attention not on the problem of adjustment, but on the falterings of individuals in their adjustment to the changing times and tells a story with sympathy and a sense of humor. His stories are also significant from the point of view of the technique he adopts in his narration; they are very short and tend to be sketches of characters, with an element of suspense and surprise at the end.

The following is about the gullible nature of a country woman which finally shocks the sophisticated postmaster of the village.

# నిరీక్షణ

"నాకేమయినా...?"[A] ఆమే[B] వచ్చి[C] అడిగింది. ఆ అడగడంలో[D] సంకోచం, బిడియం, నిరాశ, నిరీక్షణ అన్నీ తోచాయి చంద్రకుమార్‌కు.

"ఏమీ లేవ్[E]" అన్నాడు చంద్రకుమార్. ఆమె నిరాశతో వెళ్ళిపోయింది. వెళ్ళిపోతుండిన[F] ఆమెను వింతగా[G] చూశాడు చంద్రకుమార్.

"దేనికోసం ఆమె నిరీక్షణ" అనుకొన్నాడు చంద్రకుమార్. అతను ఆవూరికి పోస్టుమాస్టరుగా[H] వచ్చి రెండు నెల లయింది[I]. ఆమె రోజూ వచ్చి "నాకేమయినా...?" అని అడగడం, నిరాశతో వెళ్ళిపోవడం అతనికి చాలా వింతగా తోచింది.

అది బ్రాంచి పోస్టాఫీసు. అందువల్ల పోస్టుమెన్ వుండరు[J]. ఉత్తరాలు పంచడం, సార్టింగు అంతా అతనే చేస్తుంటాడు. ఊళ్ళో వాళ్ళు[K] టైముకు వచ్చి ఉత్తరాలు తీసుకొని వెళ్ళుతుంటారు. అందువల్ల అతని పని కొంత తగ్గుతుంది. మిగిలిన ఒకటి రెండుత్తరాలు వీలయినప్పుడు[L] అతనే పంచుతాడు. ఊళ్ళో వాళ్ళకు ఉత్తరాలు చదివి చెప్పడం, జవాబులు వ్రాయడం కూడా చంద్రకుమార్ చేస్తుంటాడు. ఊళ్ళో అందరికి సంకోచం లేకుండా అతనికి తోచిన సహాయం చేస్తుంటాడు[M]. అందరికి ఇష్టంగా మాట్లాడడం అతనికి బాగా తెలుసు[N]. సాయంత్రం వేళల్లో[O] ఊళ్ళో వాళ్ళకు వార్తాపత్రికలు చదివి వార్తలు చెప్పడం కూడా అతను రోజూ చేసే[P] పని.

అతను చాలా నెమ్మదిమనిషి. అతని జీతం నెలకు పదిహేను రూపాయలే. పేరు పోస్టుమాస్టరు! పోస్టల్ రన్నరుకు నెల జీతం పోస్టుమాస్టరుకన్న ఎక్కువగా వుంటుంది. అయినా పోస్టుమాస్టర్ పని చంద్రకుమార్‌కు ఇష్టంగా వుంది.

ఆమె వెళ్ళిపోయిన తర్వాత ఆరోజు పోస్టులో వచ్చిన వార్తాపత్రిక చదవడానికి తీసుకొన్నాడు చంద్రకుమార్. అతని కళ్ళు పత్రికమీద ఉన్నాయి. కాని మనసు ఆమెమీదికి వెళ్ళింది.

రోజూ వేళకు వచ్చి అడుగుతుంది "నాకేమయినా ...?" అని. అతను "ఏమీ లేవు" అని జవాబు చెప్తుంటాడు. ఆ జవాబుతో ఆమె నిరాశతో వెళ్ళిపోతుంది. పాపం! ఏమిటీ ఆ నిరీక్షణ? ఎందుకు ఆ నిరీక్షణ? చంద్రకుమార్‌కు ఏమీ తోచలేదు. చాలా సార్లు అనుకొన్నాడు కారణం ఏమిటి అని. కాని ఆమెను అడగడానికి వీలు కాలేదు. ఆడవాళ్ళతో మాట్లాడడం అంటే చంద్రకుమార్‌కు కొంత బిడియం, సంకోచం. భయం కూడా. భయం అంటే వాళ్ళు కొడతారని తిడతారని కాదు; అది కారణం లేని భయం.

ఆమె అతనికన్న కొంచెం పెద్దది. చూడడానికి కొంచెం అందమయిన మనిషే. ఆమెలో కొంత ఆకర్షణ కూడా వుంది. ఆ ఆకర్షణకన్న ఆమె నిరీక్షణ చంద్రకుమార్‌కు వింతగా తోచింది. అతనికి ముందుండిన పోస్టుమాస్టర్ చార్జీ యిచ్చినప్పుడు చెప్పాడు: ఆమె ఈలాగ రెండు సంవత్సరాలనుంచి రోజూ వచ్చి అడుగుతున్నదని.

కారణం అతను చెప్పలేదు.

పాపం. భర్త విదేశాలలో వున్నాడా?[W] మిలిటరీలో వున్నాడా? అతని ప్రేమలేఖలకోసం ఆమె అడుగుతున్నదా? అదే[X] నిజంగా వుంటుందని మనసులో అనుకొన్నాడు చంద్రకుమార్. నిజంగా ఆడవాళ్ళు మంచివాళ్ళు. వాళ్ళ హృదయం మంచిది. వాళ్ళ హృదయాలలో ప్రేమ ఎక్కువగా వుంటుంది. ప్రేమకోసం వాళ్ళు ఏమయినా చేస్తారు. మగవాళ్ళు చెడ్డవాళ్ళు. వాళ్ళకు హృదయం వుండదు. ఆడవాళ్ళని తక్కువగా చూస్తారు[Y]. వాళ్ళని హింసిస్తారు[Z]. ఆ భర్త ఆమెకు ఎందుకు ప్రేమలేఖలు వ్రాయడం లేదు? ఆ భర్త చెడ్డవాడా? భార్యమీద ప్రేమ లేనివాడా? రేపు ఆమెను అడుగుతాను. నిజం తెలుసుకొంటాను. ఆమెకు వీలయిన సహాయం చేస్తాను అని మనసులో అనుకొన్నాడు చంద్రకుమార్.

మరుసటి రోజు ఆమె వచ్చింది. వచ్చి "నాకేమయినా ..." అని అడిగింది.

"ఏమీ లేవు కాని ..." అన్నాడు చంద్రకుమార్.

ఆమె కళ్ళు పెద్దగా చేసి "చెప్పండి" అనేలాగ[AA] చూసింది.

"క్షమించండి .... ఒక ప్రశ్న .... క్షమిస్తారని అడుగుతున్నాను. ఏమీ అనుకొనకండి[BB]. మీరు రోజూ వస్తున్నారు. దేనికోసం మీ నిరీక్షణ.... చెబుతారా?" అని కొంత భయంతో, సంకోచంతో అడిగాడు.

ఆమె అనింది: "ఆఁ[CC] ఏమీ లేదండి. రెండు సంవత్సరాలకు ముందు ఎలక్షన్లో ఓటు వేశాను. వాళ్ళు,

మనియార్డరు పంపుతామని చెప్పారు. అందువల్ల రోజూ వస్తున్నాను."

"ఆకాశం నుంచి పడుతున్నానా?" అనుకొన్నాడు చంద్రకుమార్.

# సోక్రటీస్

శ్రీ ఆడపా రామకృష్ణారావు.

The following is an excerpt from a radio-play on Socrates by Dr. Adapa Ramakrishna Rao (1927 --). Dr. Rao is a university teacher in English and a promising writer in Telugu.

The subject-matter for a modern Telugu writer is not limited to his society or to his environments only. Some writers take to translating or adapting from English, and a few create a story or a character in a Western setting and narrate it in a way that would appeal to the Indian mind. Dr. Rao has interpreted great characters like Socrates and Christ in his radio-plays. He writes in an elevated style that tends to be literary and Sanskritic.

# సోక్రటీస్

తరతరాలుగా వచ్చిన నమ్మకాలను సోక్రటీస్ స్వయంగా పరీక్షించి చూడకుండా[A] నమ్మలేదు. అందువల్ల అధికారులకు అతని మీద కోపం కలిగింది. ఒకరోజు సోక్రటీస్ తన శిష్యుడు[B] ఫేడోతో ఏథెన్స్ బయట ఉన్న[C] తోటలోకి వెళ్ళాడు.

ఫేడో: నేను చెప్పలేదూ, ఇక్కడ ఈ తోటలో చాలా హాయిగా, ప్రశాంతంగా ఉంటుందని?

సోక్రటీస్: అవును. ఇక్కడ, ఈ చెట్లనీడ[D]లో ప్రశాంతంగా, హాయిగా వుంది.

ఫే: సంవత్సరం నుంచి చూస్తున్నాను. నువ్వెప్పుడూ[E] మన ఊరు దాటి వెళ్ళలేదు.

సో: నిజమే. చెట్లు చెట్ల మధ్య బ్రతకాలి. మనిషి మనుషుల మధ్య[F] బ్రతకాలి.

ఫే: ఏమో - నేను చెట్టుగా పుట్టి ఉంటే[G] మంచిది.

సో: అదేమిటి, అర్థం లేని మాట.

ఫే: ఏమో - మనుషులమీద నాకు నమ్మకం పోతున్నది. నువ్వు చెప్పు. రోజూ మనం చూసే[H] మనుషులలో చాలా మంది స్వార్థపరులు, హృదయం లేని వాళ్ళు, నీతి లేని వాళ్ళు. అవునా? ఎప్పుడయినా వాళ్ళమధ్య ఒక మహాపురుషుడు పుడితే, అతనిని నాశనం చేసే[I] వరకు వాళ్ళు నిద్ర పోరు.

సో: అంతే అంటావా? సోఫక్లీస్ ఏమన్నాడో[J] తెలుసా? "ప్రపంచంలో చాలా వింతలున్నాయి. కాని మనిషి కన్న

పెద్ద వింత ప్రపంచంలో మరొకటి లేదు." అని
చెప్పాడు. ఆ మాట నిజం కాదంటావా?

షే: ఏమో! నాకు నిన్ను గురించి చాలా భయంగా
వుంది సోక్రటీస్!

సో: నన్ను గురించా?

షే: ఆఁ. పొద్దున పార్థినాన్ దగ్గర క్రీటో కనిపించాడు.
చాలా భయపడుతున్నాడు. ఆ దుర్మార్గుడు మెలీటస్
నిన్ను గురించి ప్రజలలో చెడ్డగా ప్రచారం చేస్తున్నాడని
చెప్పాడు.

సో: ఇప్పుడేం, ఆ పని మెలీటస్ చాలా కాలం నుంచి
చేస్తున్నాడు.

షే: నిజమే. కాని ఇప్పటి స్థితి వేరు. ఈవేళో, రేపో
వాళ్లు ఏదయినా నీకు చెడ్డ చేస్తారని చాలా
భయపడుతున్నాడు. సాయంత్రం వరకు మన మా
తోటలో ఉంటామని, ఏదయినా వార్త తెలిస్తే,
ఇక్కడికి వచ్చి కలుసుకోవాలి అని క్రీటోతో చెప్పాను.

సో: ఆఁ, మెలీటస్ ఏం చేస్తాడు? నువ్వు అనవసరంగా
బాధ పడకు.

షే: ఈ ప్రపంచంలో మంచితనానికి ఇంకా చోటుందని
నమ్మితే బాగుంటుంది కాని నాకు ఆ నమ్మకం పోయింది.
ఎటు చూసినా దుర్మార్గులు. నిజంగా జీవితానికి ఏదైనా
అర్థమూ, ఆశయమూ ఉన్నాయంటావా? అయితే
ప్రపంచంలో మంచివాళ్లు, స్వార్థం లేనివాళ్లు నాశనం
కావడం ఏమిటి? దుర్మార్గులు, స్వార్థపరులు బాగుపడడం
ఏమిటి?

సో: (నవ్వి) అదిగో - ఆ రంగురంగుల సీతాకోకచిలుకలను
చూశావా ?

షే : ఆఁ.

సో: వాటిలో ఒక సీతాకోకచిలుక వచ్చి నీ అరచేతిలో
వాలింది అనుకో. దానికి నిన్ను గురించి ఏం తెలుస్తుంది?
నువ్వు షేడోవని?, నా శిష్యుడవని, గొప్ప ఆశయాలు
నీకున్నాయని దానికి తెలుస్తుందా ? ఈ ప్రపంచంలో
ఉన్న స్వార్థానికి చాలా బాధపడుతున్నావని దానికి
తెలుస్తుందా? కనీసం నీవు ఒక మనిషివి అని కూడా
దానికి తోచదు. పువ్వులకన్న, ఆకులకన్న వేరుగా
ఉన్న ఏదో ఒకవస్తువు మీంద వాలినట్టు తెలుసుకొంటుందేమో.

షే : అయితే ?

సో: మనం కూడా సీతాకోకచిలుకల్లాగ ఉన్నామేమో!
మనంకూడా సృష్టికర్త అరచేతిమీద వాలిన సీతాకోక
చిలుకలం కాదా ?

షే : ఆఁ - అదిగో, క్రీటో వస్తున్నాడు. ఏదో చెడ్డవార్త
వుంటుంది. ఏం, క్రీటో! ఏదైనా వార్త...

క్రీ : ఆఁ. చెడ్డవార్త.

సో: ఏం, ఆకాశం మనమీంద పడుతుందా ?

క్రీ : సోక్రటీస్! ఈరోజు మెలీటస్ ఇంకా ముగ్గురు కలిసి
న్యాయస్థానంలో నీమీంద నేరం తెచ్చారు.

షే : ఏమని ?

క్రీ : ఇంకా నాకు వివరాలు తెలియలేదు. కాని తీవ్రమైన
నేరం తెచ్చారని విన్నాను. ఊళ్ళో వాళ్ళంతా దీనిని
గురించి చెప్పుకొంటున్నారు.

ఫే: అయినా ఇదే మనమంచికే కలిగింది. న్యాయస్థానంలో
సోక్రటీస్ మీద వాళ్ళు తెచ్చిన నేరం నిజంగా తప్పని
తెలుస్తుంది. న్యాయం జరుగుతుంది. సత్యం బయటపడుతుంది.

క్రీ: అయితే అంతకన్నా మనకు ఏం కావాలి? కాని ఆ దుర్మార్గులు
పౌరుల మనసు పాడుచేశారు. మన సంఘాన్ని సోక్రటీస్
నాశనం చేస్తున్నాడని ప్రచారం చేశారు. ... ఇప్పుడు
సోక్రటీస్ ఏమి చెప్పినా వాళ్ళు వినేలాగ లేరు.

ఫే: అయితే ఇప్పుడేం చేద్దాం?

క్రీ: ఇప్పుడు న్యాయం జరుగుతుందని నాకు నమ్మకం లేదు.
డబ్బుతో ఏమయినా చేయడానికి వీలవుతుందా అని
చూడాలి. కాని సోక్రటీస్‌కు ఇష్టం అయితే ఇంతకన్నా
మంచి మార్గం మరొకటుంది.

సో: ఏమిటది?

క్రీ: నిన్ను రహస్యంగా ఈవూరునుంచి పంపివేస్తాం.

సో: ఏథెన్స్ నుంచి పంపివేస్తారా?

క్రీ: కాదు. ప్రజలలో, పౌరులలో ఉద్రేకం తగ్గేవరకు...

సో: పౌరులకు, ప్రజలకు భయపడి నేను పారిపోవాలి
అంటావా? పారిపోవలసిన నేరం నేను చేయలేదు.
న్యాయస్థానంలో ఆ మాటే చెబుతాను.

క్రీ: అంతేనా? అయితే మన కెక్కువ కాలంలేదు. వెంటనే
మన స్నేహితులతో మాట్లాడాలి. లేవండి వెళ్లదాం.

సో: క్రీటో! ముందు నువ్వు వెళ్ళు. నేనూ, ఫేడో కొంచెం సే
పుండి వస్తాం. మానవ జీవితానికి సంబంధించిన ఒక గొప్ప
సమస్యను గురించి మాట్లాడుతున్నాం.

ఫే: ఏమిటి? ఇంకా ఇప్పుడు మన మిక్కడ కూర్చుని

మాట్లాడుతావా?

సో: ఏం, ఎందుకు మాట్లాడకూడదు?[Z] మరి నువ్వు అడిగిన ప్రశ్నను గురించి మనం చర్చించాలి.

క్రి: అయితే నేను వెళ్తాను. రాత్రి మీ ఇంటికి వచ్చి కలుసుకొంటాను.

ఫే: ఏమి మనుషులు! ఏమి మనుషులు! ఎవరికి నువ్వు మంచి కోరుతావో వాళ్ళే నిన్ను నాశనం చేయడానికి పూనుకొంటారు.

సో: అనవసరంగా పౌరుల నెందుకు తిడుతావ్.[AA] ఫేడో! ఆ క్రీటోను చూడు. ఏవిధంగానైనా నన్ను రక్షించాలని చాలా కష్టపడుతున్నాడు. అటువంటి స్నేహితుడు ఒక్కడు చాలు నా జీవితం సార్థకం కావడానికి. అటువంటి పౌరుడొక్కడు చాలు ఏథేన్స్ బాగుపడడానికి.

ఫే: చివరికి ఏమవుతుందో అని నాకు చాలా భయంగా వుంది.

సో: తీరికగా చర్చించడానికి ఇక మీదట మనకు అవకాశం వుండదేమో. అందువల్ల నీ సందేహాన్ని గురించి మళ్ళీ ఒకసారి ఆలోచించి చూద్దాం.

ఫే: ఏమో - నాకు నిన్ను గురించే భయంగా ఉంది. ఇంకొకదాని గురించి నేను ఆలోచించలేకుండా[BB] ఉన్నాను.

సో: (నవ్వుతూ) సృష్టికర్త అరచేతిమీద వాలిన సీతాకోకచిలుకలు! ఒకటి చిన్నసీతాకోకచిలుక. ఇంకొకటి పెద్ద సీతాకోకచిలుక. అంతే! ఫేడో, సోక్రటీస్ - ఇద్దరూ ఈ తోటలో ఈ చెట్టునీడలో

కూర్చున్నారు. ఈ చెట్టు ఒక చిన్నకొండ మీద ఉంది. ఈ కొండ ఏథెన్స్‌కు దగ్గరలో ఉంది. ఏథెన్స్ గ్రీస్ దేశంలో ఒకమూల ఉంది. గ్రీస్ దేశం ఈ విశాలప్రపంచంలో ఒక చిన్నచుక్క. ఈ ప్రపంచం విశ్వంలో అంతకన్న చిన్నచుక్క.

ఫే:(ఇదేమీ వినకుండా) న్యాయస్థానంలో ఏం జరుగుతుందో ఏమో?

సో:ఇక కాలం సంగతి చూద్దాం. అంతులేని కాలప్రవాహంలో మన జీవితకాలం ఎంత స్వల్పమో ఆలోచించు. సృష్టిలో మొదట మానవులకు జంతువులకు భేదం లేదు. తర్వాత క్రమంగా మానవజాతిలో ఏలాంటి వికాసం కలిగిందో చూడు. మానవజాతిలో ఎందరు కవులు, ఎందరు శిల్పులు, మహాపురుషులు జన్మించారు. ఈ కాలంలో మానవజాతికి వికాసం కలగలేదంటావా?

ఫే:నిజమే అనుకో.

సో:మరి? మానవజాతి ఇంకా బాల్యదశలోనే ఉన్నది అనే విషయం తెలుసుకో. తరాలతోపాటు మనుషులలో విజ్ఞానం క్రమంగా వికసించడంలేదూ? ఒకనాటికి మనుషులు తమలోపాలన్నిటినీ జయించి, హింస, వంచన, స్వార్థం, అన్నీ విడిచి ప్రేమభావంతో జీవిస్తారేమో? ఈ మెలీటస్, ఈ సోక్రటీస్, ఈ ఫేడో, క్రీటో వీళ్ళంతా చనిపోయినతరువాత ఒకనాటికి అలాంటి కాలం వస్తుందేమో?

ఫే:నిజంగా వస్తుందంటావా? అటువంటి కాలం

చూడగలిగితే ఎంతో బాగుంటుంది.

సో: ఏమో - పైథాగరస్ ఊహ నిజమే అయితే, ఆత్మకు పున
ర్జన్మ ఉంటే ఇంకొక జన్మలో ఆ కాలం మనం చూడ
గలం.

ఫే: ఆఁ.

సో: అదిగో - సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఇక మనం
తిరిగి వెళ్ళాలి. ఈ లాంటి ప్రశాంతమైన
వాతావరణంలో ప్రార్థన చేసి వెళ్ళటం మంచిది.

[ ప్రార్థన చేసిన తరువాత ]

ఫే: వెళదాం, పద.

# అప్రయోజకుని కోపం

శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావు.

Kommuri Venugopala Rao (1938 --) is a novelist and also a short-story writer. It is hardly possible to categorize the novelists and short-story writers separately in Telugu, because most of the fiction writers do both. Venugopala Rao has written a few novels and a few good short-stories as well which reflect the domestic problems of the middle classes. His stories generally contain situations in which his characters helplessly endure inner conflicts. He develops the situation to a climax only to leave it, with an implicit suggestion that what cannot be cured must be endured.

The helplessness of a long-suffering Hindu wife and the false notions of a self-respecting husband are finely depicted in the following story.

## అప్రయోజకుని కోపం

శారద చెప్పినమాట విని తెల్లబోయాడు కాంతారావు. అతనిలో అవమానం, పౌరుషం, కోపం ఎక్కువయింది.

"నాతో చెప్పకుండా ఈలాంటి పని ఎందుకు చేశావ్? నేను ఏలాంటి మనిషినో తెలుసా? నాకు డబ్బు లేకపోతే నీపుట్టింటివారి డబ్బు తీసుకొంటాననుకున్నావా?" అని కోపంతో అరిచాడు.

భర్త ఈలాగ అంటాడని శారద అనుకోలేదు. తాను చేసిన పనికి తనభర్త సంతోషిస్తాడు అని అనుకొంది. ఈ సహాయానికి భర్త మెచ్చుకొంటాడనికూడా అనుకొంది. కాని యిదేమిటి? తాను అనుకొన్నట్టు భర్త సంతోషించలేదు, మెచ్చుకోలేదు.

"నేను చేసిన పనికి మీకింత కోపం వస్తుందని తెలీదు. ఇంటియజమాని అద్దెకోసం రోజూ వచ్చి అడగడం చూసి మా నాన్నకు ఉత్తరం వ్రాసి యీ డబ్బు తెప్పించాను" అనింది భయపడుతూ.

అయినా కాంతారావుకు కోపం తగ్గలేదు. ఇంటియజమాని అద్దెకోసం బాధపెడుతున్నాడు. అద్దెడబ్బులకోసం చాలా అల్లరి చేస్తున్నాడు. నిజమే. కాని తనకు చెప్పకుండా వాళ్ళ నాన్నకు వ్రాసి రెండువందలరూపాయలు తెప్పిస్తుందా? మామగారి సహాయంతో బ్రతుకుతున్నాడనే మాటవస్తే తనకెంత అవమానం? అద్దె విషయం తనకు తెలీదా? ఆ విషయం భార్యకెందుకు?

ఇలా ఆలోచించుకొని కాంతారావు, "ఇదిగో శారదా! - ఈలాంటి పనులు ఇంకెప్పుడూ[D] చేయకు. నా విషయం నీకు తెలీదా? ఈ డబ్బు ఎక్కడనుంచి వచ్చిందో అక్కడికే పంపు. తెలిసిందా?" అన్నాడు శాంతంగానే, కోపాన్ని చూపకుండా.

శారదకు భర్త చెప్పిన మాటలు న్యాయంగా తోచలేదు. ఏమి జరిగిందో అది జరిగిపోయింది.[E] తన తండ్రి డబ్బు పంపాడు. ఆ డబ్బు ఇప్పుడు తిరిగి పంపితే ఏం బాగుంటుంది? తన తండ్రికి కూడా కోపం వస్తుంది. ఇంటి యజమాని రోజూ వచ్చి బాధపెడుతున్నాడు. అద్దె ఇవ్వకుంటే[F] అతను ఎన్నాళ్ళు వూరుకొంటాడు? అయిదు నెలల అద్దె ఇవ్వాలి. ఈ వేళో రేపో యివ్వకపోతే[G] యిల్లు ఖాళీ చేయిస్తాడు. అప్పుడు యింట్లో వున్న సామానుకూడా వదిలిపెట్టి వెళ్ళవలసివస్తుంది[H]. నలుగురిలో అవమానం అవుతుంది.

శారద భర్త వైపు చూసి, "ఏమి జరిగిందో అది జరిగిపోయింది. మా నాన్నకు యిది తిరిగి పంపితే ఏంబాగుంటుంది చెప్పండి. నా మాట విని యింటియజమానికి అద్దె యిచ్చేసిరండి." అనింది.

ఈసారి కాంతారావు కోపం ఆపుకోలేకపోయాడు.[I] అతని మొహం, కళ్ళు ఎర్రబడ్డాయి. చేతిలో వున్న రెండు పెద్దనోట్లు భార్య మొహంమీద పడేలాగ వేసి "చేసిన తప్పును తెలుసుకోకుండా నాకు సలహా యిస్తున్నావా? ఈలాంటి పనులు ఇంకెప్పుడయినా చేశావంటే[J] తంతాను. కొడతాను అని బెదిరించాడు. ఈలాగ బెదిరించి ఆమెను తిట్టి కోపంతో కాంతారావు బయటికి వెళ్ళిపోయాడు.

శారద తెల్లబోయింది. ఏమీ తోచలేదు. భర్త భోజనం సంగతి కూడా మరచిపోయి, బయటికి వెళ్ళిపోయాడు.

కాంతారావు వీధులన్నీ తిరిగాడు. స్నేహితులు కొందరు అక్కడక్కడ కనబడి పిలిచినా మాట్లాడలేదు. అతని కోపం అలాంటిది. కోపం వచ్చినప్పుడు తాను ఏమి చేస్తున్నాడో, ఎక్కడికి పోతున్నాడో తెలియకుండా తిరుగుతాడు. శారద తనను ఎందుకు అంత అవమానం చేసింది? తనవిషయం తెలిసికూడా అలాగ ఎందుకుచేసింది? అద్దె సంగతి ఆడదానికెందుకు? అవసరమయితే తల తాకట్టుపెట్టి[K] తెస్తాడు డబ్బు. మామగారి డబ్బు తెప్పించుకోవడం[L] ఎంత అవమానం? అయినా యింటి యజమాని సుబ్బయ్య దుర్మార్గుడు; మొండిమనిషి. ఒక పదిరోజులు ఆగనంటాడు. అయిదునెలలనుంచి వూరుకోలేదా? అలాగే యీ పదిరోజులూ అడగకుండా వూరుకుంటే అద్దెడబ్బులు వాడిమొహాన పడేస్తాడు. తన స్నేహితులు చాలామంది కొన్నిరోజుల్లో సహాయంచేస్తారు. అవసరానికి తాను ఎంతమంది స్నేహితులకు అప్పు యివ్వలేదు? వాళ్ళంతా తిరిగియిచ్చారా? అప్పులు యిచ్చినడబ్బులు వుంటే అద్దె సులభంగా సుబ్బయ్యకు యివ్వవచ్చు.[M] పది రోజుల్లో ఇచ్చేలాగ స్నేహితులు మాటయిచ్చారు. తప్పక ఇస్తారుకూడా.

నడుస్తున్న కాంతారావు చటుక్కున ఆగాడు.[N] రోడ్డుకు అటువైపు "నవజీవన్ విలాస్" బోర్డు కనిపించింది. భోజనం సంగతి జ్ఞాపకానికి వచ్చింది. ఆకలి బాధపెట్టడం ప్రారంభించింది. ఇంటికి

వెళ్ళడానికి తనకోపం యింకా తగ్గలేదు. సాయంత్రం వరకు యింటిసంగతి ఆలోచించకూడదు అని అనుకొన్నాడు. జేబు చూసుకొన్నాడు. జేబులో ఒకరూపాయినోటూ, ఒక పావలా వున్నాయి. ప్రస్తుతం హోటల్లో భోజనం చేయడానికి యీడబ్బులు చాలు. గబగబా హోటలుమెట్లు ఎక్కి లోపలికి వెళ్ళాడు.

అరగంట అయిన తర్వాత హోటల్‌మెట్లు దిగి రోడ్డుమీదికి వచ్చాడు కాంతారావు. జేబులో నుంచి సిగరెట్ తీసి, ముట్టించి, మళ్ళీ నడవడం ప్రారంభించాడు. ఎంతసేపు యీలాగ తిరగడం? అతనికి ఏమీ తోచలేదు. స్నేహితులయింటికి పోతే బాగుంటుంది; చీట్లపేకతో కాలక్షేపం అవుతుంది అని అనుకొన్నాడు. ఒక స్నేహితుని యింటికి వెళ్ళి కాలక్షేపం చేద్దామని వెనకకు తిరిగాడు. రోడ్డుమధ్య వున్న క్లాక్‌టవర్‌లో పన్నెండయింది. ఎండ మిటమిటలాడుతూ చాలా వేడిగా వుంది. త్వరగా పోదామని గబగబ నడవసాగాడు కాంతారావు.

“ఏయ్, పంతులూ! ఆగు.”

వెనక నుంచి ఒక పెద్ద గొంతు అరిచింది. కాంతారావు గుండె గుబగుబలాడింది. వాడే మొండివాడు; ఇంటియజమాని సుబ్బయ్య. కాంతారావు రోడ్డుమీద ఆగిపోయాడు.

“ఏం బాబూ! ఎక్కడికి? గబగబా వెళ్ళుతున్నావ్?” ఎంత వెకిలిగా అంటే ఎదుటివాడి మనసు బాధపడుతుందో అంత వెకిలిగా అరిచాడు యింటియజమాని సుబ్బయ్య.

సుబ్బయ్య సంగతి కాంతారావుకు తెలుసు. అతను అవమానం చేయడానికి పూనుకొంటే రోడ్డుమధ్య ఆపి నలుగురూ వినేలాగ అరుస్తాడు. నిన్న రాత్రే బెదిరించి వెళ్ళాడు. మళ్ళీ యిప్పుడు రోడ్డుమీద ఆపి అరుస్తున్నాడు.

"మాట్లాడకుండా నిలబడ్డావేమయ్యా? అద్దె యివ్వకుండా సిగరెట్లు తాగుతూ తిరుగుతున్నావ్? సిగ్గు లేదా నీకు?" అని అడిగాడు యింటియజమాని సుబ్బయ్య.

అతని మాటలు చాలా వెకిలిగా, అవమానంగా తోచాయి కాంతారావుకు.

"రోడ్డుమీద ఎందుకండీ అరుస్తారు? పదిరోజుల్లో మీకివ్వవలసిన అద్దె అంతా యిచ్చేస్తాను" అన్నాడు కాంతారావు. సుబ్బయ్య గొంతు యిప్పుడు ఇంకా పెద్దది అయింది. "ఏమి పదిరోజులయ్యా? అయిదు నెలలనుంచి అంటున్నావ్ పదిరోజులు పదిరోజులని. పౌరుషం ఉన్నవాడివి అయితే నా డబ్బు నాకు యిచ్చేయి. లేకపోతే ఏమాటనినా కుక్కిన పేనులాగ పడివుండు."

ఛా! వెధవ. ఇష్టం వచ్చినట్టు వదురుతున్నాడు. వాడికి మంచీ చెడ్డా తెలియదు. ఇప్పుడు ఏమిటి చేయడం? కాంతారావుకు ఏమీ తోచడంలేదు. ఈలోపల నలుగురూ ఏమిటేమిటి అంటూ గుంపు చేరారు. సుబ్బయ్య అడిగిన వాళ్ళకందరికీ విషయమంతా చెప్పాడు. కాంతారావు తల యెత్తలేకపోయాడు. అక్కడ చేరిన గుంపులో గుసగుసలు ప్రారంభమయినాయి. ఎవరి అభిప్రాయాలు వారు చెబుతున్నారు. కాంతారావు అక్కడ వుండలేకపోయాడు. పౌరుషంతో "ఈవేళ రేపట్లో

మీ బాకీ తీర్చేస్తాను" అని చెప్పి గుంపునుంచి దాటుకొని బయటపడ్డాడు. అతను వెళ్ళిపోతుంటే సుబ్బయ్య "మీ యింటికి సాయంత్రం వస్తా. మర్యాదగా అద్దె అంతా యిచ్చేయి. లేకపోతే ఇల్లు ఖాళీచేయిస్తాను" అని గట్టిగా అరిచి చెప్పాడు. కాంతారావు గుంపునుంచి బయటికి దాటుకొని పోతుండినా అతని మనస్సు మనస్సులో లేదు. ఇంతకుముందే ఇంటిలో అవమానం అయింది. ఇప్పుడు రోడ్డుమీద నలుగురిలో గొప్ప అవమానం జరిగిపోయింది. తనకు తెలిసిన వాళ్ళు ఎవరైనా ఆ గుంపులో వుంటే సిగ్గు సిగ్గు!

ఈ సుబ్బయ్య చేసే అల్లరి కాంతారావుకు పెద్ద సమస్య అయింది. అతను సాయంత్రం యింటికి వచ్చి కూర్చుంటాడు. వందా డబ్భై అయిదురూపాయలు సాయంత్రం లోపల కావాలి. ఎలాగ? లేకపోతే అతను తప్పకుండా ఇల్లు ఖాళీచేయిస్తాడు. నలుగురిలో అవమానం అవుతుంది. ఏమిటి చేయడం? శారద తండ్రికి వ్రాసి రెండువందల రూపాయలు తెప్పించింది. అందుకోసం ఆమెను తిట్టాడు. నానామాటలు అన్నాడు. ఆలోచిస్తే ఆమె తప్పేముంది యిందులో? అవసరానికి డబ్బు తెప్పించింది. కాంతారావు కోపం క్రమంగా చల్లారింది. "శారద దగ్గర వున్న డబ్బు తీసుకొని సుబ్బయ్యకు యిచ్చేస్తే..." అనుకొన్నాడు. ఇందాక భార్యను నానామాటలు అని ఇప్పుడు తిరిగి ఆమె సహాయాన్ని కోరడమా? భార్య సహాయంతో బ్రతికే అప్రయోజకుడా తాను? ఎంత సిగ్గు! కాని మరొక మార్గం లేదు. సాయంత్రం వాడు వచ్చి యముడులాగ

కూర్చుంటాడు. ఆ అవమానాన్ని తప్పుకోవాలంటే భార్య సహాయం కోరక తప్పదు.[x] భార్య దగ్గర వున్న డబ్బు తీసుకోవాలి. తప్పదు. అవసరం. ఈ అవసరం కోసం ఏలాంటి పనయినా చేయాలి. లేకపోతే అవమానం. కాంతారావు ఇలా మనసులో అనుకొంటూ ఇల్లు చేరాడు. మెల్లగా మెట్లు ఎక్కి తలుపుకొట్టాడు. శారద తలుపుతీసింది. శారద మొహంలో నవ్వు లేదు. ఆమె మాట్లాడలేదు. ఆమె మనసులోని బాధ మొహంమీద కనబడుతూవుంది.

కాంతారావు తనకోపానికి తనని తాను[1] తిట్టుకొన్నాడు.[2] లోపలికి పోయిన తర్వాత ఆమెను దగ్గరకు తీసుకొని, "అనవసరంగా నిన్ను బాధపెట్టాను. శారదా. నా తప్పు క్షమించవూ ?...." అని మెల్లగా, చల్లగా అన్నాడు. ఆమె అతనివైపు చూస్తూ "అలా అనకండి. నామీద కోపంవల్ల మీరు భోజనమయినా చేయకుండా వెళ్ళిపోయారు. మీరు ఎప్పుడు వస్తారో అని ఎదురుచూస్తూ కూర్చున్నాను" అని చెప్పింది.

కాంతారావు కొంచెంసేపు ఏమీ మాట్లాడలేదు. అయిదు నిమిషాల తర్వాత మెల్లగా "ఆ డబ్బు... ఎక్కడ పెట్టావ్...?" అని అడిగాడు.

ఆమె అతని మొహంవైపు చూడకుండా మాటల్లో తన అయిష్టాన్ని[AA] చూపుతూ "పాడు డబ్బు. దానివల్లే[BB] మీకు నామీద కోపంవచ్చింది. పక్కింటి అబ్బాయి ద్వారా ఆ డబ్బు మా నాన్నకు తిరిగి పంపేశాను" అనింది చిరునవ్వుతో.

# రెండు నాలుకలు.

## శ్రీ పోతుకూచి సాంబశివరావు.

Potukuci Sambasiva Rao (1927 --) is an officer in the government at Hyderabad, but his official duties do not seem to conflict with his creative writing. He is not only a writer of recognition but also an organising force among the modern writers in Andhra. His prize-winning novel, 'Anvēṣaṇa' (The Search) is considered to be one of the best in Telugu produced in recent years. He has also written one-act plays, radio-plays and short-stories of high merit.

In Telugu society, where most of the marriages are arranged by the parents and relatives, the 'match-maker' or 'marriage-broker' becomes indispensable. To some it is a trade. In the following play the writer pictures the trade-tricks of a marriage broker rather realistically. The style is very lucid and direct, with interesting allusions to customs and superstitions of the Telugus.

# రెండు నాటికలు

<u>పాత్రలు:</u>

1. సూరిశాస్త్రి[A]
2. బసవయ్య
3. కనకమ్మ

## 1వ రంగం

బసవయ్య: శాస్త్రిగారూ! మా అమ్మాయికేమన్నా మంచి సంబంధం చూడకూడదూ![B]

సూరిశాస్త్రి: చెబుదామనుకుంటూనే ఉన్నాను.[C] పామెర్ల[D] వెంకటరత్నంగారి అబ్బాయి ఒకడు ఈవూళ్ళోనే పనిచేస్తున్నాడు. అది నాకు తెలిసిన మంచి సంబంధాల్లో ఒకటి.

కనకమ్మ: పామెర్ల వెంకటరత్నంగారా! ఆయన మావారికి కొంచెం దూరపుబంధువు. మంచికుటుంబం. మనం యీ సంబంధం కోసం ప్రయత్నం చేద్దామండీ.

బ: అయితే అబ్బాయిగురించిన వివరాలేమిటండీ?

సూ: ఎమ్. ఏ. ప్యాసయినాడండి. పాతికేళ్ళుంటాయి.[E]

క: మన అమ్మాయికి పద్దెనిమిదేళ్ళేగా! ఈసంబంధం చాలా బాగుంటుంది.

బ: అయితే ఉద్యోగమెక్కడ ఆ అబ్బాయికి? జీతం ఎంత ఇస్తారు?

సూ: ఏదో కాలేజీలో మేష్టరు పనట! మూడు వందలు సంపాదిస్తున్నాడట.

క: యింకనేం! ఉద్యోగం చేస్తున్న పిల్లవాడు దొరకడం చాలా అదృష్టమండీ.

సూ: పిల్లాడు మాత్రం చాలా బుద్ధిమంతుడు; మంచివాడు. బాగా చదువుకొన్నవాడు కూడా.

బ: మనకి ముఖ్యంగా ఆలాంటి అబ్బాయే కావాలి.

సూ: ఆస్తి యేమీ లేదనుకుంటాను.

బ: ఆస్తి మనల్ని రక్షిస్తుందాండీ! పిల్లవాడు బుద్ధిమంతుడూ, చదువుకొన్నవాడూ అయితే చాలదూ?

సూ: తండ్రి యీమధ్యనే పోయాడు! పాపం!

క: అయ్యయ్యో! వెంకటరత్నంగారు చచ్చిపోయారా? నేను ఆయన్ని ఎప్పుడూ చూడలేదు. కాని ఆయన చాలా మంచిమనిషి అని చెబుతారు.

సూ: మామగారు లేరనే లోపం ఒకటే. కాని ఆయనభార్య చాలా మంచిమనిషి.

బ: అత్తగారు మంచిదైతే చాలదాండీ! పదిమంది మామగార్లకు సమానం.

సూ: అవునండి. మంచి అనుభవం మీద చెప్పారు.

క: మంచిరోజు చూసి ఆ అబ్బాయితో మాట్లాడి రండి.

బ: అయితే ఆ అబ్బాయి అమ్మగారు యిక్కడే వున్నారా? అతని పెళ్ళి సంగతి మనం ముందు ఎవరితో మాట్లాడాలి?

సూ: వాళ్ళ అమ్మగారు ప్రస్తుతం అతని పెద్దతండ్రిగారింట్లో వున్నారట. భర్త చచ్చిపోయిన తరువాత, సంవత్సరంనుంచి అక్కడే వుంటున్నారట. మరి ఈవిషయం ఆ అబ్బాయితో

మాట్లాడి చూద్దాం! అతనూ వయసు వచ్చిన
పెద్ద మనిషే!

క: శాస్త్రి అన్నయ్యగారూ! రేపు చాలా మంచి రోజండి. మీరు కష్టమని అనుకోకుండా రేపే వెంకటరత్నంగారి అబ్బాయిని మాకు చూపించాలి.

సూ: అలాగే నమ్మా.... అన్నట్టు అతను మంచికథలు కూడా వ్రాస్తాడట.

బ: ఇంకనేం! మన అమ్మాయికి బాగా కాలక్షేపం అవుతుంది. కథలంటే మా అమ్మాయికి చాలా యిష్టం.

సూ: నాటకాలు కూడా వేస్తాడటండి.

క: మరీ బాగుంది! మా అమ్మాయికి కొంచెం సినిమాల ఖర్చు తగ్గుతుంది. ఖర్చు లేకుండా నాటకాలు చూడవచ్చు. నాటకాలూ, సినిమాలూ అంటే మా పిల్లకి చాలా యిష్టం.

బ: అయితే మా పిల్ల నచ్చుతుందంటారా అబ్బాయికి?

సూ: మీ అమ్మాయికేమండీ! రత్నంలాంటిది. చదువుకొన్న పిల్ల. అందానికి అందం వుంది. చదువుకు చదువు వుంది. ఇంతకన్నా ఏమికావాలి చెప్పండి.

క: ఈడూ జోడు కూడా బాగుంటుంది.

సూ: అవునండి. పిల్లవాడు కూడా రత్నంలాంటి వాడు. బుద్ధిమంతుడు. బాగా చదువుకొన్నవాడు.

బ: కట్నం ఏమాత్రం ఉంటుందంటారు?

క: ఈ సంబంధం మీకు యిష్టమైతే ఆ తర్వాత కట్నం సంగతి మాట్లాడవచ్చు.

సూ: ఇటువంటి సంబంధం వదలిపెట్టకూడదండి. వాళ్ళది మంచి కుటుంబం. అబ్బాయిని గురించి, వాళ్ళ కుటుంబాన్ని

గురించి నేను ఎక్కువగా చెప్పడం అనవసరమండి.

క: "శుభస్య శీఘ్రం" అన్నారు. రేపు తప్పకుండా పిల్లవాడిని చూసి అమ్మాయిని చూపించే ఏర్పాటు చేయించండి.

సూ: తప్పకుండా. నేను వెళ్ళివస్తానండి బసవయ్యగారూ.

బ: మంచిది. "శుభస్య శీఘ్రం." వెళ్ళి రండి.

## 2వ రంగం

( పెళ్ళి చూపుల తర్వాత )

క: ఏమండీ! పెళ్ళికొడుకుని చూశారుకదా! మీ అభిప్రాయం ఏమిటి?

బ: పెళ్ళికొడుకుకేం. నిమ్మపండులా ఉన్నాడు. నిజంగా రత్నంలాంటి అబ్బాయి.

క: ఆ అబ్బాయి కన్నుముక్కు మొహం ఎంత చక్కగా ఉందంటారు[I]! మన అమ్మాయికి సరైన పెళ్ళికొడుకు.

బ: వెంకటరత్నంగారిది చాలా మంచి కుటుంబమట. నేను వాకబు చేశాను కూడా.

క: అవునండి. గొప్ప కుటుంబం అని నేనూ విన్నాను. ఇటువంటి సంబంధం దొరకడం మన అదృష్టమండి. అమ్మాయికి కూడా నచ్చాడట.

బ: ఇంకనేం! ఇంక పిల్లవాడు ఒప్పుకోవడమే మిగిలింది.

క: పిల్లవాడికి కూడా మన అమ్మాయి నచ్చినట్టు కనిపించాడండి! పిల్లవాడు 'ఊఁ' అంటే కట్నం ఎంతైనా ఇచ్చేద్దామండి.

బ: తప్పకుండా! శాస్త్రిగారు రావాలి ఈవేళ. ఏంవార్త
తెస్తారో![J]

(సూరిశాస్త్రి ప్రవేశం)

బ: రండి శాస్త్రిగారూ! మీ సంగతే అనుకుంటున్నాం.
నూరేళ్ళు మీకు[K]

సూ: మానాన్నని ఈలాగే ఎంతోమంది దీవించారండి!
కాని ఆయన నలభై ఏళ్ళకే రపీమని చచ్చిపోయాడు.

బ: (నవ్వి) అయితే పండా? కాయా?[L]

సూ: ఏమిటోనండీ! నాకు ఇటువంటివన్నీ చూస్తుంటే
ప్రపంచం మీద, మనుషులమీద నమ్మకం పోతున్నదండి.

క: అదేమిటండీ! ఏం జరిగిందేమిటి?[M] చెప్పండి.

సూ: ఏం చెప్పాలంటారు? నేను ఏమిటో అనుకొన్నాను.

బ: పిల్లవాడు ఏమైనా చెడ్డగా మాట్లాడాడా?

సూ: చెడ్డగా మాట్లాడడం కాదండి. ఈమాత్రానికి
పిల్లని చూడటం ఎందుకంటాను?

బ: ఏమిటేమిటి? పిల్ల నచ్చలేదన్నాడాండి?

సూ: ఇంకేమంటాడు! కారణం ఏమిటి అనికూడా
అడిగాను.

బ: ఊఁ.

సూ: నచ్చలేదంటాడే గాని, కారణం చెప్పడు.

క: చూశారా[N]! పిల్లని చూసేటప్పుడు నచ్చినట్టు
నటించాడు. అంత నటించవలసిన అవసరం ఎందుకు
వచ్చింది? అతని వాలకం చూసి పిల్ల నచ్చిందనుకున్నాను
నేను.

బ: నాటకాల్లో నటించే మనిషి ఆమాత్రం నటించడూ?

సూ: బాలా బాగా అన్నారు.

బ: మరి నచ్చకపోవడానికి కారణం చెప్పాడాండి?

సూ: మొదట చెప్పలేదనుకోండి. కాని ఏదో కారణం
చెప్పకపోతే ఏం బాగుంటుంది? ఏదో ఒకటి
చెప్పితీరాలి అని అడిగాను. చివరికి అన్నాడు
"పిల్లకి కొంచెం పిల్లికళ్ళు" అని. నాకు ఒళ్ళుమండింది.

క: మా అమ్మాయికి పిల్లికళ్ళా! వాడి మొహం బాగున్నట్టు!
కోతిమొహం. వాడు ....

బ: నేను మొదటే అనుకొన్నాను: కొంగలాగ పొడుగ్గా
ఉన్నాడు వీడు, మన అమ్మాయికి ఈడూ జోడూ
సరిగా వుంటుందా అని.

సూ: ఈ సంబంధం తప్పినందుకు మీరు ఏమీ బాధపడకండి.
మామగారు లేని కుటుంబం.

బ: అన్నట్టు వెంకటరత్నంగారి భార్య, మొగుడు పోయినా
ఇంకా జుట్టు వుంచుకొని వుందట.[P]

క: రామ! రామ! ఆమెకు నలభై ఏళ్ళుంటాయనుకుంటాను.
ఇంకా నాజూకులెందుకండి .... సంవత్సరం నుంచి
బావగారి యింట్లోనే వుంటుందన్నారు, కొడుకు సంగతి
ఏమీ చూసుకోకుండా.

బ: అలాంటి కుటుంబం కాబట్టే, యీ అబ్బాయి
వెర్రిమొర్రి కథలూ, కవిత్వమూ వ్రాస్తూ, రౌడీలాడే
నాటకాలు వేస్తూ తిరుగుతున్నాడు.

సూ: అంతేనండి. నేను ఏమిటో అనుకొన్నాను. ఇది
అంతగొప్ప సంబంధం కాదండి! నా చేతిలో ఇంకా

లక్ష సంబంధాలున్నాయి.

బ: ఆ పిల్లవాడికి పాతికేళ్ళు మన అమ్మాయికి పద్దెనిమిదేళ్ళు!
పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు మధ్య ఏడేళ్ళు తేడా
వుండకూడదండీ.

క: ఆ అబ్బాయికి ఇరవై అయిదేళ్ళ వరకు పెళ్ళి కాలేదంటే
ఏదో కారణం ఉండి ఉంటుంది. ఆ కుటుంబంలో యింకా
మనకు తెలియని లోపాలు ఎన్ని వున్నాయో? మనం
నిజం తెలుసుకోకుండా, బాగా ఆలోచించుకోకుండా
అమ్మాయిని ఆ అబ్బాయికి చూపించాం. రత్నం లాంటి
మన అమ్మాయికి పిల్లికళ్ళుంటూండా?

బ: వచ్చిన సంబంధాలన్నీ యిలా పోతూవుంటే ఆ పిల్లవాడికి
వాడి జీవితంలో పెళ్ళి జరగదు.

క: పాతికేళ్ళ వరకు పెళ్ళి లేని వాళ్ళు మంచి వాళ్ళని నమ్మడం
కష్టమండి.

సూ: కనకమ్మగారి ఊహ నిజం. రాత్రి పన్నెండు ఒంటిగంట
వరకు ఆ అబ్బాయి యింటికి రాడట! వచ్చినా నిద్రపోడట.

బ: ఆ పిల్లాడికి ఆస్తి కూడా సున్న. ఈ సంబంధం తప్పినందుకు
మనం ఏమీ బాధపడనక్కరలేదు.

క: ఈ చదువులు, వుద్యోగాలు ఎంత కాలం రక్షిస్తాయండీ.
జీతం ఎంత సంపాదించినా చాలదు యీ కాలంలో.
ఈ సారి మన అమ్మాయికి ఆస్తి వున్న సంబంధమే
చూడండి. అన్నట్టు వెంకటరత్నం గారి ఆస్తి అంతా
ఏమైంది?

సూ: అతను ఆస్తి అంతా పేకాటల్లో నాశనం చేశాడట.

బ: తండ్రికి పేకాట! కొడుకుకి వెర్రి మొర్రి కవిత్వం!

నాటకాలు! వహ్వా! బాగానే వుంది. ఇటువంటి
పాడుసంబంధం తప్పినందుకు మనం సంతోషించాలి.

సూ: ఇతను చాలా మొండివాడటుండి.

క: వాడు మొండిమనిషి, బుద్ధిలేనివాడు, కోతిమొహంవాడు
అని ముందు తెలిసివుంటే, వాడిమొహం చూసేవాళ్ళమా?

బ: పోనీలెండి! అంతా మన మేలుకే జరిగింది! ఈసంబంధం
పాడుసంబంధం అని తెలిసే దేవుడు దీన్ని తప్పించాడు.

క: ఈసంబంధం విషయంలో నాకొక అనుమానం ఉంది.
అమ్మాయిని చూడడానికి వచ్చేటప్పుడు, శాస్త్రిగారు,
ఆ అబ్బాయి, అతని స్నేహితుడు ముగ్గురు వచ్చారు.
ముగ్గురు కలిసి చేసిన పని ముక్కలైపోతుందని
మొదటినుంచి నాకు అనుమానమే.

సూ: నేను ఆ అబ్బాయికన్న ముందు వచ్చేశానండి. ఆఅబ్బాయి,
అతని స్నేహితుడూ కలిసి ఇంట్లోకి వచ్చారు. అందువల్ల
ముగ్గురు కలిసివచ్చారు అనేవిషయం నిజంకాదండి.
నాకు ఆ అనుమానం లేదు.

బ: (భార్యతో) వచ్చినవాళ్ళకు ఫలహారాలు పెట్టడం
మంచిదికాదని చెప్పాను. కాని నువ్వే ఫలహారాలన్నీ
చేసిపెట్టావు. మన కుటుంబంలో పెళ్ళిచూపులకు
ఫలహారాలు పెట్టే ఆచారం లేదని తెలీదూ? కతుకుతే
అతకదని సామెత నిజం కాదా?

క: వాడు ఫలహారాలన్నీ తినేశాడండి. పిల్ల
నచ్చనివాడికి ఫలహారాలు బాగా నచ్చినట్టుంది.
అడిగి వేయించుకొని తిన్నాడండీ!

బ: ఇటువంటి తిండిపోతు భార్యకు ఏం పెడతాడు!

సంపాదించే జీతమంతా వాడి తిండికి చాలదు.

సూ: బాగా చెప్పారు. కాని నాకు కొంచెం అనుమానంగా ఉందండి. ఈ సంబంధం కోసం మీదగ్గర తీసుకొన్న నూటపదహారు రూపాయలు* ఖర్చయిపోయాయి అని నాకు బాధగా వుందంటే నమ్మండి!

బ: డబ్బు కలకాలం వుంటుందాండీ? మాట, మంచితనం మనసు ముఖ్యం. ఈ పాడు సంబంధం తప్పినందుకు, మీకు నూటపదహారు రూపాయలు బహుమానంగా ఇచ్చామనుకోండి.

క: ఇంతకన్న మంచి సంబంధాలేమైనా చెప్పండి శాస్త్రి అన్నయ్యగారూ!

సూ: అలాగే నమ్మా.... వాకబు చేసి చెబుతాను. వెళ్ళి వస్తానండి బసవయ్యగారూ!

బ: మంచిది. వెళ్ళి రండి.

.... .... ....

( సూరయ్యశాస్త్రి దారిలో )

సూ: (తనలో) ఈ నూటపదహారు రూపాయలలో పదహారు రూపాయలు, పిల్లను చూపించడానికి తీసుకొని వచ్చిన అబ్బాయి విద్దరికీ, వెంకటరత్నంగారి కుటుంబం మంచిదని చెప్పినవాడికీ హోటెల్ ఖర్చులకింద పంచేస్తే, మనకు నూరు రూపాయలు లాభం! ఈ రోజు మంచిరోజు. ఏముందీ? నాలుగు సార్లు ఏకుటుంబంలోకైనా వెళ్ళివస్తే వాళ్ళ సంగతులు, సమస్యలు బాగా తెలుస్తాయి. పామెర్ల వెంకటరత్నంగారని ఆ దంపతులనుకొంటూ వుంటే వినినమాటే. ఆయనెవరో

మనకేం తెలుసు! ఈరోజు నాకష్టానికి తగిన లాభం సంపాదించాను. అంతా దేవుని మహిమ!

ERIC

# రెండు సమస్యలు

శ్రీమతి మాలతీ చందూర్

The name of Mrs. Malati Chendur (1929 --) is well known in most Telugu homes. One may compare her to Ann Landers or Abby in the States. She writes a regular feature article in the weekly 'Andhra Prabha', which has a wide circulation. She answers readers' questions and writes on women's problems, domestic and personal. Her style in Telugu has a charm of its own and evokes a feeling of intimacy in the readers. An excerpt from one of her feature articles published in the Andhra Prabha is given here. It narrates the problems of a working girl and also of a housewife. Mrs. Malati Chendur has written many short-stories, and also popular books on cooking, sewing, fashions, etc.

# రెండు సమస్యలు

ప్రతివారం కొన్నివందల ఉత్తరాలు చదువుతూవుంటాను. ఆ వ్రాసేవారిలో కొందరు తమాషాకు రాస్తూవుంటారు; మరికొందరు నిజంగా తెలుసుకోవాలని వ్రాస్తూవుంటారు. నా సలహాలు తమకు ఉపయోగంగా వుంటాయని కొందరి నమ్మకం. ఏమయితేనేం ? ప్రతివారం చాలామంది తమకున్న వివిధమైన సమస్యలు, కష్టాలు పైకి చెప్పుకుంటే మనస్సుకు కొంచెం శాంతి కలుగుతుంది అనే ఆశతో, నమ్మకంతో వ్రాస్తారు. అటువంటి సమస్యలుగల రెండుత్తరాలలోని ముఖ్యమైన భాగాలు చెబుతాను.

"నేను బొంబాయి చేరుకొని అయిదేళ్ళు అయింది. బి. ఏ. పాసయ్యాను. టైపూ, షార్టుహాండూ తెలుసు. అందువల్ల యిక్కడికి వచ్చిన నాలుగోరోజున ఒకపెద్ద కంపెనీలో స్టెనోగా చేరాను. రాజమండ్రి నుంచి బయలుదేరినప్పుడు వసంత, వాళ్ళ అన్నగారికి ఒక ఉత్తరం రాసి యిచ్చింది. ఆయనే నన్ను స్టేషన్‌కు వచ్చి రిసీవ్ చేసుకుని, వాళ్ళ ఇంట్లో ఒకవారంరోజులు ఉంచుకుని, ఆ తర్వాత వర్కింగ్ గరల్స్ హాస్టల్లో అడ్మిట్ చేయించారు. ఆయనకు అయిదేళ్ళ అబ్బాయి, మూడేళ్ళ అమ్మాయి వున్నారు. ఆయన భార్య చాలా మంచిమనిషి. నా కథంతా తెలిసికూడా వాళ్ళు నన్ను ఒకప్రశ్న అయినా అడగలేదు.

"నాకు ఈ బొంబాయినగరంలో ఉద్యోగం, వసంత అన్నగారు పూనుకోవడంవల్లనే దొరికింది.

వసంత నా చేతికి ఉత్తరం ఇవ్వడమే కాకుండా వేరే ఉత్తరం ఆయనకు స్వయంగా రాసి, టెలిగ్రాఫ్ కూడా ఇచ్చిందట. నా పెళ్ళిముహూర్తానికి నాలుగు రోజులకు ముందు ఇల్లు వదిలిపెట్టి ఎవరికీ చెప్పకుండా వచ్చేశాను. బంధువులందరికీ అవమానం కలిగించి వచ్చిన నన్ను, వసంత అన్నగారు దేవుడులాగ కాపాడారు. ఆయన ఋణం తీర్చుకోలేను.

"నేను అయిదేళ్ళకు ముందు ఎందుకు తల్లిదండ్రుల్ని, బంధువుల్ని, ఇంటిని వదిలిపెట్టి వచ్చేశానో ఇపుడు ఆలోచిస్తే నాకే ఆశ్చర్యంగా ఉంటుంది. నాకిష్టంలేని సంబంధం మావాళ్ళు కుదిర్చారు. అతనంటే నాకు ఏమీ ఇష్టంలేదు. చివరికి సాహసించి మా అమ్మతో చెప్పేశాను ఇష్టంలేదని. "పెళ్ళయినతర్వాత ఇష్టం కలుగుతుంది" అనింది మా అమ్మ. నా మనస్సులోని బాధ ఆమెకు అర్థంకాలేదు. మీరూ పత్రికలో రాస్తూవుంటారు అప్పుడప్పుడు - పెళ్ళి చేసుకున్నతర్వాత ప్రేమించవచ్చని! ఎందుకో నాకు ఆ పెళ్ళికొడుకు మీద అప్పటికే చెడ్డ అభిప్రాయం కలిగింది. కాలేజీలో చదువుకుని డిగ్రీ సంపాదించుకున్న నేను, ఈ బానిసబంధంలో పడకూడదని నిశ్చయించుకున్నాను. ఆ వివాహానికి ఒప్పుకోవద్దు అని నా ఆత్మ చాలాసార్లు చెప్పింది.

"బొంబాయి వచ్చిన మొదటి రెండు సంవత్సరాలలో ప్రతి ఆదివారం వసంత అన్నగారింటికి వెళ్ళేదాన్ని. వాళ్ళయింట్లో ప్రశాంతమయిన వాతావరణంలో ఆదివారాలు హాయిగా వుండేది. ఆయనకు అహ్మదాబాదు

ట్రాన్సఫర్ కావడంతో నా ఆదివారాలు సమస్యవారాలు అయినాయి. పని ఉన్నరోజులలో బాధవుండదు. కాని ఆదివారాల్లో సెలవురోజుల్లో మనస్సుకు శాంతివుండదు. వసంత అన్నగారు ఇక్కడ ఉన్నప్పుడు నాయుగైదు కుటుంబాలతో పరిచయం కలిగింది. కాని, ఉద్యోగం చేసుకుంటున్న ఒంటరిపిల్లలమీద పెళ్ళి చేసుకున్న ఆడవాళ్ళకు మంచి అభిప్రాయం వుండదు. అసూయతో మాలో లేనివి మాకు వున్నట్లు అనుకుంటారు.

రాజమండ్రి నుంచి వసంత ఉత్తరం రాసిన తర్వాత ఒకసారి నేను రాజమండ్రి వెళ్ళాను. ఉద్యోగం చేస్తూ డబ్బు సంపాదించడం వల్ల మావాళ్ళు నన్ను చాలాప్రేమతో చూశారు. "ఆ అబ్బాయికి పెళ్ళి అయిపోయింది. నీకు యిష్టంలేకపోతే నాతో చెప్పలేకపోయావా తల్లీ ?" అంది మాఅమ్మ. కన్నతల్లి మనస్సు బాధపెట్టడం ఎందుకని నేను ఆ విషయాలు ఏమీ మాట్లాడలేదు. అక్కయ్యపిల్లలు 'పిన్నీ, పిన్నీ' అంటూ నాదగ్గర చేరారు. ఇరవై రోజులు సెలవు తీసుకుని వెళ్ళాను. కాని వారంరోజులకే, నాకు అక్కడ వుండడం కష్టమైంది. ఇంట్లో వాళ్ళు నన్ను బంధువులాగ గౌరవంతో మర్యాదగా చూశారు, నేను వాళ్ళ మనిషిని కాదనేలాగ. 'పిన్నీ, పిన్నీ' అంటూ ఆ పిల్లల అల్లరి. వసంత ఆ ఊళ్ళో లేకపోతే నేను ఆ పది పన్నెండురోజులు అక్కడ వుండలేకపోయేదాన్ని. మళ్ళీ బొంబాయి చేరుకున్నాను.

"ఇప్పుడు నా వయస్సు ఇరవైయేడు. నెలకు

మూడువందలు సంపాదించుకుంటున్నాను. డబ్బు బాధ లేకుండా జీవితం జరుగుతున్నది. కాని, ఈ బ్రతుకుకు, జీవితానికి అర్థం, ఆశయం కనపడటంలేదు. అంతా నిరాశగా వుంది. యువకులవలలో పడతాననే భయం నాకు లేదు. కాని ఆదివారాలలో, నిద్రరాని అర్ధరాత్రి వేళలలో చెప్పలేని బాధ, భయం కలుగుతుంది. నా సమస్యలనుండి బయటపడలేనా? నా జీవితానికి దారిలేదా? ఈ బాధలు, సమస్యలు ఉద్యోగం చేస్తున్న ఆడపిల్లలందరికీ ఉంటాయా? లేక నాకేనా?"

బొంబాయి సోదరి (మాటవరుసకు సుగుణ అందాం) ఆవిధంగా రాసింది. సుగుణ సమస్య పరిశీలించడానికి ముందు, ఆంధ్రరాజధాని హైదరాబాదు నుంచి కమలాదేవి (ఇదికూడా నిజంపేరు కాదు) వ్రాసిన లేఖలోని విషయాలు చెబుతాను.

"నేను బి. ఇడి. పాసయి మూడేళ్ళు ఉద్యోగం చేసిన తర్వాత మా అన్నయ్య ఈ సంబంధం తెచ్చాడు. ఆ ఇంజనీరు గారు పెళ్ళిచూపులకు వచ్చినప్పుడు, 'నువ్వు హార్మోనియమ్ వాయిస్తావా? నీకు ఇంగ్లీషు పుస్తకం చదవడం వచ్చా?' అని అడగలేదు. కాని మిగతా అన్నీ మా అమ్మగారి కాలంలోలాగ జరిగింది. ఆ కాలంలో, ఆమె తివాచీ మీద కూర్చుని ఉంటుంది; ఈ కాలంలో నేను సోఫాలో కూర్చున్నాను. ఆమె కొంత సిగ్గుతో చూసి ఉంటుంది; నేను కొంచెం నాజూకుగా చూసి ఉంటాను.

"ఈ సంబంధం కుదర్చడానికి ముందు నేను మా అన్నయ్యతో గట్టిగా చెప్పాను. 'ఆయన గారి జీతం

నాలుగు వందలయాభై కావచ్చు, పధ్నాలుగు వందలయాభై కావచ్చు. పెళ్ళి తర్వాత కూడా నా ఉపాధ్యాయవృత్తిలో ఉండడానికి నాకు స్వాతంత్ర్యం కావాలి. ఉద్యోగం నా వ్యక్తిస్వాతంత్ర్యానికి ముఖ్యం. ఇది ఆయనకు ఇష్టమవునో, కాదో కనుక్కో ' అన్నాను. అన్నయ్య కనుక్కున్నాడట. ఆయన సరే అన్నారట. పెళ్ళి అయినతర్వాత బెంగుళూరు, ఊటీ వెళ్ళి జూన్ మూడవవారానికి హైదరాబాదు చేరుకున్నాం. "కొత్త సంసారం కదా! ఈ సంవత్సరం యింట్లో ఉండి వచ్చే సంవత్సరం ఉద్యోగంలో చేరకూడదూ?" అన్నారు మావారు. స్కూళ్ళు తెరిచే రోజు నేను హాజరవుతానని హెడ్ మిస్ట్రెస్ కు చెప్పానని, వెళ్ళకపోతే బాగుండదని ఆయనకు చెప్పి వెళ్ళాను. నెలరోజుల తర్వాత ఆయన పెద్దన్నకూతురు పెళ్ళివార్త వచ్చింది. "ఈ పెళ్ళికి వారం రోజులు ముందు నీవు వెళ్ళకపోతే బాగుండదు" అన్నారు. "ఎవరికి బాగుండదు? నాకు బాగానే ఉంటుంది. ముహూర్తంరోజు వెళ్దాం. నేను ముందు వెళ్ళవలసిన అవసరం లేదు. హెడ్ మిస్ట్రెస్ ఎక్కువరోజులు నాకు సెలవు యివ్వరు" అన్నాను. "మన యింట్లో పెళ్ళికన్న ఈ పంతులమ్మ ఉద్యోగం ముఖ్యమా?" అని ఆయన అనడంతో నాకు కోపం వచ్చింది. "ఈ పంతులమ్మను ఎందుకు పెళ్ళి చేసుకున్నారు?" అన్నాను. ఇది మా మొదటి దెబ్బలాట. ఆరోజు ఆయనస్వభావం నాకు బాగా తెలిసింది. పైకి పెద్దగా మాటలు చెబుతారు గాని

లోపల, స్త్రీ ఉద్యోగం చేయడం, మగవాళ్ళకు నచ్చదు. భార్య ఉద్యోగం భర్తకు అగౌరవం అనుకుంటారు. భార్య జీతంతో భర్త బ్రతుకుతున్నాడని లోకం అనుకుంటుందట. చివరికి నేను ఉద్యోగం వదిలిపెట్టాను.

"సంసారమంటే ఆడవాళ్ళకు వ్యక్తి స్వాతంత్ర్యం, ఆర్థిక స్వాతంత్ర్యం వుండవని తెలుసుకున్నాను. మాకు పెళ్ళయి ఏడేళ్ళయింది. వివాహమైన రెండవసంవత్సరం చివర మా అబ్బాయి పుట్టాడు. వాడు పుట్టడంతో నాకు మేజర్ ఆపరేషన్ జరిగింది. ఇక పిల్లలు కలగరని డాక్టర్లు చెప్పారు. మా అబ్బాయి చల్లగా ఉంటే మాకు అదే పదివేలు. మా అబ్బాయిని కాన్వెంటులో చేర్చి ఆరునెలలయింది. పొద్దున తొమ్మిది గంటలకు కాన్వెంట్ బస్సులో వెళతాడు. మళ్ళీ సాయంత్రం అయిదు గంటలకు ఇంటికి వస్తాడు. మా వారు నెలకు పదిహేను, ఇరవై రోజులు క్యాంపులో ఉంటారు. ఊళ్ళో ఉన్నా, పొద్దున తొమ్మిదిగంటలకు వెళ్ళితే సాయంత్రం ఆరున్నరకు ఇంటికి వస్తారు. రోజంతా గోళ్ళు గిల్లుకుంటూ యింట్లో కూర్చోవడం నాకు ఎంత బాధగా ఉంటుందో ఆలోచించండి. కుటుంబంలో శాంతికోసం ఉద్యోగం వదిలిపెట్టాను. వ్యక్తి స్వాతంత్ర్యాన్ని మరచిపోయాను. మా వారి మనసు మార్చడం వీలవుతుందా? నాకు ఈ అర్థంలేని జీవితం ఎందువల్ల కలిగింది? చదువుకొనిన ఆడవాళ్ళు సంసారానికి తప్ప ఉద్యోగాలు చేయకూడదా? మీరు నా సమస్యను, నా బాధను అర్థం చేసుకుంటారనుకుంటాను. మీకు చెప్పుకోవడంవల్ల

నాకు కొంత శాంతి కలుగుతుందని యీ ఉత్తరం
వ్రాశాను. క్షమించండి."

ERIC

# ప్రేమ : పెళ్ళి

## శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

Kodavatiganti Kutumba Rao (1909 --) is one of the foremost short-story writers in Telugu. He is one of the earliest of the writers who popularised the short-story in Telugu. His writings in fiction run to more than 12 volumes. Some of his novels have been translated into other Indian languages. He is a model to most of the beginners in story writing.

In his writings, whether they are stories, novels or plays, Kutumba Rao reflects the changing social conditions of the Telugus. He explodes conventional attitudes which are irrational, and extols what is rational and practical. The present selection shows the author's attitude toward love, marriage and morals.

# ప్రేమ - పెళ్ళి

"ఏం రామారావు పెళ్ళెప్పుడు చేసుకుంటావ్" అని అడిగాను.

నన్ను ఇంప్రెస్ చేయడానికి ప్రయత్నిస్తూ రామారావు "ఈ 1954 లో అంతో ఇంతో సంస్కారంగల నేను - ప్రేమించిన పిల్లను తప్ప - ఎవరో పరిచయం చేసిన పిల్లను, ఎవరో శిఫార్సు చేసిన పిల్లను, పెళ్ళి చేసుకోను" అన్నాడు.

రామారావు నా స్నేహితుడి కుమారుడు. ఇరవై నాలుగేళ్ళ వాడు. నాలో సగం వయసు. నేనంటే తండ్రికి చూపించదగిన వినయం, విధేయత చూపుతూ తండ్రి దగ్గిర తీసుకోవటానికి వీలులేని స్వాతంత్ర్యం కూడా నా దగ్గిర తీసుకునే వాడు. చాలాసార్లు వాళ్ళ నాన్న వాణ్ణి గురించి నన్నడిగి తెలుసుకోవటం కూడా జరిగింది. హైస్కూలు చదువు విషయంలో, కాలేజీ చదువు విషయంలో రామారావు నా సలహా తీసుకున్నాడు. గురువు, శిష్యుడు అనే సంబంధం కలకాలం వుండదని నాకు తెలుసు. అందుచేత అది స్నేహంగా మారటానికి నేనే చనువు యిచ్చాను. రామారావు చదువు పూర్తిచేసి ఉద్యోగంలో ప్రవేశించిన తర్వాత కూడా అయిదారు నెలల కొకసారి ఉత్తరం రాసేవాడు. సెలవుల్లో వాళ్ళ ఊరు వస్తే నన్ను చూడకుండా తిరిగి వెళ్ళేవాడు కాడు.

కొంతకాలంగా రామారావు పెళ్ళి విషయమై వాళ్ళ నాన్న ఆలోచన చేస్తున్నట్లూ, మంచి కట్నంతో

A

వచ్చిన సంబంధాలు ఒకటి రెంటిని రామారావు వద్దన్నట్టు విన్నాను. అందుచేత తండ్రీకొడుకులమధ్య అభిప్రాయభేదం కలిగినట్టు నాకు తెలిసింది. రామారావు తండ్రి నాస్నేహితుడే కాని అతడు కొడుకుకి కొన్నివిషయాలలో ఇవ్వదగిన స్వాతంత్ర్యం ఇవ్వలేదని నా అనుమానం. ఇద్దరిమధ్య అభిప్రాయ భేదం కలిగితే రామారావు వైపు వాదించడానికికూడా నేను నిశ్చయించుకున్నాను. అయితే ఇప్పుడు రామారావు అన్న మాటలను వింటూంటే తప్పు వాడితండ్రిది కాదేమో అని తోస్తుంది.

" ఒక పిల్లని ప్రేమించి పెళ్ళాడే అవకాశం ఎలా వస్తుందో నాకర్థంగాకుండా ఉంది, రామారావ్! " అన్నాను.

రామారావు ఆలోచించాడు. అతను కనుబొమల మధ్య ముడి చూస్తే నాకు నవ్వువచ్చింది.

" పిల్లని చూసి, కాస్సేపు మాట్లాడితే పిల్లస్వభావం తెలుస్తుంది. ప్రేమించగలదా, లేదా తెలుస్తుంది. " అన్నాడు రామారావు అమాయకంగా.

" నువ్వు నాతో మాట్లాడే దానికీ మా అమ్మదగ్గిర మాట్లాడే దానికీ తేడా వుందంటావా? " అన్నాను.

" అవును, సహజంగా ఉంటుంది, " అన్నాడు రామారావు.

" ఒక ఆడపిల్ల, పెళ్ళి చూపులకు వచ్చిన వాడితో మాట్లాడే దానికీ, పెళ్ళయినాక మొగుడితో మాట్లాడేదానికీ తేడా ఉంటుందా? " అని అడిగాను.

" ఉండొచ్చు, " అన్నాడు రామారావు అమాయకంగా.

"నువ్వు కాపురం చేయవలసింది, ఆరెండో మనిషితో. ప్రేమించవలసిందికూడా ఆమెనే — ఈ పెళ్ళిచూపులప్పుడు చూసే పిల్లను కాదు. అవునా?"

"పిల్ల పెళ్ళితో మారిపోతుందంటారు? అంతేనా?"

"సహజంగా!" అన్నాను. అతనిమాటే అతనికి చెప్పాను. రామారావు ఒకక్షణం ఆలోచించి,
"అమెరికాలోలాగ ట్రయల్ మారేజెస్ ఉండాలి అని మీ అభిప్రాయమా?" అన్నాడు.

"నా అభిప్రాయం అది కాదు. ప్రేమించి పెళ్ళాడాలంటే నీకు ఆపిల్లను గురించి చాలా తెలిసిఉండాలి. ప్రేమించడానికి అంత పరిచయం ఆపిల్లతో వుండాలిగదా. మనసంఘంలో అది వీలవుతుందా?" అని ప్రశ్నించాను.

"మాటవరసకు అడుగుతున్నాను - నవ్వకండి! ఒక ధనవంతుడు బీదపిల్లను పెళ్ళాడాడనుకోండి. వాళ్ళిద్దరిమధ్య నిజమైన ప్రేమ వుండటానికి అవకాశం లేదా?" అన్నాడు రామారావు.

"నీ అభిప్రాయం, బీదపిల్ల పెళ్ళాడిన ధనవంతునికి జీవితమంతా కృతజ్ఞతగా ఉంటుందనా?"

"అవును. అదికూడా ఉండవచ్చు."

"ఎందుకుండాలో నాకర్థంకాలేదు. పెళ్ళాడిన తరువాత ఆపిల్ల బీదవాళ్ళపిల్లకాదు, ధనవంతుని భార్య అవుతుంది. దానికి తగినట్టు మారుతుంది. తాను ఒకప్పుడు తిండిలేని బీదపిల్ల అనేసంగతి ప్రతిరోజు భోజనందగ్గర జ్ఞాపకానికి తెచ్చుకుంటుంది అని అనుకుంటున్నావా?"

రామారావు కొంచెం ఆలోచించి, "మీరు మనుషులను గురించి దారుణంగా మాట్లాడుతున్నారు" అన్నాడు.

"నిజమే. నీకు నా మాటలు దారుణంగా కనిపించవచ్చు. ఒక విషయం చెప్పు. నీకు మా అందరిలాగ వివాహం చేసుకోవటానికి అభ్యంతరం ఏమిటి?" అన్నాను.

"జీవితంలో చాలా అనుభవం వున్న మీరే ఆలా అంటే నేను ఏం చెప్పడం? ప్రేమించకుండా పెళ్ళాడిన దంపతులు ఒకరినొకరు అర్థం చేసుకుంటారా? ఒకరిమీద ఒకరికి సహజంగా ప్రేమ, సానుభూతి, గౌరవం వుంటుందా? ప్రేమ లేకుంటే ఒకే బోనులో పెట్టిన రెండు పులుల్లాగా అవుతారు. నిజం కాదంటారా? ప్రేమించుకొని పెళ్ళాడిన వాళ్ళు ఆలా వుంటారా, చెప్పండి."

"బహుశా వుండరు. కాని నువ్వనుకునే ప్రేమ ఎట్లా పుడుతుంది? అది నీకే స్పష్టంగా తెలియదని నా అభిప్రాయం."

"పోనీ మీరు చెప్పండి," అన్నాడు రామారావు.

"ప్రేమించడం మగవాడికి తెలిసినట్టు ఆడదానికి తెలియదని ఎప్పుడైనా విన్నావా?"

"కొంత విన్నాను — ఆడవాళ్ళు ప్రేమ విషయాలలో కూడా ప్రాక్టికల్‌గా ఉంటారని."

"అంటే ప్రేమ తమకు తిండి గుడ్డ, చీరెలు నగలూ పెడుతుందా లేదా అని ఆలోచిస్తారని. ఎందుకో తెలుసా?"

"తెలీదు."

"మరేమీ లేదు. వాళ్ళకి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు కాబట్టి మగవాడికి పెళ్ళాం కావడం కన్న ఆడదానికి మరొక వృత్తి లేదు. తమకా వృత్తి ఇచ్చినవాడు దేవుడులాగ కనపడతాడు – నువ్వు యిప్పుడు చెప్పిన ఉదాహరణలో తిండిలేని బీదపిల్లకు ధనవంతుడు కనబడినట్టు. పెళ్ళి విషయంలో భార్యలు బీదపిల్లలు, భర్తలు ధనవంతులు అనుకో. ఎందుకంటే ప్రతిభార్యా భర్తనుంచి కూడూగుడ్డా కోరుతుంది. నిన్ను వదలిపెట్టే అవకాశం ఉండికూడా నువ్వే కావాలి అనికోరే భార్య మాత్రమే నిన్ను ప్రేమించినమనిషి, రామారావ్. మగవాడైనా అంతే. స్వాతంత్ర్యం లేనిదే ప్రేమ లేదు."

రామారావు కొంచెం ఆలోచించి "మీరన్నది న్యాయంగానే వుంది" అన్నాడు.

"ప్రేమించి పెళ్ళాడిన ఒకద్దంపతుల్ని నేనెరుగుదును. ఆవిడ తాను పెళ్ళాడబోయేవాడు గొప్పవాడైపోతాడనుకుంది. తనమీద ఆమెకుగల శ్రద్ధను చూసి ప్రేమ అనుకున్నాడు ఆ అమాయకుడు. ఇద్దరూ పెళ్ళాడారు. ఆవిడ కలలు నిజంకాలేదు. ఆవిడ తనను ప్రేమించలేదని క్రమంగా ఆయన తెలుసుకున్నాడు. ఇద్దరూ నువ్వు చెప్పినట్టు బోనులో పులులయ్యారు. ఆమె ధనవంతురాలు. కాబట్టి వదలిపెట్టగలదు. వదలిపెట్టిందికూడా. ఎందుకంటే ఆమె ప్రేమించింది గొప్పవాడు అవుతాడు అనుకొన్న ఒకవ్యక్తిని. అతడుమాత్రం తాను ప్రేమించిన భార్యను మరవలేక బాధపడ్డాడు.

అతని జీవితం అలా నాశనం అయింది" అన్నాను.

"మీరు చెప్పినదాన్ని వింటే నాకు మరొకసందేహం తోస్తుంది. వాళ్ళిద్దరూ ప్రేమించి పెళ్ళాడారు గదా. అటువంటి వివాహాలు వంద జరిగితే యాభై అయినా బాగుండవా?" అన్నాడు రామారావు.

"అది ప్రేమవివాహమని నువ్వు ఏవిధంగా అనుకుంటున్నావు? అది మొదటినుంచి నిర్బంధవివాహమే. నిర్బంధం పైనుంచి రాలేదు. ఆవిడ తలలోనే వుండిపోయింది. అందుచేత పైకి కనిపించలేదు."

రామారావు మళ్ళీ ఆలోచించాడు.

"సరే, మీరు ఎంతోమంది సంసారాలు చూసివుంటారు. ప్రేమవివాహాలు చేసుకొన్నవాళ్ళల్లో సుఖంగా ప్రేమగా బ్రతుకుతున్నవారు లేరా?" అన్నాడు రామారావు.

"ఉన్నారు. పెళ్ళాం కుక్కిన పేనులాగ పడివుండి తన వ్యక్తిత్వాన్ని చంపుకుంటే భర్త ఆవిడతో హాయిగా ప్రేమగా వుండడం చూశాను. భర్త భార్యకాళ్ళకి మొక్కుతుంటే సంసారం ప్రశాంతంగా జరిగిపోవటంకూడా చూశాను. భర్త జీవితాన్ని భార్య, భార్య జీవితాన్ని భర్త పంచుకుంటూ, ఇద్దరూ కలిసి ప్రేమగా, హాయిగా వుండటం నేను చూడలేదు. అటువంటివాళ్ళెక్కడా లేరని చెప్పలేను." అన్నాను.

"మీరు చెప్పేది దారుణంగా వుంది" అన్నాడు రామారావు.

"జీవితమే దారుణంగా ఉంది. ఏం చేస్తాం?"

అన్నాను.

"నేను నమ్మను. మీకు ప్రేమలోనే నమ్మకం లేదేమో అనుకుంటాను" అన్నాడు అమాయకుడు రామారావు.

"కాదు, ఎందువల్లంటే, నేను ఒక్కసారి మాత్రం ప్రేమంటే ఏలావుంటుందో చూశాను."

ఈ మాటతో రామారావుకు నామీద కలిగిన దురభిప్రాయమంతా క్షణంలో పోయినట్లు తోచింది. అతను ఉత్సాహంతో, "మీకు ప్రేమవిషయంలో అనుభవం వుందా?" అన్నాడు. నాతరంవాడి ప్రేమగాథ వినాలని రామారావుకు ఉత్సాహం కలగడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

"ఆప్రేమ నా అనుభవం కాదు. అది నాస్నేహితుడి అనుభవం. అతను అంత నీతిపరుడు కాదు. స్త్రీవ్యసనం వున్నవాడు. కానీ కొన్ని మంచిగుణాలు అతనిలో వున్నాయి. అందుచేత నేనతని స్త్రీవ్యసనాన్ని క్షమించగలిగాను. పైగా అతను ఇతరులభార్యలవైపు చూసేవాడు కాడు. అతనికి తగినవాళ్ళతోనే అతనిసంబంధాలు. వాడి ప్రేమగాథ చెబుతాను. విను."

"ఇది 1934 నాటి మాట. ఆసంవత్సరం కరువులో చాలామంది దివాలా తీశారు. మాలాంటివాళ్ళ దగ్గిర డబ్బు లేదు. అతనికి వ్యాపారంలో నష్టం కలిగింది. అప్పులు ఎక్కువ అయినాయి. నాకతను మంచిస్నేహితుడు. నాదగ్గిర డబ్బు ఉంటే అతనికి తప్పక సహాయంచేసేవాడిని. గుంటూరులో నాకు తెలిసినమనిషి ఒకాయన ఉన్నాడు.

ఆయన డబ్బు వడ్డీలకిచ్చి పొలాలూ, ఇళ్ళూ, డబ్బూ బాగా సంపాదించాడు. ఆయన ఏమైనా సహాయం చేస్తాడేమో అని నేను, నా స్నేహితుడూ గుంటూరు చేరాం.

“నా స్నేహితుడికి అప్పటికే మూడురోజులుగా జ్వరం. ఆ విషయం నాతో ప్రయాణానికి ముందు చెప్పివుంటే ప్రయాణం ఆపేవాణ్ణి. రాత్రి తొమ్మిదిన్నరకు మేం గుంటూరుస్టేషనులో దిగాం. అతనికి జ్వరం చాలా ఎక్కువయింది. అందుచేత అతను హోటలుకు రానన్నాడు. రైలుపేటలోనే తనకు తెలిసినవాళ్ళున్నారని అక్కడికి పోదామని అన్నాడు. అతన్ని అక్కడ వదలిపెట్టి నేను హోటలుకు పోదామనుకున్నాను. గుర్రబ్బండి కుదుర్చుకొని అతను చెప్పిన యింటికి వెళ్ళాం. మా గుర్రబ్బండి ఆగిన ఇంటిముందే మరొక గుర్రబ్బండి ఆగివుంది. నా స్నేహితుణ్ణి బండినుంచి లోపలికి నడిపించాను. అతని జ్వరం క్షణక్షణానికి ఎక్కువ అవుతున్నది.

“ఆ ఇల్లు బీదవాళ్ళ ఇల్లులాగ ఉంది. డాబా ఇల్లు. బయట బండి నిలబడి ఉన్నదిగాని ఇంట్లో కొత్తవాళ్ళెవరూ ఉన్నట్టు లేదు. ఒక స్త్రీ, తెల్లని చీర కట్టుకుని, మొహానికి పౌడరేసుకుని, తల్లో మల్లెపూలు పెట్టుకుని మాకు ఎదురొచ్చింది. ఆమె వాలకమూ, కాళ్ళ చెప్పులూ చూసి ఎక్కడికో బయలుదేరబోతున్నదని నేనర్థం చేసుకున్నాను.

“ఆమె నా స్నేహితుణ్ణి చూసి ముందు సంతోషించినట్టు కనబడింది: తరువాత కంగారుపడింది.

అతన్ని తానుకూడా పట్టుకుని పక్కగా వున్న మంచంమీద కూర్చోబెట్టింది. అతనికి జ్వరం అని తెలుసుకొంది. వెంటనే బయటికి వెళ్ళి రెండునిమిషాల్లో తిరిగివచ్చి చెప్పులు ఒకమూల వదిలిపెట్టి మంచంమీద నా స్నేహితుడి పక్కనే కూర్చొని మాట్లాడసాగింది.

"ఆమె ఒకరకం స్త్రీ అని అనుమానించాను. అంటే ఆమెవృత్తి ఏలాంటిదో ఊహించాను. నా స్నేహితుడికి అటువంటి స్నేహితురాళ్ళున్నారని నాకు తెలుసు. అయితే నాకు వాళ్ళల్లో విశ్వాసం లేదు. ఈమనిషి పైకి ఈమాత్రమైనా నాస్నేహితుడిమీద అభిమానమున్నట్టు నటిస్తున్నందుకు నేను కొంత సంతోషించాను.

"మాబండివాడికి నేను డబ్బివ్వటం మరిచానని జ్ఞాపకం వచ్చి బయటికి వెళ్ళాను. బయట బండి లేదు. అంతకు ముందున్న బండికూడా లేదు. మాబండికి తాను డబ్బిచ్చాననీ, డాక్టరుకోసం కబురుచేశాననీ ఆవిడ - సరస్వతి - చెప్పింది.

"ఎక్కడికో ప్రయాణమయినట్లున్నావు. వెళ్ళిరా " అన్నాడు నాస్నేహితుడు.

"ఏం ఫరవాలేదు " అన్నది సరస్వతి, మెల్లగా తల్లో పూలు తీసి మంచంమీద పడుకున్న నాస్నేహితుడి దిండు ప్రక్కగా పెడుతూ. నేనొక కుర్చీలో దూరంగా కూర్చున్నాను. మాభోజనంవిషయం సరస్వతి అడిగింది. భోంచేసే బయలుదేరామని చెప్పాను.

"కాస్సేపు తర్వాత బయట గుర్రబ్బండి ఆగింది. డాక్టరు లోపలికి వచ్చాడు. నాస్నేహితుణ్ణి పరీక్షించి

"ఇప్పుడే చెప్పలేను. టైఫాయిడ్ కావచ్చు" అన్నాడు.

"నాకేమీ తోచలేదు. నా స్నేహితుడికి టైఫాయిడ్ జ్వరమే అయితే అతన్ని ఈ సరస్వతి ఇంట్లో ఎట్లా ఉంచటం? ఇంకెక్కడికైనా తీసుకుపోదామనుకున్నాను. కాని నా దగ్గర డబ్బులేదు. నా స్నేహితుడి దగ్గర కూడా లేదు. అతని సంగతి అలా వుండనీ. నా సంగతేమిటి? శరీరం అమ్ముకొని జీవించే ఆ మనిషి ఇంట్లో నేనెంతకాలం ఉంటాను? అతన్ని విడిచి ఎట్లా పోవటం? మా గుర్రబ్బండికి ఆమె డబ్బివ్వటమే నాకు అవమానంగా తోచింది. డాక్టర్ను కూడా ఆమే పిలిచింది.

"ఆమె బయటకు వెళ్ళిపోతే ఈ విషయాలన్నీ నా స్నేహితుడితో మాట్లాడదామనుకున్నాను. కాని ఆమె ప్రయాణం మానేసింది. పైగా రోగి దగ్గర నుంచి ఇవతలికి రాదు! ... ఆమె ఆ రాత్రి ఎంత సంపాదన పోగొట్టుకుందో నాకు తెలీదు.

"డాక్టరు ఏవో మందులు రాసి ఇచ్చి వెళ్ళాడు. అప్పటికి పదకొండు దాటింది. ఆ రాత్రి అక్కడే పడుకున్నాను. కళ్ళు మూసుకొన్నాను. కాని నిద్ర రాలేదు. నేను కళ్ళు తెరిచి చూచినప్పుడల్లా ఆ సరస్వతి అతని పక్కనే కూర్చొని వుంది. పొద్దున నిద్ర లేచి చూస్తే ఆ మంచం చివర అడ్డంగా పడుకొని నిద్రపోతూ వుంది. నా స్నేహితుడిపట్ల సరస్వతి చూపించిన శ్రద్ధ ఏలాంటిదో చెప్పలేను. ఆమె ఏడిచిందనీ, కంగారుపడిందనీ నువ్వు అనుకోకు. మొదట్లో నాకామెను చూస్తే కోపం కలిగింది. పెళ్ళాడిన భార్యలు కూడా చూపించని శ్రద్ధ

ఈనీతిలేని మనిషి కేమిటి అనుకొన్నాను.

"మర్నాడు ఉదయం సరస్వతి ఇంటిపనుల్లో వున్నప్పుడు నాస్నేహితుడితో కొంత చర్చించాను.

"నీకు అర్జంటుపని లేకపోతే ఇక్కడే వుండు. ఏం ఫరవాలేదు. కాని ఎరిగినవాళ్ళుంటే వెళ్ళి కొంతడబ్బు తీసుకరా! దానిదగ్గర ఎక్కువ డబ్బుండదు. ఎంత సంపాదించినా అంతా ఖర్చు చేస్తుంది. పైగా మొండిమనిషి! నేనిక్కడ మంచంలో వుంటే బయటికి వెళ్ళి డబ్బు తీసుకురాదు" అన్నాడు నాస్నేహితుడు.

"నేను వెళ్ళి ఇరవైరూపాయలు మాత్రమే తేగలిగాను. అయితే అదృష్టవశాత్తు నాస్నేహితుడిజబ్బు టైఫాయిడ్ కాదు. వారంరోజుల్లో అతనిజ్వరం పూర్తిగా పోయింది. కాని ఆవారంరోజులలో నేను అనుభవించిన బాధ నాస్నేహితుడి జబ్బుకన్న ఎక్కువఅంటే నమ్ము. నాకాయింట్లో ప్రతిక్షణం ముళ్ళమీద వున్నట్టే తోచింది. ఆ సరస్వతిని గౌరవంగా చూద్దామని ఎంత ప్రయత్నించినా నావల్లకాలేదు. కాని ఆ మనిషి నాస్నేహితుడిమీద చూపిన శ్రద్ధ నామీద నాజన్మలో ఎవరూ చూపలేదు. ఇంతకన్న నీచమైనమనిషి నామీద అటువంటి శ్రద్ధ, ఆదరం చూపినా నేనెంతో సంతోషించి వుండేవాణ్ణి. నాస్నేహితుడు తరవాత నాతో చెప్పినట్టు నేను పదిరూపాయలు పారేస్తే ఆమె నాదగ్గరికి వస్తుంది. కాని తనకు తానే నన్నుగురించి ఒక్కక్షణంకూడా ఆలోచించలేదు. ఈ సంగతి నేనెరుగుదును. నీతివిషయంలో నాస్నేహితునికన్న

నే నెంతో మంచివాణ్ణి. కాని ఏం లాభం? నన్నెన్నడూ ఏ స్త్రీ కూడా నిజంగా - నా స్నేహితుణ్ణి ఆ సరస్వతి ప్రేమించినట్టు - ప్రేమించలేదు.

" ఆ వారం రోజుల్లో సరస్వతి కొన్ని వస్తువులు కూడా అమ్మింది. నాకు కాఫీ చేసి ఇచ్చింది. భోజనం పెట్టింది. సిగరెట్లు కొనిపెట్టింది. పరాయివాణ్ణనే భావం పోయినాక నా యెదుటే సిగరెట్లు కూడా కాల్చింది. ఆమె డబ్బు తినడం అన్యాయమని నాకు తెలుసు. అది నీచమని కూడా నా మనస్సుకు తోచింది. కాని ఈ భావాలన్నీ అటు పెట్టి ఎవరైనా నన్ను అలా ప్రేమిస్తే బాగుండునని అనుకొన్నాను. ఎవరో అనటం ఎందుకు? ఆమే నన్ను ప్రేమించరాదా అనిపించింది. ఈ భావం కలిగినప్పుడు నేను నా స్నేహితుడికేదో అన్యాయం చేస్తున్నానని కూడా అనిపించింది.

" దురదృష్టవశాత్తు ఇది ఒకటే నే నెరిగిన నిజమైన ప్రేమ."

అంతా విని రామారావు, " దారుణం! ప్రేమను యెంత నీచంగా చిత్రించారండీ. ఇంకా ఉదాత్తమైన ప్రేమను గురించి చెబుతారనుకున్నాను" అన్నాడు.

" నేను నీకన్న ఒక తరం ముందు పుట్టినవాణ్ణోయ్. నేను స్వయంగా ఎరిగిన ఉదాత్తమైన ప్రేమ ఇదే. మీ తరం వాళ్ళు ముందడుగు వెయ్యండి. ఇంకా ఉదాత్తమైన ప్రేమను సృష్టించండి!" అన్నాను.

# బాంధవ్యం

## శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహ శాస్త్రి.

Isukapalli Lakshminarasimha Sastry is a lawyer who has taken seriously to creative writing. Many of his stories and plays deal with the attitudes of the middle classes toward sex and morals. The dialogues in his plays lack the quality of naturalness, though he shows good technique in constructing a story. He is also a promising novelist.

The following play, though melodramatic in its treatment, makes an interesting reading.

# బాంధవ్యం

<u>పాత్రలు</u>:

మూర్తి

నర్సు

లేడీ డాక్టరు

[మూర్తి గదిలో కుర్చీలో కూర్చుని చాలా ఆయాసపడుతూ ఉంటాడు. క్షణంలో గభాలున లేచి, గది నాలుగు మూలలకూ పిచ్చివానిలాగ తిరుగుతూ ఉంటాడు. చప్పున వాకిలి దగ్గరకు వెళ్ళి, కళ్ళు పెద్దగా చేసి ఆశ్చర్యంగా నిలబడిపోతూవుంటాడు. చాలా అలసటతో విరామం లేకుండా, కాలుకాలిన పిల్లిలాగ ఆగదిలో తిరుగుతూవుంటాడు.]

మూర్తి: (తనలో) అబ్బ! ఇంకా రాలేదే. (రిస్టువాచి చూసుకుంటూ) చాలా టైమయింది. (చప్పున ఆగి) ఏమీ ప్రమాదం లేదుకదా. ఇంకేం ప్రమాదం అవుతుంది. అవాలసింది అయిపోయింది. (తల ఊపుతూ) స్పృహా వచ్చి నన్ను అడుగుతుందో, ఏమి గాభరా పడుతోందో! (మెల్లగా) నేనే వెళితే! అమ్మో, నేను వెళ్ళి ఏంచేస్తాను. ఏమీ చెయ్యలేను! నేను కనిపించకుండా ఉండటమే మంచిది. (ఎడమ చేతి చూపుడు వ్రేలుతో తలమీద కొట్టుకుంటూ) పాడు బుర్ర! ఏమీ తోచనీదు!

ఇలాంటి సమయంలో కూడా ఏమీ ఆలోచనలు కలగవు .... (చప్పున గంతేసి) అదిగో వచ్చింది!...

నర్సు:(పక్క గదిలోకి గబగబ వెళ్ళుతూ) ఏమండీ!...

మూ: స్పృహ వచ్చిందా! అబ్బ! ఆలస్యం చేశారేమండీ!...

న : స్పృహ యింకా రాలేదు!...

మూ: ఆఁ! ప్రమాదం ఏమీ లేదు కదా!

న : అది తప్పిపోయింది లెండి! ఇంకో అరగంటలో స్పృహ కూడా వచ్చేస్తుంది. మేము చెయ్యవలసినదంతా చేశాం! కాని....

మూ: మీరు మాత్రం ఏం చెయ్యగలుగుతారు. దేవుళ్ళా ప్రాణం యివ్వటానికి. ఇంతకీ మాకు అదృష్టం లేదు. నేను ఎందుకూ బాధపడటం లేదు: జయకు స్పృహ వచ్చిన తర్వాత నేను చెప్పవలసిన సమాధానం ఏమిటో అని ఆలోచిస్తున్నా. అంతే!

న:(పళ్ళు బైటపెడుతూ): ఇంత మాత్రానికేనా! ఇంకా నయం. ఆమె అదృష్టవంతురాలు!

మూ: ఆ అదృష్టం నాది. (గంభీరంగా చూస్తూ) ఆ అదృష్టం నాది! ...

న : ఇలాంటి సమయాల్లో ఏ ప్రమాదమైనా జరగవచ్చు. అలాంటిది తప్పిపోయింది. మీరు చాలా అదృష్టవంతులు.

మూ: మీతో ఒక్క మాట: మీరెట్లాగైనా జయను బ్రతికించాలి.

న : ప్రమాదం లేదని చెబుతున్నానుకదాండి! ఇంకెందుకు కంగారు పడతారు! ఇంకో అరగంటలో స్పృహ కూడా

వస్తుంది. మీరు పెళ్ళి మాట్లాడవచ్చు రెండు రోజుల్లో ఇంటికి కూడా తీసుకుని పోవచ్చు.

మూ: అవునను కోండి! కాని, మీకు తెలీదు. జయ సంగతి మీకు తెలీదు. అందరి ఆడవాళ్ళ లాంటిది కాదు!...

న: ప్రతి మగవాడు తన భార్యను గురించి ఇట్లాగే అంటాడు లెండి! (కొంచెం నవ్వుతూ మూర్తి కళ్ళల్లోకి చూస్తుంది.)

మూ: (గంభీరంగా మొహం పెట్టి) మీరంత తేలికగా మాట్లాడటం న్యాయం కాదు. జయ అందరిలాంటి మనిషి కాదు, నేను తమాషాకు చెప్పటం లేదు. పిల్లలకోసం ఎంత ఆశపడిందో, ఎంత ఆవేదనపడిందో నాకు తెలుసు. మీకు ఆ విషయం ఎట్లా చెప్పాలో నాకు తెలియటం లేదు. ఆమె బాధ, ఆవేదన, ఆశ మీకు అర్థమయ్యేటట్లు చెప్పాలంటే నాకు చేతకాదు. నేను ఒప్పుకుంటాను! కాని నన్ను మీరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి!...

న: ఆడవాళ్ళు పిల్లలు కోరటం అతిసహజం. దాన్ని మీరు గోరంతలు కొండంతలు చేసి చెప్తున్నారు. అంతకంటె, ఏమీ లేదు. రోజూ ఇలాంటి కేసులు ఎన్నో చూస్తున్నాం, ఇదొకటే మీరు చూసింది. అలాంటి తల్లులందరూ మళ్ళీ క్షేమంగా ఇళ్ళకు వెళ్ళటం లేదా, మళ్ళీ మా దగ్గరకు రావటం లేదా! ఇది లోకంలో సహజమండి! ... నే వస్తా! నాకు...

మూ: మీకు నా మనస్సు అర్థం కాలేదు. నా హృదయంలోని ఆవేదన మీరు అర్థం చేసుకోవటానికి ప్రయత్నించటం

లేదు. జయ పిల్లలకోసం కలవరిస్తూ వుండేది.
పెళ్ళయినప్పటినుంచి ఆమెకు పిల్లలకోరిక తప్ప
ఇంకొకటి లేదు. నాకు పిల్లలంటే చిరాకని చెపితే
మీరు ఆశ్చర్యపడతారు! ఇంత వివరంగా
చెప్తున్నందుకు మీరు ఏమీ అనుకోకండి....
నా ఆవేదన మీతో చెపుతున్నాను. అంతే!....

న: అది సరే లెండి. (కొంచెంగా నవ్వుతూ): ఇపుడు
నేనేం చేయాలంటారు.

మూ: జయమనస్సు మీకు అర్థంకాదు. స్పృహ రాగానే
ఈ విషయం తెలిస్తే ఎంత బాధపడుతుందో అని
భయంగా వుంది.

న: మీ మగవాళ్ళు చాలా పిరికివాళ్ళు; ఆడదానికున్న
ధైర్యం, నిబ్బరం, నిండుతనం మీకు అర్థంకాదు.
మీకు అర్థమయ్యేటట్లు ఎట్లా చెప్పాలో నాకు
తెలియకుండా వుంది. ఇంతమాత్రానికే జయ ఏదో
అవుతూందంటే, నేను నమ్మలేకుండా వున్నా! ఇదంతా
మీ ఊహేగాని అంతకంటె ఏమీ లేదు. మేం వున్నాంగా.
ఆమెకు చెయ్యవలసినది ఏమిటో చేస్తాం. ఆమెగారికి
ధైర్యం వచ్చే మాటలు చెపుతాం. ఇది మాకు
అలవాటేగా! మీరు ధైర్యంగా వుండండి. ఆమె
భయపడిపోతుందని, ఇప్పుడు మీరు భయపడితే
ఏలాగ? ముందు, మీకు ధైర్యంచెప్పటం ఎట్లాగా
అని చూస్తున్నా!

మూ: మీకేం, మీరు ఏమైనా అంటారు. నేనేమీ
అనుకోనులెండి. మీరేమన్నా తమాషాకు కాదుగదా!

ఇంతకీ మీరు మమ్మల్ని అర్థంచేసుకోలేదు అనుకుంటాను.
అంతే! ఏమయినా కాని, మీరు జయను బతికించాలి!

న: అయితే నేనేం చేయాలంటారు? బిడ్డ పోయింది.

మూ: (ఉలికిపడుతూ) అవును. అవును.

న: ఆమెను మీరు ఓదార్చడానికి బదులు, మీరే
నీరైపోతున్నారేమిటండీ? నే వస్తాను. మీరు ఒకసారి
రండి అటు.

మూ: (చకచక వెళ్ళిపోతున్న నర్సును తెల్లబోయి చూస్తూ)
(తనలో) జయ, ధైర్యం, నిబ్బరం లేనిది. పిరికిది.
బిడ్డ పోయిందని తెలిస్తే, ఏమవుతుందో మరి!...
అవును. ఈ వయస్సులో పిల్లలేమిటి? అయిదేళ్ళవరకు
పిల్లలు ఉండగూడదని అన్నప్పుడు చాలా బాధపడింది.
ఎవరిపిల్ల కనిపించినా, తన చేతుల్లోకి తీసుకుని
మురిసిపోయేది. తనపిల్లను చూసుకుని సంతోషించే
యోగ్యత లేకపోయింది. (పెద్దగా నిట్టూర్పు విడుస్తూ
కుర్చీలో కూర్చుంటాడు.)

లేడీ డాక్టరు: ఏమండీ, ఎప్పుడొచ్చారు.

మూ: ఎట్లా వుందండీ....

లే: (పెద్దగా నవ్వుతూ) ఎట్లా వుంటుంది, క్రమంగా
కోలుకుంటుంది.

మూ: స్పృహా వచ్చిందా?

లే: ఆ. వచ్చినట్టే!...

మూ: (ఆశ్చర్యంగా) ఆ!

లే: మీరెందుకు భయపడతారు? ఇలాంటి తల్లుల్ని
ఎట్లా చూసుకోవాలో మాకు తెలీదా? మా బాధ్యత

మాకు తెలుసు. మీరు మాత్రం ధైర్యంగా వుండండి.
అంతే. ఆమెను చూడగానే మీరు కన్నీళ్ళు కారిస్తే
ఆమె స్థితి మళ్ళీ మొదటికి వస్తుంది. ఆమెకు మీరుకూడా
ధైర్యం చెప్పాలి. కూర్చోండి. నిలబడ్డారే? నేను
పిలుస్తాను. అప్పుడు రండి లోపలికి.

మూ: డాక్టరు గారూ! మీతో ఒకమాట. మీరేమీ
అనుకోవద్దు. నన్ను మీరేమన్నా ఇష్టమే. కాని
ఒకరహస్యం. జయకు ఈ విషయం తెలిస్తే
జీవిస్తుందనే నమ్మకం నాకు లేదు. మీరు ఏమైనా
అనండి. జయను బతికించవలసిన బాధ్యత మీది.
ఇంతకంటె నేనేమీ చెప్పలేను.

లే: (గంభీరంగా మూర్తి మొహంలోకి క్షణం చూసి)
ఏమిటీ ఇంత ఇదిగా చెప్తున్నారు.

మూ: (కంగారుగా) నేను ఇంత ఇదవుతున్నానంటే,
నేను భయపడి కాదు. జయ ఏమౌతుందో అని నా
ఆవేదన. నాకు చాలా ధైర్యంగానే వుంది. మీరు
నాస్థితి అర్థం చేసుకున్నారనుకుంటాను.

లే: (ఆలోచిస్తూ నిలబడి మూర్తి వైపు చూస్తూ) జయ
బాగుంది. జయ జీవిస్తుంది. ఏ భయమూ లేదు.
మీకు నిజం చెప్తున్నాను.

(లేడీడాక్టరు లోపలికి వెళ్ళిపోతుంది.)

మూ: (సంతోషంగా మొహం వెడల్పు చేసుకుని,
ఆదుర్దాగా ఆగది వైపుకే చూస్తూ, తనలో) జయకు
ప్రమాదం లేదు.

(లేడీడాక్టరు లోపలనుంచి ఎప్పుడు వస్తుందా అని

ఆదుర్దాగా ఎదురుచూస్తూ అటూ ఇటూ
తిరుగుతూ వుంటాడు. గోడగడియారం టిక్కుటిక్కు
మంటూ వుంటే వింతగా అటువైపుకే చూస్తూ
క్షణక్షణానికి తన రిస్టువాచీ చూసుకుంటూడు.
ఆదుర్దాగా గది తలుపుదగ్గరికి వెళ్ళి మళ్ళీ వెనకకి
వస్తాడు. లేడీడాక్టరు వస్తున్నట్లు అతనికి
తోస్తుంది. హృదయంలో ఆవేదన, ఆదుర్దా
ఎక్కువ అవుతుంది. ఆమె అతనిదగ్గరకు వచ్చి,
సైగ చేస్తుంది. ఇద్దరూ ఒకమూలకు వెళ్ళి
కుర్చీలలో కూర్చుంటారు.)

లే: ప్రమాణం చెయ్యండి. ఎవ్వరికీ చెప్పనని.

మూ:(ఆదుర్దాగా) ప్ర...మా...ణ...మా! దేనికి?

లే: చెపుతాను. ముందు ప్రమాణం చెయ్యండి.

మూ:(తెల్లబోతూ) స్పృహ వచ్చిందా? జయ
కళ్ళు తెరిచిందా? చెప్పండి.

లే: ఆఁ! నేనన్నమాటకు సమాధానం చెప్పరా?

మూ: ఏమి చెప్పాలంటారు. అసలువిషయం చెప్పండి.

లే: ఒక గొప్పింటివాళ్ళమ్మాయి కాలుజారింది. ఊళ్ళో
తెలిసిపోతుందని, చదువుకోసం అని బయలుదేరి
అక్కడ యిక్కడ కాలక్షేపంచేస్తూ, చివరికి
నా దగ్గరకు వచ్చింది. నన్ను సహాయం కోరింది.
నాదగ్గర ప్రమాణం తీసుకుని ఇక్కడ ఆసుపత్రిలో
చేరింది. ఆమెగూడా ఆడపిల్లనే కనింది. ఆపిల్లను
గురించి తీసుకోవలసిన శ్రద్ధ నామీద వుంది!...

మూ: (ఆశ్చర్యంగా, సంతోషంగా) ఆఁ!...

తే: అవును. ఈ రహస్యం నాకూ ఆ అమ్మాయికీ తప్ప
యిక్కడెవరికీ తెలీదు.... మిగిలిన వివరాలు మీకు
చెప్పడం అనవసరమనుకుంటాను.

(సమాధానంకోసం మూర్తి కళ్ళల్లోకి చూస్తుంది.)

మూ: (పెద్ద నిట్టూర్పు విడుస్తూ) ఆ అమ్మాయి ఎవరో
మాకోసమే యిక్కడకు వచ్చినట్లుంది.

తే: ఈ విషయం ఎవ్వరికీ తెలియకూడదు. మీ ఆవేదన
చూసి, నేను ఒక సాహసం చేశాను. జయను
బ్రతికించడానికి చేశాను. మీరు ఆదుర్దా
పడవలసిన అవసరం లేదు.... జయకు స్పృహ వచ్చి
కళ్ళు తెరిచినప్పుడు పక్కలో బిడ్డ వుంటుంది. మీకు
కావలసింది అదే గదా.

మూ: నాకు కావలసింది కాదు. జయకు కావలసింది.

తే: ఓ.కే. మీకిద్దరికీ కావలసింది. సరేనా? (నవ్వుతూ)
(మెల్లగా) నిజం చెప్పాలంటే, మీ సమస్యకన్న
నా సమస్య పెద్దది. ఈ పిల్లను ఏమి చేయాలి అని
బాధపడ్డాను. ఇప్పుడు నా సమస్యకూడా పోయింది.
మెనీ థాంక్సు!

మూ: నామీద మీరు చూపించిన అభిమానానికి
జయను బ్రతికించినదానికి చాలా కృతజ్ఞుణ్ణి. మీరు
ఒక పిల్లను మాకివ్వటం కాదు. ఇద్దరి ప్రాణాల్ని
కాపాడారు. ముఖ్యంగా మా జయ ప్రాణాన్ని
రక్షించారు. మీ ఋణాన్ని మరచిపోలేను.

తే: ఇప్పుడు చూడండి జయ ఎట్లా వుంటుందో.
మేము ఎన్ని మందులిచ్చినా ఆమె త్వరగా కోలుకోని

వుండదు. ఇప్పుడు తల్లిప్రేమ ఆమెకు బలం, ఆరోగ్యం, ఉత్సాహం యిస్తుంది. మీరు ఆమెను గురించి ఏమీ దిగులు పడవలసిన అవసరం లేదు. సంతోషంగా ఆమెను పిల్లను యింటికి తీసుకునిపోవచ్చు.

( ఆమె లేచి వెళ్ళబోతుంది. )

మూ: జయ దగ్గరకు వెళుతున్నారా?

లే: ఏం! ఏమన్నా చెప్పమంటారా? మీకు చూడాలనివుందా?

మూ: (నవ్వుతూ) ఎవరిని?

లే: ఏమో. మీకు ఎవరిని చూడాలని వుందో! కొంత ఆగండి. ఆమెను పంపిస్తాను....

మూ: ఎవరిని?

లే: ఆమెనే, మనకు పిల్లనిచ్చిన తల్లిని.

మూ: మరి నేను జయ దగ్గరకు వెళ్ళొచ్చా?

లే: ఇప్పుడే వద్దు. కాసేపు ఆగండి.

( మూర్తి గదిలో నెమ్మదిగా కూర్చొని అటూఇటూ కళ్ళు తిప్పుతూ ఆలోచనల్లో వుంటాడు. అటువైపు గది దగ్గర చప్పుడు అవుతుంది. చప్పుడైన వైపు చూస్తాడు. లేడీ డాక్టరు మెల్లగా ఒక పడుచు అమ్మాయితో మాట్లాడుతుంది. ఆ అమ్మాయి సంకోచంతో అడుగులో అడుగులు వేస్తూ, మెల్లిమెల్లిగా వెళ్ళిపోతుంది. వెళ్ళిపోతున్న ఆ అమ్మాయిని వింతగా చూస్తాడు మూర్తి. )

మూ: (గభాలున లేచి, తలుపు దగ్గరికి వెళ్ళి వెళుతున్న ఆ అమ్మాయిని చూస్తూ 'సునీత, సునీత' అని

తనలో రెండుసార్లు అనుకొంటాడు. కట్టెలాగ నిలబడుతాడు. కొన్నిక్షణాల తరవాత లేడీడాక్టరు చకచక వస్తుంది.)

తే: ఏమండీ!... ఏమిటి? అలా వున్నారు?

మూ: ఏమీ లేదు!

తే: ఏమిటి అట్లా వున్నారు? మొహమంతా ఎర్రబడిపోయింది. ఏమయిందేమిటి?

మూ: (గజగజ వణకుతూ) పంపించేశారా ఆ అమ్మాయిని?

తే: ఆ! ఇప్పుడే పంపించాను. మిమ్మల్ని చూపిద్దామనుకున్నాను. కాని ఆమె యిష్టపడలేదు. ఆమె మొహం యెవ్వరూ చూడకూడదన్నది. తన రహస్యం ఎవరికీ తెలియకూడదనింది.

మూ: మీకు అభ్యంతరం లేకపోతే, నేనొక ప్రశ్న అడుగుతాను. సమాధానం చెపుతారా?

తే: అడగండి. అనుమానం ఎందుకు?

మూ: ఏమీ లేదు! ఆమె పేరేమిటి?

తే: ఆమె పేరా? సునీత.

మూ: (మొహాన్ని రెండుచేతులలో మూసుకుని వణకుతున్న గొంతుతో) నా బిడ్డ చచ్చిపోలేదు. నా కూతురు బతికేవుంది. నా కూతురు నిజంగా బతికేవుంది.

('జయా! జయా!' అంటూ జయ వున్న గదివైపుకు పరుగెత్తిపోతాడు. లేడీడాక్టరు తెల్లబోయి చూస్తూ నిలబడిపోతుంది. తెర పడుతుంది.)

# శేషమ్మ

## శ్రీ గుడిపాటి వెంకటాచలం.

Gudipati Venkatachalam (1894 --), popularly known as 'Chalam', has been a great force in the modern period of Telugu literature. He was a teacher in a high school, and as a free-thinker he created great commotion in the conservative public. He fought relentlessly through his writings for the emancipation of women and for uninhibited attitudes toward sex and love. His writings, which run into several volumes, are widely read by the youth of the country. Whether one agrees or not with his views, he is universally recognized as a great stylist in Telugu prose. He freely uses English words and expressions, which lend a force and naturalness to his ideas. In his active life he lived as a free-thinker, a writer and a reformer and he has now retired to an Ashram to lead a life of meditation.

The character Seshamma, in the following sketch, represents a typical widow seen in many Brahmin families till recently.

ERIC

# శేషమ్మ

శేషమ్మకి యీలోకంలో అందమూ ఆనందమూ కనపడడం మానేసి ముప్పై యేళ్ళయింది. ఇతరులు నవ్వుతున్నా, తింటున్నా, పాడుతున్నా, ఆమెకి దుఃఖమో లేక ద్వేషమో కలుగుతుంది. పిట్టల పాటలు, పిల్లల నవ్వులు కూడా ఆమెని 'ఇరిటేట్' చేస్తాయి.

"పాడుపిట్టలు - పనిలేదు వీటికి. చావు కూడా రాదు వీటికి" అంటుంది.

ఆమెకి ఈ ప్రపంచంలో దుఃఖం, పాపం, బాధ, ద్వేషం యివి తప్ప మరేమీ కనపడటం లేదు. ఈ పాడు ప్రపంచాన్ని విడిచిపోవాలని అందరూ వినేలాగ "ఆ దేవునికి యెప్పుడు దయ కలుగుతుందో, యెప్పుడు పిలిపించుకుంటాడో భూలోకంలో నుంచి నన్ను!" అని చావును కోరుకుంటుంది.

ఆ దేవుడు తన తండ్రిలాగ తనని భూలోకమనే అత్తవారింటికి పంపినట్టు మాట్లాడుతుంది. నాలుగేళ్ళ క్రిందట జబ్బు చేసినప్పుడు "ఒరే, చస్తానురా, చస్తానురా, డాక్టరేమన్నాడు? ఆస్పత్రి పెద్ద డాక్టర్ని పిలుచుకుని రాండి. మా అమ్మ ఎనభై యేళ్ళు బతికిందిరా. ఇంత చిన్నదాన్ని నాకప్పుడే యేం చావు? అవును లే. నేను చస్తే ఎవరికేం? అందరికీ హాయిగా వుంటుంది" అంది మళ్ళీ.

ఆమె మొహాన నవ్వు చూసినవాళ్ళెవరూ లేరు. చిన్నపిల్లలు ఆడుకుంటూ గంతులేస్తే, "ఈ గంతులెన్నాళ్ళు,

మీకాళ్ళు విరగ! మీకేం చచ్చే కాలంరా, నెమ్మదిగా కూర్చోలేరూ? " అన్నట్టు చూస్తుంది. ఈప్రపంచంమీద, జీవితంమీద విసుగు చూపుతూ, అందం, ఆనందం వీటిని ద్వేషిస్తూ బ్రతకడం దేవునికి ఇష్టమైనట్లు ఆమెవుద్దేశం. ఈలోకంలో తనవంటి మంచివాళ్ళకు కష్టాలుతప్ప యింకేమీ లేవు కనక సుఖపడేవాళ్ళంతా దుర్మార్గులే అని ఆమె వుద్దేశం. తానుకష్టాలకోసమే పుట్టినట్లు శేషమ్మ అనుకొంటుంది.

" అదేమిటే ఆకామాక్షి అట్లా పాడుతూవుంటుంది యెప్పుడూ! ఎన్నాళ్ళు పాడుతుంది? మొగుడి వుద్యోగం వూడితే తెలుస్తుంది ఆమెగారి ఆనందం " అంటుంది.

శేషమ్మని " ఎట్లా వున్నారమ్మా? " అని అడిగితే " బాగానే వున్నా " నని యెప్పుడూ అనలేదు.

ఈదేశంలో ఆమాట అనేవాళ్ళే తక్కువ. బాగావున్నాకూడా బాగా వున్నామని తెలుసుకున్నవాళ్ళు చాలా తక్కువ. తెలుసుకున్నా 'బాగా వున్నా'మని అంటే తమ అదృష్టం పోతుందని ఆమాట అనరు. అంతేకాక బాగా వుండడం పాపమనీ, పాపాత్ములుమాత్రమే బాగావుంటారనీ, బుద్ధిలేనివాళ్ళు మాత్రమే బాగావున్నామనుకుంటారనీ వాళ్ళ నమ్మకం.

" ఏం బాగుండడమమ్మా! కుర్రాడికి నిన్నటినుంచి జబ్బు! ఇంతవరకు కన్ను తెరవలేదు. ఆవు పాలివ్వడం మానేసింది. మొన్ననే మాతాతగారి సవతితల్లి మేనమామ పోయినాడు. ఆయన మనమడు మూడోక్లాసు తప్పాడు. ఇట్లా వుంది మా అదృష్టం. ఏమోనమ్మా! యీకాలంలో

అంతా మాయ మాయలోకం, మాయమనుషులూ! అవునులే,
ఏది శాశ్వతం? ఈ దేహమూ అంతేకదా!" అంటుంది.

"దగ్గిరాలవారింట్లో పెళ్ళయిందా? వాళ్ళకేం? పెళ్ళిళ్ళూ చేస్తారు. వడుగులూ చేస్తారు. వాళ్ళ తాతలు మూటలు సంపాయించి వదిలిపెట్టి పోయినారుగా! ఒక నీతా, న్యాయమా? ఏముంది, పరాయివాళ్ళని దోచుకుంటారు! పెళ్ళిళ్ళుచేస్తారు!"

డబ్బు వుందంటే అది అన్యాయంగా వచ్చిందనే ఆమె వుద్దేశం.

ఎవరన్నా - "ఆ రత్తమ్మ! మొన్న రాత్రి పారిపోయిందటమ్మా!" అంటే, శేషమ్మ "ఛీ! ఛీ! అట్లాంటి మాటలు నాతో చెప్పకు. నాకెందుకు పరాయివాళ్ళ సంగతులు.... ... ఎవడితో?"

"అక్క యింటికి?"

"ఇంతేనా? పారిపోయిం దంటావేం?"

"ఏమో వాళ్ళంటే నేనన్నాను."

కొంచెం ఆగుతుంది శేషమ్మ, యింకా యేమన్నా చెపుతారేమోనని. చెప్పకపోతే -

"నాకెందుకమ్మా! కాని అక్క యింటికి యెవరు తీసికెళ్ళారు? ఎవడో మగవాడు తీసుకెళ్ళి వుంటాడు. బాగా చూడవును. నాకెందుకులే. వద్దన్నా నాకెందుకు చెపుతావు! అక్క యింటికెళ్ళిందా? ఆ అక్క సంగతి తెలుసుగా! దాని షోకులూ, నాజూకులూ. — నాకెందుకమ్మా! బండెడు చాకిరితో చస్తున్నాను."

"మీ కోడలు పనిచెయ్యదా?"

"అయ్యో, దాని చేతులు పువ్వులు."

"మీ కూతురో?"

"మా కూతురికి గంపెడు రోగమమ్మా! అదేం చేస్తుంది. దాని మొహం!"

"అలాగా అమ్మా! బాగానే తిరుగుతూ వుంటుందే!"

"మీ కంటికి అట్లానే కనపడుతుంది. దాని ఆరోగ్యం బాగుండడంలేదమ్మా"

"మరి యెప్పుడూ అల్లా చిరుతిళ్ళు తింటే-"

"అయ్యో, ఏం తింటుంది? అన్నం అసలే తినదు. చిరుతిళ్ళు కూడా లేకపోతే ఎట్లా?"

"మా కూతురమ్మా, మా సుబ్బులక్ష్మి. దానికి ఒక్క రోజు కూడా జబ్బు చేయలేదు."

"ఎందుకు చేయదమ్మా? అట్లా తిరిగేవాళ్ళకు గభాలున జబ్బు చేస్తుంది. మా మామ మనమడికి అలాగే అయింది."

శేషమ్మ ప్రపంచం పనీ, ఆచారమూ. పొద్దున నాలిగింటికి లేచి, రాత్రి పదకొండింటి వరకు పని చేయడం. ముప్పై యేళ్ళ నుంచి రోజూ ఆ విధంగా పని చేస్తూ వుంది. ఆమె పని చేసినంతసేపూ ఆమె నోరు కూడా పని చేస్తూ వుంటుంది - మాటలతో, తిట్లతో. రాత్రి అల్లరి చేసిన పిల్లలకే, యెలికలకే పొద్దున తిట్లు; తరువాత పదింటిదాకా పనిమనిషికి తిట్లు; అల్లరి చేసే పిల్లలకే, పిట్టలకే తిట్లు; కాయగూరలవానికే, గొల్లదానికే తిట్లు. ఆమె వుద్దేశంలో ముప్పై యేళ్ళలోనూ ఒక రోజు కూడా చిక్కని పాలు పొయ్యలేదు గొల్లది; మంచి కాయగూర తెవ్వలేదు కాయకూరలవాడు. ఇరుగు పొరుగు వాళ్ళనీ, కోడలినీ,

కొడుకునీ, దేవుణ్ణీ, పిట్టల్నీ, దారిలో పోయేవాళ్ళనికూడా తిడుతుంది. ఎవరూ లేకపోతే రాత్రి పదింటికి తనని తాను తిట్టుకోవడం ప్రారంభిస్తుంది. శేషమ్మ పనిచేయకుండా తిట్టకుండా వుండదు. ఆమె శరీరం పనిచేసే మెషీన్ అయిపోయింది. ఆమెకు 'ఇన్‌టెలిజెన్స్' ఎప్పుడో పోయింది. 'రొటీన్' తప్ప యింకేమీ ఆమె చేతకాదు. ప్రోగ్రామ్ కొంచెం తప్పితే, ఆరోజు యిల్లు పడుతుంది. అంట్లుతోమడం, యిల్లు కడగడం, వంటచేయడం, మైలమైల అని అరవడం— యిదే ఆమె బతుకు! ఒక కొత్తపనీ, ఒక కొత్త ఆలోచన రెండూ ఆమె చేతకాదు. అందువల్లనే మార్పు అంటే భయం. కర్ర లేకుండా పాఠం చెప్పమంటే స్కూలుమాస్టరుకి యెట్లా వుంటుందో, యింగువ లేకుండా వంటచేయమంటే ఆమె కట్లా వుంటుంది. కలం కాగితం లేకుండా పనిచెయ్యమంటే గుమాస్తాకి యెట్లా వుంటుందో, మడికట్టుకోకుండా వండమంటే ఆమెకట్లా వుంటుంది. ప్రపంచం ముక్కలుగా నాశనమైనా ఆమెకి ఆశ్చర్యం కలగదు. ఆమె చేసే పని యెవరికి లాభమంటే, యేమీ కనపడదు. అందరూ ఆమెని చూచి విసుగుచూపేవాళ్ళే గాని దయచూపేవాళ్ళు లేరు. నలుగురికి భోజనం పెడుతుంది, తాను తింటుంది. ఇంటిని మురికి చేస్తుంది. ఎందుకు? కడగడానికి? కడగడమెందుకు? మళ్ళీ మురికి చెయ్యడానికి. అంతకాలం వంటచేస్తే మూడువందలమందికి భోజనంపెట్టవచ్చు వొకమనిషి. స్వర్గంలో అంట్లుతోమడమూ, బట్టలు ఎండవేయడమూ, ఇల్లు కడగడమూ లేకపోతే ఏంచేస్తుందో శేషమ్మ.

పాపం, ఆశనీ, ఆనందాన్నీ, కోరికల్నీ వదిలిపెట్టి,

ఆవంటిల్లే తనప్రపంచంగా, తన బాధే ఆనందంగా, బతుకుతూ వుంది శేషమ్మ. దేశాలు పడిపోనీ, ప్రపంచం నాశనం కానీ, ఆమెకేమీ సంబంధం లేదు - తనయింటికి వంద అడుగులు దాటి ఆమె మనసు పనిచెయ్యదు.

కాపురం, పిల్లలు, ప్రేమ, ఏమీ లేక సొంతంగా తనది అనే ఆస్తిగాని, ఇల్లుగాని లేక, క్రమంగా మనసు మొద్దైపోయి నిలిచింది ఆమె. పురాణాలలో విన్న కొన్ని మాటల్ని తన జీవితానికి ఆధారం చేసుకొని, కన్నంలో యెలికవలె బతుకుతూంది. ఎవరికైనా ప్రేమించడంకన్నా ద్వేషించడం సులభం. ప్రేమ మనిషిని తన సొంతంగా ~~చేసుకోవా~~లని ప్రయత్నిస్తుంది. ఈ పేదవితంతువుకు సొంతం కావడానికి ఎవరు ఒప్పుకొంటారు? తనకోడలికి బిడ్డలు పుడుతూవుంటే తన సొంతం చేసుకోవాలని చూసింది. ఆకోడలు ప్రతినిమిషమూ చూపు చేతనే ఆపిల్ల తనదని జ్ఞాపకం చేస్తుంది. ఆపిల్లలు మూడేళ్ళు రాగానే కర్రలు తీసుకుని కొట్టేవారు ఈపేదవితంతువుని. ప్రేమ లేక, సంతోషం లేక, జీవితంలో యింటరెస్టు లేక, తను ఏ బాధపడినా దయచూపేవారు లేక, ఇంటిచాకిరిలో తన జీవితాన్ని, ద్వేషంలో తన ప్రేమనీ, తిట్లలో తన ఆనందాన్ని సార్థకం చేసుకోవాలని ప్రయత్నిస్తుంది. ఇట్లా ఎందరు యీ దేశంలో మొద్దైపోయిన ఆత్మలతో తమ జీవితాన్ని యితరుల జీవితాన్ని బాధపెట్టి చివరికి చావులో తప్పించుకొనే స్త్రీలు! కాని చావులోనైనా తప్పించుకుంటారా? వాళ్ళ జన్మలో వుందా ఈలోపం,

లేక వాళ్ళ నిట్లా చేసిన సంఘంలో వుండా? వాళ్ళు సంఘాన్నిట్లా బాధపెడుతున్నారా, లేక సంఘమే వాళ్ళని యిలా చేస్తుందా?

# ధర్మవడ్డీ.

## శ్రీ త్రిపురనేని గోపీచంద్

Tripuraneni Gopichand (1910-1963) was a leading writer of fiction in Telugu. His was a restless mind deeply agitated by the political, social and economic problems of the society he lived in. As a writer he felt he had something to say on these problems. His stories reveal the affinity he had for the rural folks and his sympathy for their problems. The usage of native idiom found in the speech of the rural middle classes of Guntur district adds charm to his style. His stories are collected and published in two large volumes. One of his novels was awarded a posthumous prize by the Indian Academy of Letters at Delhi.

The following story depicts one aspect of village life in Andhra.

# ధర్మ వడ్డీ

నేనా వూరు ఎందుకు వెళ్ళానో, నాకిప్పుడు జ్ఞాపకం లేదు. కాని ఆవూరు నేను వెళ్ళటం, చిన్నప్పటి స్నేహితుడు కనపడటం, తన ఇంటికి నన్ను తీసుకుని వెళ్ళటం జరిగింది. కలవక కలవక కలుసుకోవటంవల్ల చిన్నప్పటి విషయాలు తలుచుకుని నవ్వుకుంటూ వున్న సమయంలో అతడొచ్చాడు.

ముందు నెమ్మదిగా తలుపు తెరిచాడు. కుడికాలు కడపలో పెట్టి అటూ ఇటూ దొంగచూపులు చూశాడు. చంకలో వున్న మూటని మెల్లగా రెండో చేతితో పట్టుకుని, తల ఓరగా పెట్టి అడుగులో అడుగు వేసుకుంటూ నా స్నేహితుని దగ్గరకు వచ్చి చంకలో మూట అందిస్తూ, "ఇదిగోనోయ్, డబ్బు" అన్నాడు.

అసలు అతన్ని చూడగానే నా స్నేహితుడు కొంత తెల్లబోయాడు. నా స్నేహితుని మొహంలో అంతకు ముందున్న సంతోషం మాయమైపోయింది. నెమ్మదిగా మూట తీసుకుంటూ "మనిషంటే నువ్వే మనిషివి సూరయ్యా, మాట తప్పని మనిషివి" అన్నాడు నా స్నేహితుడు.

ఈ మాటకు సూరయ్య సంతోషం పైకి కనబడనివ్వకుండా, "మాటలకేంలే! డబ్బు తీసుకోవడం కాదు. నెలరోజుల్లో అసలూ వడ్డీ చెల్చి ఇచ్చివెయ్యాలి. వడ్డీ నీకు తెలిసిందేగా - ధర్మ వడ్డీ - నెలకు నూటికి రూపాయన్నర." అన్నాడు.

" అలాగే సూరయ్యా, నెల దాటకముందే వడ్డీతో సహా ఇస్తాను " అన్నాడు నా స్నేహితుడు.

" ఇస్తానంటే కాదు. మాట తప్పకూడదు. మా అమ్మాయి పెళ్ళి నెలరోజుల్లో వుంటుంది. అప్పుడు డబ్బు కావాల్సి వుంటుంది. డబ్బు ఇవ్వకుండా కోర్టు గీర్టూ అంటే ... "

" అదేమిటి సూరయ్యా, నీ దగ్గర ఎన్నిసార్లు డబ్బు తీసుకోలేదు? ఎన్నిసార్లు తిరిగి ఇవ్వలేదు? - ఎప్పుడైనా మాట తప్పానా? "

" సరేలే. డబ్బు లెక్కపెట్టుకో. అన్నీ రూపాయలే. చిల్లర కొద్దిగా వుంది. మళ్ళీ నాకు రూపాయలే ఇవ్వాలి సుమా! నోట్లు గీట్లూ అంటే నేను తీసుకోను."

" నువ్వు చెప్పాలా, సూరయ్యా " అంటూ నా స్నేహితుడు మూట విప్పాడు. చూసేటప్పటికి నా తల తిరిగిపోయింది. ఆ మూటలో వున్నవన్నీ రాళ్ళే! చిన్న చిన్న రాళ్ళూ, పెద్ద పెద్ద రాళ్ళూ - నా కళ్ళని నేను నమ్మలేక నా స్నేహితుని ముఖం పరీక్షగా చూశాను. అతడు మాత్రం నెమ్మదిగా, జాగ్రత్తగా ఆ రాళ్ళని తీసి ఒక్కొక్కటే లెక్కపెడుతూ కూర్చున్నాడు.

నాకేమీ తోచక సూరయ్యను ఆపాదమస్తకం చూశాను. అతనింకా తల ఓరగానే పెట్టి లెక్కపెట్టబడుతూ వున్న రాళ్ళను రెప్ప వెయ్యకుండా పరీక్షిస్తున్నాడు. ఇంతలో నా స్నేహితుడు లెక్క పూర్తి చేసి, " సరిగా వుంది, సూరయ్యా " అన్నాడు.

" ఇవ్వాళ సరిగా వుంది అంటే కాదోయి.

ఇవ్వాళ తారీఖు ఇరవై. మళ్ళీ ఇరవైతారీఖు సోమవారంనాటికి నా డబ్బంతా వడ్డీతో సహా ఇచ్చెయ్యాలి" అని గట్టిగా చెప్పి, నాస్నేహితుడితో మూడుసార్లు 'ఇస్తాను' అనిపించుకొని వెళ్ళిపోయాడు సూరయ్య.

అతడు ఎప్పుడు వెళ్తాడా, అసలు సంగతి ఏమిటో తెలుసుకోవాలని కూర్చున్న నేను నాస్నేహితునివైపుకు చూశాను. అతడు చేత్తో సైగచేసి వాకిలివైపుకు చూపాడు. నేను అటు చూడటం, సూరయ్య గభాలున తలుపుతోసుకుని లోపలకు రావటం ఒకేసారి జరిగింది. అతడు ఇదివరకులాగ లేడు. ఆపాదమస్తకం వణికిపోతున్నాడు. కళ్ళు యెర్రగా వున్నాయి. ఊపిరి తెగ పీలుస్తున్నాడు. తలమాత్రం ఓరగానే వుంది.

ఒకక్షణం వాకిట్లో ఆగి రంయిన నా స్నేహితుడి మీదకు వచ్చి ఇలా కేకలువేశాడు: "ఏదీ నాడబ్బు? ఎన్నాళ్ళయింది? ఇదిగో అదిగో అంటూ కుక్కని తిప్పుతున్నట్టు నీయింటిచుట్టూ తిప్పుకుంటావా? నీకు పరువు మర్యాద న్యాయం వుందా? కడుపుకి అన్నం తింటున్నావా, గడ్డి తింటున్నావా?"

నిజం చెప్పాలంటే ఈమాటలకు నా ఒళ్ళు వణికిపోయింది. నాకు తెగ కోపం వచ్చింది. కాని ఏమి చెయ్యనటం? నాస్నేహితునివైపు చూస్తూ కూర్చున్నాను.

నాస్నేహితుడు భయంగా, అతివినయంగా "ఇదిగో సూరయ్యా, నీడబ్బు! నాలుగురోజులు

ఆలస్యమయింది. ఆ మాత్రానికే నీలాంటి పెద్దమనిషి ఇట్లా నోరు పారేసుకోవటం ఏం మర్యాద ?" అని తన దగ్గరే వున్న ఆ రాళ్ళ మూటని ఇచ్చాడు.

"మరి వడ్డీ డబ్బులు ? డబ్బు నాకు చేదై ఇచ్చావనుకున్నావా ? నీ తాతకి అప్పుండీ ఇచ్చాననుకున్నావా? పూర్తిగా ఇస్తేగాని నిన్ను వదలను " అని నాస్నేహితుణ్ణి పట్టుకొన్నాడు సూరయ్య.

"ఇస్తాను సూరయ్యా, మరి వొదులు" అన్నాడు నాస్నేహితుడు.

"తీసుకురా" అని ఒక్క తోపు తోశాడు సూరయ్య.

నాస్నేహితుడు పడబోయాడు. మెల్లగా గోడ పక్కకు వెళ్ళి, పదిరాళ్ళు తెచ్చి సూరయ్య చేతుల్లో పెట్టాడు. సూరయ్య వాటిని లెక్క పెట్టుకొని, నాస్నేహితునితో ఒక్క మాటైనా అనకుండా గిరుక్కున వాకిలివైపుకు తిరిగి తల ఓరగానే వుంచుకుని గబగబా నడిచి వెళ్ళిపోయాడు.

నాస్నేహితుడు ఒక్క నిట్టూర్పు విడిచి నేను అడగవలసిన అవసరం లేకుండా తానే ఇలా చెప్పాడు — "పాపం ఏం చెప్పడం ? ఒకప్పుడు ఈ వూళ్ళోకల్లా షావుకారు ఈ సూరయ్య. ఇప్పుడు పిచ్చెక్కి ఈ విధంగా అయ్యాడు" అన్నాడు.

"ఇతనికి పిచ్చా ? పిచ్చి ఎందుకెక్కింది ? పిచ్చిలో ఇదేమిటి ?" అని అడిగాను.

నాస్నేహితుడు సూరయ్య కథ ఈ విధంగా చెప్పాడు.

"సూరయ్య ఈ స్థితికి రావటానికి అతని తండ్రే కారణం. అతని తండ్రి చాలా మంచివాడు, మెత్తని హృదయం కలవాడు. అటువంటి తండ్రే కొడుకు నాశనం కావడానికి కారణంఅయ్యాడు.

"అంత మంచివాడు ...."

"చెప్తాను విను. అంత మంచివాడు కావటంవల్లే దానాలు చేసి, అడిగినవాళ్ళకు డబ్బు ఇచ్చి తన ఆస్తి అంతా పాడుచేశాడు. ఆస్తంతా పోయిన తర్వాత కుక్కచావు చచ్చాడు. ఇది కన్నులారా చూచిన సూరయ్యకు సంఘం మీద కసి ఏర్పడటంలో ఆశ్చర్యం లేదు. పూర్తిగా తన స్వభావాన్నే మార్చుకొని, వయసు వొచ్చినప్పటినుంచీ అన్నివిధాలా డబ్బు సంపాదించటం మొదలుపెట్టాడు.

మనుష్యుల్తో వున్న సంబంధాలన్నీ క్రూరంగా వదలిపెట్టాడు. తనకీ మిగిలిన మనుష్యులకీ ఒక్కటే సంబంధం - వడ్డీ వ్యాపారం. తాను వడ్డీకి డబ్బు ఇవ్వటానికి పుట్టాడు. మిగిలిన జనం డబ్బు పుచ్చుకొని వడ్డీ తనకు ఇవ్వడానికి పుట్టింది.

ఇట్లా తయారై, మిగిలిన రైతుల్ని నానా బాధలు పెట్టి కొద్ది సంవత్సరాలలోనే గ్రామంలోకల్లా షావుకారయ్యాడు. ఎంత షావుకారైనా డబ్బు సంపాదించటం అలవాటైన తర్వాత పద్ధతులు ఎలా మారుతాయి? దానధర్మాలు చేయడు. బాకీదార్లని ఎన్ని కష్టాలు పెట్టాలో అన్నీ పెట్టి దయాదాక్షిణ్యాలు చూపకుండా తన డబ్బు పిండుకునేవాడు.

ఈ పిండుకోవటంలో కూడా న్యాయం, ధర్మం చూపలేదు. కాపురాలు, కుటుంబాలు నాశనమైనా అతని హృదయం కరిగేది కాదు.

అందుకని అతని డబ్బుతోపాటు, అతని మీద వూళ్ళో వాళ్ళకు అసూయా అసహ్యం కూడా పెరుగుతూ వచ్చినై. అతన్ని చూస్తే భయమే తప్ప ఇష్టం గ్రామంలో ఎవరికీ లేకుండా పోయింది. సూరయ్య ఇది కూడా మంచిదే అనుకున్నాడు. "నాక్కావలసింది డబ్బు - వీళ్ళ ఇష్టం ఎవరిక్కావాలి ?" అంటూ వుండేవాడు. పరిస్థితులు ఇట్లా వుండగా ఒక సంఘటన జరిగింది.

ఈ వూళ్ళోనే అవతలి వీధిలో చంద్రయ్య అనే రైతు వున్నాడు. చంద్రయ్య ఈ సూరయ్య దగ్గర రెండువందల రూపాయలు అప్పు తీసుకున్నాడు. చంద్రయ్య చిన్నరైతే ఐనా, టౌన్తో సంబంధం వున్నవాడవటంవల్ల డబ్బన్నా, కోర్టన్నా లెక్క లేకుండా వుండేవాడు. డబ్బున్నవాళ్ళంటే అతనికి అసహ్యమే గాని, భయం లేదు. సూరయ్య అంటే చంద్రయ్యకి లెక్క లేదు. సూరయ్య హెచ్చు వడ్డీ వస్తుందని అతనికి అప్పు ఇచ్చాడు. కాని అప్పు ఇచ్చినప్పటినుంచి తన డబ్బు రాదేమో అనే భయంతో చంద్రయ్య ఇంటిచుట్టూ తిరగడం మొదలుపెట్టాడు. ఒకరోజు చంద్రయ్య ఇంటికి వెళ్ళి వెంటనే డబ్బిమ్మని అడిగాడు. నానామాటలు అన్నాడు. అప్పుడు చంద్రయ్య కోపంతో "నేను పైసా ఇవ్వను. నీ తాతతో చెప్పుకో! ముందు కడపలో నుంచి అవతలకు వెళ్ళు" అని కేకలు వేశాడు.

పాపం, సూరయ్యకు ఇట్లాంటి అనుభవం ఇదివరకెప్పుడూ కలగలేదేమో, చంద్రయ్య మాటలకు తెల్లబోయి ఒక్క నిమిషం మాట్లాడలేక పోయాడు.

"వెళ్ళవూ?" అని బెదిరించాడు చంద్రయ్య.

"చంద్రయ్యా, ఇది నీకు మంచిదికాదు; కోర్టుకులాగి నీ సంగతి తెలుసుకుంటాను" అని సూరయ్యకూడా బెదిరించాడు.

"కోర్టుకు లాగుతావా మాదచ్చోద్" అని నానా బూతులూ మాట్లాడి మెడపట్టి సూరయ్యను బయటకు గెంటాడు చంద్రయ్య.

ఇక చూడు సూరయ్య సంగతి. సూరయ్యకు వళ్ళుమండింది. కోపంతో, కసితో కనపడ్డవాడికల్లా "ధర్మవడ్డీ - ధర్మవడ్డీకూడా ఇవ్వడట. అసలే ఇవ్వడట! ఇదెక్కడన్నా వుందా? రాములవారి కాలంనుంచీ ఈ వడ్డీ వుందిగదా!" అని చెప్పుకొన్నాడు.

ఊరంతా తిరిగి తిరిగి ఇంటికి వెళ్ళి గబగబా నాలుగు మెతుకులు నోట్లో వేసుకొని, గొడుగు చంకన పెట్టుకొని టౌన్‌కి బయల్దేరాడు. వెళ్ళుతూ చంద్రయ్య వాకిలిముందు నాలుగైదుసార్లు అటూ ఇటూ పచారు చేశాడు; వీధిలో పోతున్నవారిని పిలిచి, "కొంచెం కోర్టులో పనివుండి టౌన్‌కి వెళ్తున్నాను" అని ఇంట్లో వున్న చంద్రయ్యకు వినబడేటట్లు చెప్పాడు. చంద్రయ్య "కోర్టుకాదు, నిన్ను పుట్టించిన బ్రహ్మదేవుడి దగ్గరకు వెళ్ళు. ఈ వూరు నీళ్ళు నీకు ప్రాప్తంలేదు" అని ఇంట్లోనుంచే కేక వేశాడు.

ఇంకేం చేస్తాడు ? చంద్రయ్య మాటలకు మనస్సులో
కొంచెం భయపడినా డబ్బు ఎలా వదులుకోవటం ?
తన్ను తాను తిట్టుకుంటూ టౌన్‌కి వెళ్ళి ప్లీడరుతో
మాట్లాడి చంద్రయ్యకు రిజిస్టరీ నోటీసు ఇప్పించాడు.
నోటీసు ఇప్పించాడే కాని మనస్సులో సూరయ్యకు
బాధ, దిగులు వొచ్చింది. దిగులుతో ఏమీ తోచక
టౌనులో అటూ ఇటూ తిరిగి ఇంటికి బయల్దేరాడు.
టౌన్‌నుంచి మావూరు రావాలంటే రోడ్డు దిగి
డొంకలో మైలు నడవాలని నీకు తెలుసు. సూరయ్య
డొంక దగ్గరకు వచ్చేటప్పటికి బాగా చీకటిపడ్డది.
రోడ్డు దిగేటప్పటికి అతనికి భయంవేసింది. ఆ డొంక
మా ఒక్క వూరికే వచ్చేదే అవటంవల్ల మనుష్యసంచారం
తక్కువగా వుంటుంది. పైగా రెండు పక్కలూ చీకట్లో
దెయ్యాలులాగ గుబురుగా ఎత్తుగా పెరిగిన చెట్లు.
ఒంట్లో కొంత వణుకు పుట్టింది. అయినా సూరయ్య
ధైర్యంతో ఆంజనేయదండకం చెప్పుతూ డొంకలో
పదిగజాలు నడిచాడు. ఆ పెద్ద మర్రిచెట్టు చూశావుగా,
అక్కడకు వొచ్చాడు. అకస్మాత్తుగా పక్క పొదల్లో
శబ్దం వినిపిస్తే, ఆగిపోయాడు. గొంతులో దండకం
గొంతులోనే ఆగిపోయింది. వెంటనే అతనికోసం
పొదల్లో కాచుకొనివున్న చంద్రయ్య అతని ముఠావాళ్ళు
పదిమంది సూరయ్యను చుట్టుకున్నారు. మీదకు
దూకారు. చావగొట్టారు. పాపం! కిందపడేసి
ఎముకలు విరిగేలాగ తన్నారు. చంద్రయ్య మీద పడి
అతని జేబులో వున్న ఇరవై రూపాయలూ లాక్కొని,

"దావా దాఖల్చేశావు గా! ఖర్చెవడు పెట్టుకుంటాడు? నీ తాత యిస్తాడా?" అని చావదన్ని మిగిలినవాళ్ళని తీసుకొని, సూరయ్యని అక్కడే వొదిలి వెళ్ళిపోయాడు.

ఒక్క క్షణంలో ఈ వార్త వూరంతా తెలిసింది. "సూరయ్యని కొట్టారంటే సూరయ్యని కొట్టా" రని వూరంతా చెప్పుకుంది. కాని ఒక్కడు కూడా జాలిపడలేదు. "పాపం" అన్న పాపాన పోయినవాడే లేడు.

సూరయ్య భార్యా, కూతురూ మాత్రం భోరున ఏడ్చారు. సూరయ్య భార్య మహా ఇల్లాలు. కూతురు కూడా చాలా మంచిది. కాని సూరయ్య మనస్సుని ఎలా మార్చ గలరు? బయట జరిగే సంఘటనల్ని వాళ్ళెలా ఆపగలరు?

సూరయ్యకు ఆ రాత్రంతా నిద్ర లేదు. ఏదో ఆలోచించుకుంటూ కూర్చున్నాడు. భార్యా కూతురూ నోటికి మాట లేకుండా ఏడుస్తున్నా, వాళ్ళ వైపు చూడలేదు. అన్ని దెబ్బలు తిన్నా ఒక్క మూలుగనా మూలగటం లేదు.

తెల్లవారిన తర్వాత వూళ్ళో షావుకార్లు సూరయ్యను చూడటానికి వచ్చారు. వచ్చి "సూరయ్యా, ఇక వూరుకుంటే లాభం లేదు. క్రిమినల్ దావా దాఖల్చేసి వాళ్ళ అంతు కనుక్కోవలసిందే!" అన్నారు.

సూరయ్య ఏమీ మాట్లాడలేదు. ఏదో ఆలోచించుకుంటూ పడుకున్నాడు. అతని మౌనాన్ని షావుకార్లు అపార్థం చేసుకుని, "కాదు సూరయ్యా!

మనం తప్పక గెలుస్తాం. అనుమానం లేదు..." అన్నారు.

సూరయ్య కొంచెం లేచి, వాళ్ళని చూచి, "ఇంకేం, అందరం చందాలు వేసుకుని దావా దాఖల్చేద్దాం" అన్నాడు.

చందాలు అనేటప్పటికి వచ్చిన షావుకార్లు ఒకరిమొహాలు ఒకరు చూసుకున్నారు.[F] "అదేమిటి సూరయ్యా! నిన్ను కొట్టడమేమిటి? మేం చందాలు వేసుకోవటమేమిటి?" అన్నారు.

ఈ మాటలకు సూరయ్యకు కోపం వచ్చింది. అంత బాధలో వున్నా లేచి కూర్చొని, "వాళ్ళు నన్ను కాదు కొట్టింది. నా దగ్గర వున్న డబ్బుని కొట్టారు. అంటే ఈ వూళ్ళో వున్న షావుకార్లందరినీ కొట్టారు. వడ్డీకోసం అప్పుపెట్టే ప్రతివాణ్ణీ కొట్టారు. నన్ను కొట్టటమైతే ఒక్క చంద్రయ్యే కొట్టేవాడు. మిగిలిన వాళ్ళంతా ఎందుకు నన్ను కొట్టారంటారు? వాళ్ళు కొట్టగలరు కనక అంతా కలిసికొట్టారు. మనం చందాలు వేసుకోగలం గనక అంతా కలిసి చందాలు వేసుకుందాం" అన్నాడు.

షావుకార్లకు ఇదేమీ అర్థం కాలేదు. దెబ్బల్లో సూరయ్యకు మతిపోయింది అనుకున్నారు. నెమ్మదిగా ఒకరితర్వాత ఒకరు లేచి జారుకున్నారు.

ఎంతమంది చెప్పినా ఎంత చెప్పినా సూరయ్య వినలేదు. కేసు పెట్టనంటే పెట్టనన్నాడు.[G] "నా సొంత డబ్బు తగలేసుకుని, ఈ డబ్బున్నవాళ్ళ కోసం కోర్టుకెక్కడమా? నే చెయ్యను" అనేవాడు.

కాని చంద్రయ్య ఏముహూర్తాన చెయ్యిచేసుకున్నాడో గాని, ఆక్షణంనుంచీ సూరయ్యను దురదృష్టం పట్టింది. దెబ్బలుతిని కేసు పెట్టకపోయేటప్పటికి వూళ్ళోవాళ్ళకి చులకన అయిపోయాడు. తాము ఏడబ్బుని చూచి భయపడుతున్నారో ఆడబ్బు సమయానికి సూరయ్యని రక్షించలేకపోయేటప్పటికి ఇంకేముంది ? పెద్దలుమొదలు కుర్రాళ్ళవరకూ సూరయ్యని చులకనగా హేళనచేయడం మొదలుపెట్టారు. వీధుల్లో కుర్రాళ్ళు అతన్ని చూస్తే "సూరయ్య వడ్డీ చంద్రయ్య లాఠీ" అని చప్పట్లు కొట్టుకుంటూ వెంటపడేవారు. రావలసిన డబ్బు అడిగితే బాకీదార్లు "ఏం తన్నులు కావాలా?" అనేవారు. కొందరు 'అదిగో అసలు, ఇదిగో వడ్డీ' అని తలమీద మొట్టికాయలు వేసేవారు కూడాను.

చివరకు సూరయ్యకు పైసాగవ్వ కూడా వసూలు కాకుండా పోయింది. ఎట్లా వచ్చిన డబ్బు అట్లాగే పోయింది. సూరయ్య తర్వాత తనకు వస్తుందనుకున్న ఆస్తి రాకుండా పోయిందని అల్లుడు కూతుర్ని ఇంట్లోనుంచి వెళ్ళగొట్టాడు.

సూరయ్య భార్యమొహం, కూతురుమొహం చూడలేక వీలైనంతవరకు ఇంట్లో వుండకుండా తిరుగుతూ కాలం గడిపేవాడు. ఇంట్లో నాలుగు మెతుకులు తిని చెరువుదగ్గర మర్రిచెట్టుక్రింద ఒంటరిగా కూర్చునేవాడు. ఇన్ని రాళ్ళు తెచ్చుకొని ఒక్కొక్కటే చెరువులో వేస్తూ, కూర్చునేవాడు.

కాని వూళ్ళో జనం అక్కడ అతన్ని సుఖంగా వుండనివ్వలేదు; అతన్ని చులకనచేసి బాధించటం మొదలుపెట్టింది. జనానికి అతనిమీద కలిగిన కసీ, కోపమూ అతనితోనే ఆగకుండ అతని కుటుంబంమీదకు తిరిగింది.

ఒకరోజు సూరయ్యకూతురు దొడ్లో గేదెలకు గడ్డివేస్తుంటే అకస్మాత్తుగా నలుగురు వచ్చి పట్టుకొని బలాత్కారంగా చెరిచారు. వాళ్ళు విడిచిపెట్టి వెళ్ళింతర్వాత ఆపిల్ల లేచి, నడవలేక నడవలేక వెళ్ళి, బావిలో పడి చచ్చింది. ఈసంగతి తెలిసి సూరయ్యభార్య కిరసనాయిలు పోసుకొని కాల్చుకొని మరణించింది. అదే సమయంలో విరోధులు సూరయ్యకు ఇవ్వవలసిన బాకీలు తమపేర ట్రాన్స్‌ఫర్ చేయించుకొని ఇల్లు వేలం వేయించారు...."

ఇంతవరకు ఓపికతో విని ఇక ఆపుకోలేక నేను ఈప్రశ్న వేశాను - "ఈ ఘోరాన్ని వూళ్ళో జరక్కుండా ఎవ్వరూ ఆపలేదూ?"

"తప్పన్నవాళ్ళే లేరు. చేసుకున్నది అనుభవిస్తున్నాడని కొందరూ, ఈ ఉద్రేకంలో అడ్డుచెపితే తమకుటుంబాలు ఏమౌతాయో అనే భయంతో కొందరూ - మొత్తానికి జనం అంతా చూసీచూడనట్లు వూరుకొన్నారు."

"ఊం! తరువాత ఏం జరిగింది?" అని అడిగాను.

"ఇంకేముంది? డబ్బంతా పోయింది.

కూతురూ, భార్యా అలా చచ్చారు. సూరయ్యకు మతిపోయినట్లయింది. ఎవరూ జాలి, దయ చూపలేదు. ఊళ్ళో అందరికీ చులకన అయ్యాడు. ఊళ్ళో కుర్రాళ్ళ మొట్టికాయలతో కొన్నాళ్ళకు పిచ్చెక్కింది. ఇప్పుడెవరన్నా జాలిచూపి ఇన్నిమెతుకులు పెడితే తింటాడు. ఆ చెరువు దగ్గర మర్రిచెట్టుకిందే వుంటాడు. ఎండలో అక్కడే ఉంటాడు. ఎప్పుడూ కూతురుసంగతి గానీ, భార్యసంగతి గానీ మాట్లాడడు. ఎవర్నీ పలకరించడు. ఎవరైనా పలకరించినా తాను పలకడు. రోజు కొక్కసారి వెళ్ళి తన పాత ఇంటిని దూరాన్నుంచి చూచి కన్నీళ్ళు పెట్టుకుంటూ వుంటాడనీ, రాత్రిళ్ళు తన కూతురు పడి చచ్చిన బావిదగ్గరకు వెళ్ళి బావిచుట్టూ తిరిగి వస్తూ వుంటాడనీ వూళ్ళో చెప్పుకుంటూ వుంటారు. ఇదీ సూరయ్య కథ... విషాదగాథ."

నేను కథంతా ఓపికగా విన్నాను. సూరయ్యకథ చెప్పమన్నప్పుడు ఇటువంటి విషాదగాథ వింటానికి సిద్ధపడలేదు గనక చాలా బాధపడ్డాను. "మరి ఈ రాళ్ళ విషయమేమిటి?" అని అడిగాను.

"అలవాటు" అన్నాడు నా స్నేహితుడు. "పాత అలవాటుప్రకారం ఇలా చేస్తూ వుంటాడు. మేం కూడా జాలిపడి పిచ్చివాని మనస్సుని కష్టపెట్టడం ఎందుకని తగిన విధంగా ప్రవర్తిస్తూ వుంటాం. ఈ సూరయ్య...."

నా స్నేహితుడు చెబుతూ వుండగానే వీధిలో పెద్దగోల వినిపించింది. "సూరయ్యవడ్డీ, చంద్రయ్యలాతీ"

అని కేకలు, బయటనుంచే సూరయ్య 'చే' అని అరిచాడు. ఆ అరుపు విని మేమిద్దరం బయటకు పరుగెత్తాం.

బయటవీధిలో సూరయ్య గబగబా నడుస్తూ వెళ్ళన్నాడు. అతని చంకలో నాస్నేహితుడిచ్చిన మూట జాగ్రత్తగా వుంది. అతని వెనక పదిమంది పిల్లలు గుంపుగా గోల చేసుకుంటూ సూరయ్య మీదకు రాళ్ళు వేస్తున్నారు.

నడుస్తూ వున్న సూరయ్య అకస్మాత్తుగా పరుగెత్తటం మొదలుపెట్టాడు. రంయిన పరుగెత్తి, ఒక ఇంటిముందు ఆగి, ఒక్క నిమిషం ఆయింటిని చూచి, అక్కడనుంచి కదిలి పక్కనే వున్న బావిదగ్గర నిలబడ్డాడు. పిల్లలంతా ఎక్కడివాళ్ళు అక్కడే ఆగిపోయారు. చేతుల్లో రాళ్ళు చేతుల్లోనే వున్నాయి. నేనూ, నాస్నేహితుడు వూపిరి పీల్చకుండా చూస్తూ నిలబడ్డాం. సూరయ్య వంగి బావిలోకి చూచి లేచి, ఇంటివైపుకి చూశాడు. 'చే' అని సైరన్‌లాగా విన్నవాళ్ళకి వణుకు పుట్టేటట్లు అరిచి రాళ్ళ మూటతోసహా బావిలోకి దూకాడు.

ఊళ్ళోవాళ్ళంతా బావిచుట్టూ చేరారు. కాని ఏమీ లాభం లేకపోయింది. శవం బయటకు వచ్చింది. తర్వాత — మేం ఇంటికి వచ్చిన తర్వాత — నాస్నేహితుడు ఇలా చెప్పాడు: "ఆ ఎదురుగా వున్న ఇల్లే అతని ఇల్లు. అతడు దూకిన బావే అతనికూతురు పడి చచ్చిన బావి."

# ఫస్టు కేస్

శ్రీ మునిమాణిక్యం నరసింహారావు.

Only a few Telugu writers are successful in writing humorous fiction, and Munimanikyam Narasimha Rao (1898 --) ranks high among them. His 'Kantam kathalu' (the stories of Kantam), a large collection of short-stories, represent the best form of humor in modern Telugu. The character 'Kantam', the author's imaginary wife in the stories, is a fine creation, more real than fictitious.

'First case' is a story about an insurance agent who starts his career very seriously and fails ridiculously in his very first attempt. A few of the dialectal variations of Krishna District may be seen in the language of this author.

# ఫస్టు కేస్

ఏజెంట్ల మీటింగు అయిపోయింది. అందరూ ఎవరి దారిని వారు వెళ్ళి పోతున్నారు. తాము ఆ సంవత్సరములో చేయించిన బిజినెస్‌కు, తమకు రావలసిన కమిషన్ తీసుకొని, సంతోషంగా వెళ్ళి పోయినారు[A] చాలా మంది.

ఈశ్వరరావు మాత్రం ఒక్క పైసా అయినా తీసుకోకుండా ఒట్టి చేతులతో వస్తున్నాడు. అందుకనే అతడు చాలా విచారంగా దిగులుగా ఉన్నాడు.

జనరల్ మేనేజరు పిలుస్తున్నాడని ఈశ్వరరావుకు కబురు వచ్చింది. అతడు వెళ్ళి ఆ మేనేజర్‌కు యెదురుగా కూర్చున్నాడు.

మేనేజరు అన్నాడు, "ఏమండీ, మీరు ఏజెన్సీ పుచ్చుకొని అయిదారునెలలు అయింది, ఒక్క కేసు అయినా పంపలేదు. ఏమిటి సంగతి?"

"నా లోపం లేకుండా కృషి చేస్తున్నాను. నాకి కాలం కలిసిరావటం లేదు. నాకు అదృష్టం లేదు." అన్నాడు రావు.

"మిస్టర్ రావ్! ఇన్సూరెన్సులో అదృష్టమన్నా దురదృష్టమనీ అంటూ ఏమీ లేదు[B]! నీవు బాగా ప్రయత్నించి పని చెయ్యాలి."

"ఏమి చేయమంటారు?"

"నీవు ప్రతి నిముషమూ కూడా ఇన్సూరెన్సును గురించి ఆలోచించాలి!"

"ఇన్సూరెన్సును గురించి పుస్తకాలు చదువుతున్నా

నండీ! "

" చదువుతున్నావా? అయితే ఆపేసెయ్యి! అల్లాంటి పిచ్చి పనులు ఏమీ చేయకు. పుస్తకాలు చదవటంవల్ల బిజినెస్ గురించి తెలియదు. మానవజీవితాన్ని తెలుసుకో, తెలిసిందా? "

ఈశ్వరరావు తెలిసినట్లు తల ఊపాడు. మేనేజరు మళ్ళీ ఇట్లా అన్నాడు: " మనిషి తన భవిష్యత్తును గురించి సాధారణముగా ఆలోచించడు. ఆ విషయం నీది. అతని భవిష్యత్తును గురించి ఆలోచించవలసిన పని నీది. తెలిసిందా? "

" తెలిసిందండి. ప్రతివాడూ తన భవిష్యత్తును గూర్చి ఆలోచించడు. వాడు చస్తే వాడి పెళ్ళాం, వాడి బిడ్డలగతి ఏమౌతుందా అని నేను దిగులుపడి వాడికేదో ఒక ఉపాయం ఆలోచించి చెప్పాలి! "

" ఇన్సూరెన్సు ఏజెంటు పనే అది! " అన్నాడు మేనేజరు నవ్వుతూ.

ఈశ్వరరావు యువకుడు. పనికొచ్చే వాడు. అతనికి తగినంత ప్రోత్సాహమిచ్చి ఎట్లాగైనా అతనిద్వారా బిజినెస్ రాబట్టాలని మేనేజరు గట్టిగా పట్టుపట్టాడు.

" మిస్టర్ ఈశ్వరరావు, పట్టుదలతో పని చేయాలె నీవు. ప్రొద్దున లేచినప్పటినుండి అదే ఆలోచనలో ఉండాలె. "

" రైల్లో ప్రయాణం చేస్తున్నావనుకో. ఆ కాలం వృథా చేయకూడదు. ఇన్సూరు చేయటం వలన కలిగే లాభాలూ, ఇన్సూర్ చేయకుండా

పోయినవాళ్ళ పెళ్ళాంబిడ్డలు పడ్డ బాధలూ ఈ విషయాలను గురించి రైళ్లో నీ పక్కన వున్నవాళ్ళకు కథలు చెప్పాలె. వాళ్ళలో ఒకడికో, ఇద్దరికో నీవు చెప్పింది నచ్చుతుంది. నీ కృషి ఫలిస్తుంది. పట్టుదలవల్ల " అని ఇల్లాగ ఎంతోసేపు ప్రోత్సాహకరమైన మాటలు ఉపాయాలు చెప్పాడు. పాపం ఈశ్వరరావు ఒట్టి చేతులతో వెళ్ళుతున్నాడే అని జాలికూడా మేనేజరుకు కలిగింది. ఆయన అందుకని అతనికి ఒక యాభై రూపాయలు అడ్వాన్సుకూడా ఇప్పించి, దీవించి పంపాడు.

ఈశ్వరరావు సంతోషించాడు. బి.ఏ. పాసు అయిన యువకుడు, తెలుగులోకూడా బాగా మాట్లాడగలడు.

మేనేజరు దీవించడంతో అతనికి ప్రోత్సాహం బాగా కలిగింది. పట్టుదల ఎక్కువైంది. ఏమైనా సరే రోజుకు ఒక కేసు అయినా పట్టంది భోజనం చేయకూడదని నిశ్చయించుకున్నాడు. స్వగ్రామానికి బయలుదేరాడు.

ఈశ్వరరావు నిజంగా గట్టి పట్టు పట్టాడు. బెజవాడ చేరటంతోనే ఎవరినో ఒకరిని మెడలు విరిచి అయినా సరే ఇన్స్యూర్ చేయిస్తాడు. అంత పట్టుదల అతనిముఖంలో స్పష్టంగా కనిపిస్తూనే ఉంది.

ఈశ్వరరావు గబగబా పరిగెత్తుకుంటూ వెళ్ళి రైలు ఎక్కాడు. ఖాళీగా ఉన్న ఒక పెట్టెలో ఎక్కి ఒక బెంచీపై కూర్చున్నాడు.

ఆ మేనేజరు చెప్పిన మాటలు అతని చెవుల్లో

గింగురుమంటూనే ఉన్నాయి. 'ఇది రైలుపెట్టె గదా అని ఊరుకోకూడదు. ఇక్కడ కూడా తన వేట సాగించాలె' అనుకొన్నాడు.

తనకు ఎదురుగా ఉన్న బెంచీపైన ఇరవైఏండ్ల కుర్రవాడు ఒకడు కూర్చొని ఉన్నాడు. విచారంగా దిగులుగా చూస్తున్నాడు. అతనేదో చిన్నఉద్యోగిలాగ ఉన్నాడు. బీదవాడుకూడా కావచ్చు.[D] అయితేమాత్రమేం. అతని సంగతి ఆలోచించవలసిన విషయమే!

ఈశ్వరరావు బాగా ఆలోచించాడు. తన ప్రయత్నాలు ఇప్పుడే ఆరంభిస్తే, చాలా మంచిది. అతని చేత కొద్దిమొత్తానికైనా సరే ఇన్స్యూర్ చేయిస్తే బాగుంటుందని ఆలోచించాడు. ఇది అతని మొదటి కేసు. మొదటి ప్రయత్నంలోనే జయాన్ని పొందాలె.

ఈశ్వరరావుకు ఈ బిజినెస్ అంటే మొదటినుంచీ ఇష్టం. తన భవిష్యత్తును గురించి బాగా ఆలోచించే, చివరకు ఇన్స్యూరెన్సు ఏజెంటుగా చేరాడు.

ఇన్నాళ్ళనుండి ఒక్క కేసు అయినా చేయించలేకపోయిన మాట నిజమే. కాని ఇవ్వాళ అట్లా కాదు. ఆ ఎదురుగా ఉన్న కుర్రవాడిని చూచీచూడటంతో[E] తెలిసింది - ఈశ్వరరావుకు కష్టానికి తగిన లాభం తప్పక కలుగుతుందని.

అతడు తనకు కలుగబోయే అదృష్టాన్నిగురించి ఎక్కువగా ఊహించుకుంటూ పోయినాడు.[F] ఇది తప్పకుండా నెగ్గుతుంది. ఆతరువాత తాను పట్టిందల్లా

బంగారం కావచ్చు. బిజినెస్ వృద్ధి అవుతుంది. నెలకు వందా, రెండు వందలు కూడా సంపాదిస్తూ ఉంటాడు. తరువాత రిన్యూయల్ ప్రీమియమ్ యొక్క కమీషను మీదనే హాయిగా జీవించే రోజులు రావటానికి కూడా ఎంతో కాలం పట్టకూడదు.

ఇంతకూ తనకు పట్టబోయే అదృష్టమంతా ఈ మొదటి కేసులో తనకు విజయం కలగటం మీదనే ఆధారపడివున్నది. ఎట్లాగయినా సరే కుర్రవాణ్ణి పట్టి తేరాలె.

ఈశ్వరరావు ఆ కుర్రవాడి దగ్గర చేరి అతన్ని మెల్లగా మాటలలోకి దించాడు. అతని సంగతి అంతా తెలుసుకోనటానికి ఎంతోసేపు పట్టలేదు.

ఆ అబ్బాయి ఒక బడిపంతులు. కొద్ది జీతం మీదనే ఎల్లాగో జీవిస్తున్నాడు.

ఇక ఆ అబ్బాయి భవిష్యత్తును గురించి బాగా ఆలోచించవలసిన బాధ్యత తనది, మేనేజరుగారు చెప్పినట్లు.

సంసారం చిన్నదే కాబట్టి ఇప్పుడెట్లాగో గడుస్తున్నది. ఆ అబ్బాయికి యికముందు ఎల్లాగు?

బ్రతికివుంటే తల తాకట్టుపెట్టి అయినా సరే ఎల్లాగో పెళ్ళాము బిడ్డలను పోషిస్తాడు అనుకుందాము. కర్మంచాలక అతడు కాస్త హరీ అంటే వాళ్ళ సంగతి ఏమి కావలె! కాబట్టి అతనిని పాలసీ పుచ్చుకోనేటట్లు చేయించాలె.

అయితే, ఆ కుర్రవాడు ఏమంత తెలివైనవాడులాగ కనిపించలేదు. ఏదో మందమతిలాగ ఉన్నాడు. ఎందుకూ అంటే అతడు ఏదో పరధ్యానంగా, ఎక్కడో చూస్తూ ఏదో ఆలోచిస్తూ తన ప్రశ్నలకి జవాబులు చెప్పాడు.

అయితేనేమి ? అల్లాంటివాణ్ణి కాస్త దారికి తీసుకొనివచ్చి ఒకపాలసీ తీసుకొనేలాగున చేస్తే ఒక బీదసంసారాన్ని రక్షించిన పుణ్యం కలుగుతుంది.

ఈశ్వరరావు పట్టుదలతో తన కృషి ప్రారంభించి ఆ పంతుల్ని క్రమంగా సంభాషణలోకి దింపి జీవితం అశాశ్వతం అనే విషయంలోకి దింపాడు.

ఇట్లా అన్నాడు : "చూడండి, ఈ బ్రతుకు శాశ్వతం కాదు. 'అనిత్యాని శరీరాణి' అన్నారు పెద్దలు. ఇప్పుడు ఇల్లాగ కులాసాగా మాట్లాడుతున్నాము. కాని ఇంకా కాసేపటికి ఏమి జరుగుతుందో ఏమీ చెప్పలేము."

ఆ అబ్బాయి ఊరుకొన్నాడు, వినీ విననట్లు. అవుననలేదు, కాదనలేదు. ఏదో తియ్యని మత్తులోనో ధ్యానంలోనో ఉన్నట్లు చూస్తూ కూర్చున్నాడు.

"చూశారూ, పంతులుగారు! రైలుబండి ఇప్పుడు ఈ వంతెన మీదుగా పోతున్నది. కాని ఈ వంతెన దభీమని విరిగిపోయి, రైలు పడిపోయి రైలులోని ప్రయాణీకులలో కొందరు చనిపోవచ్చు! అల్లా చాలా చోట్ల జరిగింది!"

అటు చూస్తున్న పంతులు ఇటు తిరిగి ఈయన

చెప్పే మాటలు వింటానికి కాస్త ఉత్సాహం చూపాడు.

ఈశ్వరరావు ధైర్యంతో మళ్ళీ ఇట్లా అన్నాడు:

'నిత్యం సన్నిహితో మృత్యుః' అన్నారు పెద్దలు. మృత్యువనేది ఎల్లప్పుడూ మనలను అనుసరిస్తూ గబుక్కున మీద పడుతుంది, ఎప్పుడో ఒకప్పుడు! ఏ రూపంలో వస్తుందో చెప్పలేము. ఒకసారి దారిని పోతూ ఉన్న రెండెడ్ల బండి విరిగి ఒక కుర్రవాడి మీద పడ్డది. వాడి ప్రాణాలు అక్కడే పోయినాయి."

పంతులు ఈ మాటలు విని చాలా ఆశ్చర్యపడ్డాడు. అంతపని జరిగిందా అన్నట్లు తెల్లపోయి చూశాడు.

ఏజెంటు ఈశ్వరరావుకి పట్టుదల ఎక్కువ అయింది. పంతులు వలలో పడేటట్లే ఉన్నాడు. ముఖం చూస్తే అల్లాగ ఉంది. అందుకనే అతడొక చిన్న ఉపన్యాసం సాగించాడు. మధ్యమధ్య ఈశ్వరరావు ముఖంలోని మార్పులను గుర్తిస్తూ, ఉపన్యాసం అంతా విన్నాడు ఆ కుర్రవాడు - ఒక మాటైనా పలకకుండా.

చివరకు ఉపన్యాసకుడు ఈశ్వరరావు అన్నమాట ఇది. 'సైకిల్ మీదనుంచి పడి అక్కడే ఆక్షణంలోనే ప్రాణాలు విడిచినవాళ్ళు కూడా ఉన్నారు.'

ఆ అబ్బాయి ఏడుపు ముఖం పెట్టాడు. అతని బుర్రలోకి ఈతని మాటలు ఎక్కినవి. ఏజెంటు ఈశ్వరరావు చాలా సంతోషించాడు. ఇంతకూ మేనేజరు చెప్పినట్లు పట్టుదల అవసరం. అదృష్టం అదే కలిసివస్తుంది. తన మాటలు ఆ కుర్రవాడికి బాగా నచ్చినట్లు తెలుస్తూనే

ఉంది. ఇక అతనిచేత పాలసీ కొనిపించటానికి ఎంతోసేపు పట్టదనికూడా ఊహించి, ఈశ్వరరావు కొంచెం గంభీరంగా ముఖంపెట్టి ఇట్లా అన్నాడు:

“పంతులుగారూ, ఒక్కమాట చెబుతాను వినండి. మీరు ఏమీ అనుకోవద్దు. మీకు ఆస్తి ఏమీ లేదు. ఏదో పల్లెటూరులో బడిపంతుల వుద్యోగంతో బ్రతుకుతున్నారు. ఏదైనా ఆపద వచ్చిందంటే మీప్రాణాలు కాస్తా గుటుక్కుమంటే, మీపెళ్ళాంగతి ఏమి కావలె, బిడ్డలగతి ఏమి కావలె! వాళ్ళు అన్నంలేక మాడి చస్తారు. అవునా, కాదా?”

దీనికి జవాబుగా పంతులు ఏమంటాడోనని ఈశ్వరరావు అతనివంకే చూస్తున్నాడు. పంతులు అతడు అడిగినదానికి జవాబుగా అవునని తలఊపుతూ గొల్లుమని ఏడ్వటం సాగించాడు.

అరె! ఇంతపని జరుగుతుందని ఆ ఏజెంటు ఎప్పుడూ అనుకోలేదు. అతను కోరేది ఏదో అయిదువందల పాలసీ. నెలకు రెండురూపాయలు ప్రీమియమ్‌కు కడితే చాలు.

ఈ పాలసీ మాట ఎత్తకముందే ఈపంతులుగారు ఇట్లాగ ఏడుస్తాడని ఆయన కలలోనైనా అనుకోలేదు. ఇది చాలా ఆశ్చర్యంగా ఉంది. ఈశ్వరరావుకి ఏమి చెప్పటానికి తోచలేదు.

ఆ ఏడ్పు చూచి, ఆపెట్టెలో ఉన్నవాళ్ళంతా అంతకుముందు మాట్లాడుతూ ఉన్నవాళ్ళల్లా

చప్పున ఆగిపోయి ఆ కుర్రవాడి వంక ఆ ఏజెంటువంక చూడటం మొదలుపెట్టారు. వాళ్ళకు ఏమీ తెలియదు. ఇద్దరూ కుర్రవాళ్ళలాగే కనపడ్డారు. వాళ్ళకు వాళ్ళిద్దరు కూడా మాటా మాటా అనుకున్నారేమోనని అనుమానం కలిగింది.

ఆ పంతులు ఏడ్పు ఆపలేదు. "అంతే, నీవు అన్నది నిజం! నిజం కాకపోతే ఎందుకు అంటావులే!" అంటూ ముఖానికి గుడ్డ అడ్డుపెట్టుకొని ఏడ్వటం సాగించాడు.

ఆ అబ్బాయి మీద అందరికీ చాలా జాలి కలిగింది. ఈ ఏజెంటు ఏదో మాట అంటే ఆ కుర్రవాడు ఏడుస్తున్నాడని అందరూ అనుకున్నారు.

'ఎందుకయ్యా, ఆ అబ్బాయిని ఏడ్పించటం,' అన్నారు కూడా ఒకరిద్దరు పెద్దవాళ్ళు. పాపం, ఈశ్వరరావు మట్టుకు ఏమంటాడు? తెల్లపోయి చూస్తూ కూర్చున్నాడు.

ఆయనే కాదు, అందరూ కూడా నిశ్శబ్దంగా మాట్లాడకుండా కూర్చున్నారు. ఒక చిన్నవాడు అల్లాగ వెక్కి వెక్కి ఏడుస్తూ ఉంటే ఎవరికి బుద్ధి పుడుతుంది కులాసాగా మాట్లాడుకోటానికి!

ఈశ్వరరావు తెల్లముఖంతో, భయంతో కూర్చోటం చూచి అంతా అనుకొన్నారు, "వీడేదో మాట అని ఉంటాడు. లేకపోతే ఆ కుర్రవాడు ఎందుకు ఏడుస్తాడు!" ఆ కుర్రవాణ్ణి ఏడ్పించింది తానేనని అంతా అనుకోవటం ఈశ్వరరావుకు చిన్నతనంగానే ఉన్నది.

నాలుగు నిమిషాలు గడిచిన తరువాత పంతులు ఏడ్పు కాస్త ఆపాడు. ఆయన ఏడ్పు ఆపటం చూచి ప్రక్కనే కూర్చున్న ముసలమ్మ అన్నది: "నాయనా ఎవరో చిన్నవాడవు. నీ దుఃఖం చూస్తే నాకు జాలి పుడుతున్నది. ఏమిటి నాయనా! ఎందుకు ఏడుస్తావూ?". అని ఆమె కన్నీళ్ళు పెట్టుకుంటూ అడిగింది.

పంతులుకు నోటి మాట రాలేదు. కళ్ళనిండా నీళ్ళు పెట్టుకున్నాడు. దుఃఖంతో నిండిన గొంతులో నుంచి అతికష్టము మీద ఒక్క మాట ఏడుస్తూనే అన్నాడు, 'నా భార్య చచ్చిపోతుంది.' ఆతర్వాత ఒకమాటకూడా అనలేక ఆ ముసలమ్మగారిని కౌగలించుకొని గొల్లున ఏడ్వటం మొదలుపెట్టాడు.

ముసలమ్మగారికికూడా దుఃఖం ఆగలేదు. అకస్మాత్తుగా దగ్గర చేరిన ఈ మనుమణ్ణి కౌగిలించుకొని, "ఊరుకో నాయనా! అమ్మాయికి జబ్బు ఎక్కువగా వుందా? పరవాలేదు నాయనా, ఊరుకో" అని ఓదార్చుతూ, తానుకూడా పెద్దగానే ఏడ్చింది.

ఇల్లా ఓదార్పు మాటలు అంటూ ఉన్నప్పుడు మాత్రం కాస్త ఊరుకొని మళ్ళీ ఏదో జ్ఞాపకం రావటం, ఏడ్వడం, ఇదీ అతని ధోరణి.

ఈశ్వరరావుకు ప్రాణం పోయినట్లయింది. అతడు ఎక్కడున్నాడో, ఏమి వింటున్నాడో, ఏమి చూస్తున్నాడో కూడా తెలిసికోలేని పరిస్థితిలో ఉన్నాడు.

ఆపెట్టెలో కూర్చున్నవాళ్ళందరికీ

ఆతుర్ర వాడు ఎందుకు అంతగా ఏడుస్తున్నాడో సరిగ్గా తెలియదు. మొదటి బెంచీలో వాళ్ళు ఆయన భార్యకు ప్రాణం మీదికి వచ్చిందని అనుకొన్నారు. మూడో బెంచీలో వాళ్ళు ఆమె పోవటానికి కారణాలు కూడా ఊహించి చెప్పుకొంటున్నారు.

కొంతమందికి ఈశ్వరరావు పైన కోపం కూడా వచ్చింది. అతని వైపు కొరకొర చూశారు! 'ఈ పాడు కబురు ఇక్కడే ఇప్పుడే చెప్పకపోతే నేం! రైలు దిగిన తరువాత చెప్పకపోయినాడా' అని వాళ్ళు అన్నారు.

ఈశ్వరరావు కూడా ఆ అబ్బాయి ఎందుకు ఏడుస్తున్నాడో అని కొంచెం ఆలోచించాడు. అతనికి ఒకవిధంగా తోచింది. అతని భార్య బహుశా చాలా జబ్బుగా ఉండి వుంటుంది. ఇంతకు పూర్వమే ఆయనే ఈ విషయమై ఆలోచిస్తూ దిగులు పడి కూర్చుని ఉంటాడు. మొదట్లో తన మాట వినకుండా పరధ్యానంగా దిగులుగా మందమతిగా ఉండటానికి కూడా అదే కారణం అయి ఉండాలె!

నీ భార్య, బిడ్డలు, అన్నం లేక మాడి చచ్చిపోతారు అన్నాడు. ఆ మాటలు అతని మనస్సుకు బాధ కలిగించి వుంటాయి. అతనికి ఇదివరకే ఉన్న విచారానికి ఇది తోడు కాగా, అతడు దుఃఖాన్ని ఆపుకోలేకపోయి ఉంటాడు. ఏజెంటు మహాశయుడు తనకు ఉన్న సైకో ఎనాలిసిస్ శాస్త్ర విజ్ఞానం అంతా వినియోగించి ఈ నిశ్చయానికి వచ్చాడు.

ఇంతలో పంతులు కాస్త నెమ్మదిపడ్డాడు. ఏడ్వటం మాని దిగులుగా కూర్చున్నాడు. దుఃఖం కాస్త తగ్గిందికదా అని ముసలమ్మగారు ఇట్లా అన్నది: "అట్లా ధైర్యంగా ఉండు నాయనా! ఏడిస్తే ఏమిలాభం?" ఆకుర్రవాడు పిచ్చిచూపులు చూస్తూ జవాబుచెప్పకుండా ఊరుకొన్నాడు.

"వాళ్ళిద్దరూ బావమరదులేటమ్మా!" అని చివరబెంచీలో ఎవరో అన్నారు. వాళ్ళకు ఈసంగతి ఎట్లా తెలిసిందో! ఎట్లా ఊహించారో మరి!!

ముసలమ్మగారు ఇది నిజమో కాదో తెలుసుకుందామని అడిగింది: "ఏం నాయనా! అయితే ఆయన అక్కను నీకిచ్చారా? నీ అక్కను ఆయనకిచ్చారా?"

ఈ మాటలు వినేసరికి ఈశ్వరరావుకు ప్రాణాలు పోయినట్లయింది. ఆ అబ్బాయికి, తనకూ కూడా బంధుత్వం కలుపుతున్నారు, వీళ్ళంతా కలిసి! దీనికి సమాధానం ఆయనే చెబుతాడో, తననే చెప్పమంటాడో అని భయపడి చూస్తున్నాడు.

ఆ అబ్బాయి తలే ఊపాడో, చెయ్యే ఊపాడో ఏమి చేశాడో తెలియదు కాని, మొత్తంమీద అందరూ వాళ్ళిద్దరూ బావమరదులేనని నిశ్చయించుకొన్నారు.

ఇన్సూరెన్సు వ్యాపారం చేయటంలో ఇట్లాగ క్రొత్తక్రొత్త[H] బాంధవ్యాలు ఏర్పడుతాయని పాపం ఈశ్వరరావుకు తెలియదు అందుచేతనే అతడు చాలా గాభరాపడుతూ కూర్చున్నాడు. ఆయనకెదురుగా ఆ పంతులూ కూర్చున్నాడు. ముసలమ్మగారు మళ్ళీ అడిగింది, "నాయనా, నీకేమన్నా బిడ్డలా?" అని.

ERIC

పంతులు మాట్లాడకుండా ఒకవేలు చూపాడు. "ఒక బిడ్డా, నాయనా? చిన్నతనంలోనే బిడ్డ కలిగింది" అంటూ ఆ అబ్బాయి తల నిమిరింది. బిడ్డ మాట ఎత్తేసరికి పంతులు మళ్ళీ పెద్దగా భోరున ఏడ్వటం మొదలుపెట్టాడు.

ముసలమ్మగారు అన్నది: "ఊరుకోవయ్యా! ఆ బిడ్డను చూచుకొని అయినా బ్రతకాలా? లేకపోతే ఆ బిడ్డకూడా బ్రతకదు!" అని. వెంటనే పంతులు ఏజెంటుగారి భుజంమీద తలవాల్చి ఏడ్వటం ప్రారంభించాడు. ఎవ్వరు ఏమిచెప్పినా వినక భోరున ఏడ్వటం సాగించాడు.

పంతులు తనను కౌగలించుకొని ఏడ్వటం తనకెంతో కష్టంగా ఉన్నా, అక్కడున్నవాళ్ళెవరికీ ఏమీ కష్టంగా లేదు. బావమరిదిని కౌగలించుకొని ఏడ్వటం వింతగా ఎవ్వరికీ కనపడలేదు. కాని తనుకూడా ఏడ్వకపోవటమే అందరికీ బహుశా విచిత్రంగా ఉండిఉండాలె! ఎందుచేతనంటే ఆ జబ్బుగా ఉన్నమనిషి తన అక్క కదా!

తాను కఠినహృదయుడని అప్పుడే అందరూ అనుకొంటున్నారు! కాదనటానికి తనకు ధైర్యం ఆ పరిస్థితుల్లో లేదు. ఆ ఏడుస్తూ ఉన్న కుర్రాడు తన అక్క మొగుడని ఒప్పుకుంటానికి ఈశ్వరరావు నిశ్చయించుకొనే ఉన్నాడు. కాని, తానుకూడా ఏడవవలసిన పరిస్థితి వస్తుందని అతడు ఎప్పుడూ ఊహించలేదు.

ఈ ఇన్స్యూరెన్సు ఇంత అవస్థలోకి దింపుతుందని తెలిసినట్లయితే మొదట్లోనే తప్పుకొనేవాడు ఏజెంటు.

కాని ఇప్పుడేమి చేస్తాడు? ఏడవక తప్పింది కాదు. అక్క కూడా పోయిందాయె! ఏడవకుండా ఎల్లాగ! పంతులును కౌగలించుకొని తప్పనిసరిగా ఏడ్చాడు.

అయితే ఒక్క సంగతి. అది బొల్లి బొల్లి ఏడ్పు మట్టుకు కాదు. ఏజెంటుగారికి ఎందుకైనా కానీ, నిజమైన దుఃఖమే వచ్చింది. హృదయపూర్వకంగా ఏడ్చాడు!

ఉన్నవాళ్ళంతా "ఊరుకోండి నాయనా! ఊరుకోండి! ఎందుకు ఏడ్వటం! ఏమి లాభం! అయిపోయిందాయె!" అంటూ బావమరదులనిద్దరినీ కూడా ఓదార్చారు.

ముసలమ్మగారు ఈ పర్యాయము ఈశ్వరరావును దగ్గరకు తీసుకొని తల నిమురుతూ అన్నది: "పిచ్చి పిల్లవాడా! నీవు కూడా ఏడిస్తే ఎల్లాగ? కాస్త ధైర్యం తెచ్చుకో! మీ బావ దిగులుపడిపోయినాడు. ఆయనకు కాస్త ధైర్యం నీవు చెప్పాలి. నువ్వు కూడా ఏడిస్తే ఎల్లాగు చెప్పూ?"

ఏజెంటు మహాశయుడు ముసలమ్మమాటలు విని, ఏడ్వటం మానేశాడు.

పంతులుకూడా మానినాడు, కాని పూర్తిగా మానలేదు. కాసేపు ఊరుకొంటాడు. ఏదో

జ్ఞాపకం వస్తుంది. మళ్ళీ ఏడుస్తాడు. ఇదీ అతని ధోరణి!

దుఃఖం వచ్చినవాడు తాను ఒక్కడే, తన ఇష్టం వచ్చినట్లు ఏడవక ఏజెంటుమహాశయుని కౌగలించుకొని ఏడుస్తూ ఉండడం మూలాన, ఆయన ఏడ్చినప్పుడల్లా తానుకూడా ఏడ్వవలసిన అవసరం కలగటమే ఈశ్వరరావుకు ఇప్పుడు కలిగిన కొత్త అవస్థ.

రైలు దిగి పారిపోతే ఎల్లా ఉంటుందీ అని ఈశ్వరరావు ఆలోచించకపోలేదు. ఎట్లా దిగి పోవటం! ఈ పంతులబావను వదిలి.

ఒకవేళ తెగించి, ధైర్యంచేసి దిగితే, అంతా "నీకేమైనా బుద్ధి ఉందా లేదా?" అని చీవాట్లు వేస్తారు. అంతటితో ఊరుకోరు కూడాను. "అవతల అబ్బాయి వెక్కివెక్కి ఏడుస్తుంటే నీవు ఎట్లాగ వెడతావయ్యా" అని లాగి కూర్చోబెడతారు. వాళ్ళకు చిరాకు కలిగిస్తే తలమీద మొట్టికాయలు కూడా వేయొచ్చు. ఈశ్వరరావు ఈ విషయమై చాలా బాగా ఆలోచించే, దిగిపోవటానికి వీలు లేదని నిశ్చయించుకొని అక్కడే కూర్చున్నాడు, వీలైనప్పుడల్లా ఒక ఏడుపు ఏడుస్తూ. స్టేషనులు వచ్చి పోతున్నాయి. పంతులు ఎక్కడా దిగిపోవాలని ప్రయత్నం చేయటమే లేదు.

బెజవాడ దగ్గరలోకి వస్తున్నది. ఏదో ఒకస్టేషనులో బండి ఆగింది. ఆగి ఆగటంతోనే

ఎవరో ఒక ఆయన వీళ్ళ పెట్టె దగ్గరకు వచ్చి తొంగి చూచి, " ఇక్కడున్నాడర్రా! " అని పెద్దకేక పెట్టాడు. మరుక్షణంలో ఒక ముసలాయనకూడా పరిగెత్తుకుంటూ వచ్చి ఈపెట్టెలోనే ఎక్కాడు.

ఆ వచ్చినవాళ్ళు ఇద్దరూ పంతులుకు రెండుప్రక్కలా కూర్చున్నారు. ఒకాయన అన్నాడు : " ఓరి నీదుంప తెగ! నీకోసం వెదకలేక చస్తున్నాం ప్రతిస్టేషనులోనూ దిగి." ఇంకో ఆయన " ఇక్కడి కెప్పుడు వచ్చావురా సన్నాసి వెధవా " అన్నాడు.

వాళ్ళను చూచి పంతులు మళ్ళీ ఏడ్పుసాగించాడు.

ముసలమ్మగారు అడిగింది వాళ్ళల్లో ఒకాయన్ని, " నాయనా, ఆ అబ్బాయి మీకేమౌతాడు? " అని.

" మా అబ్బాయి " అన్నాడు ఒక ముసలాయన.

" ఆయన? " అని రెండోవ్యక్తిని చూపి అడిగింది.

" వాడి మేనమామ! " అని జవాబు చెప్పాడు ఈముసలాయన.

ఈ జవాబులతో ముసలమ్మ తృప్తి పడి ఆ వచ్చినవాళ్ళతో మళ్ళీ అన్నది : " ఇందాకటినుంచీ ఒక్కటే ఏడ్పు. మేమెంత చెప్పినా వినటంలేదు. ఆ బిడ్డను ఒంటరిగా వదిలేశారేం బాబూ? "

ఆ ముసలాయన పిల్లవాణ్ణి కసురుకుంటూ అడిగాడు : " ఎందుకురా ఏడ్పు? " పిల్లవాడు పాపం బిక్కముఖం పెట్టాడు.

ఈ బిక్కముఖం చూచి ముసలమ్మ జాలిపడి అన్నది : " కోప్పడబోకండి బాబుగారూ! ఏడ్పు అంటే ఏడ్పుగాక ఏముంది! పాపం బిడ్డకూడా

పోయిందే అని తల్చుకొని ఏడుస్తున్నాడు. చిన్నవయసు వాడు - మనకు మల్లే జీవితంలో కష్టాలు చూసినవాడు కాడుగా "

ఆ ముసలాయన ముసలమ్మ వంక విచిత్రంగా చూచి "వాడికి కూతురెక్కడిదమ్మా" అన్నాడు విసుగ్గా.

"లేదూ ? అయితే పాపం, భార్యచావుకే కాబోలు ఏడుస్తున్నాడు" అన్నది ముసలమ్మ మళ్ళీ.

"భా భా ఏమిటమ్మా నీమాటలు! భార్య పోవటం ఏమిటి?"

"ఆ అబ్బాయి తన భార్య పోయిందనేగా ఇందాకటినుంచీ ఏడుస్తూ వుండటం?"

"భా భా ఏమిటమ్మా అసహ్యం మాటలు! వాడికింకా పెండ్లి కాలేదే?" అన్నాడు ఆ అబ్బాయి మేనమామ.

పెండ్లి కాకపోతే, ఈశ్వరరావు అక్కమొగుడెట్లాగ అయినాడు! ఈశ్వరరావు కూడా ఎందుకు ఏడ్చాడు? ఈ ప్రశ్నలకు సమాధానము ఏజెంటుగారే చెప్పాల్సి ఉంది. అంతా ఆయనవంక వింతగా చూస్తున్నారు.

ఈశ్వరరావు పెద్ద అవస్థలో పడిపోయినాడు. ఇంత అవస్థలో అతడు ఎప్పుడూ పడలేదు. ఇప్పుడు తను ఎవరని చెప్పాలె! ఎందుకు ఏడ్చినట్లు!

జరిగిన విషయమంతా వివరంగా చెప్పితే, అంతా నవ్వుతారు. హేళన చేస్తారు. చాలా అవమానం.

ERIC

జరుగుతుంది. వాళ్ళు ఒకసారి నవ్వి వూరుకోరు. తన పేరూ, తన ఇంటిపేరూ కూడా అడిగి తెలిసికొని అందరికీ కూడా చెబుతారు. ఊరంతా తెలుస్తుంది. ఊరూరు చెప్పుకొంటారు, ఫలాని ఇన్సూరెన్సు ఏజెంటు అని, ఇల్లాగ జరిగింది అని. ఇంత గొడవ జరుగుతుంది. కాబట్టి ఏం చెయ్యాలె? ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాడు.

ఈశ్వరరావు ఇట్లా ఉండగానే ముసలమ్మ మళ్ళీ అడిగింది: “అయితే, పెళ్ళామూ లేదు, బిడ్డా లేదుగదా, ఎందుకు బాబూ, మరి అల్లాగ ఏడ్చాడు?”

ముసలాయన అసహ్యం చూపుతూ అన్నాడు: “వీడు ఏడ్వటానికి ఏంలే! వీడికి ఏదో గుబులు!”

పిల్లవాడి మేనమామ అన్నాడు: “వాడికి నెలరోజులనుంచీ వంట్లో ఏమీ బాగుండటం లేదమ్మా. ... ఏదో ఒకరకం పిచ్చి పట్టుకుంది. కూర్చుంటే ఎవ్వరితోనూ మాట్లాడకుండా గంటలకొద్దీ కూర్చుంటాడు. లేకపోతే ఎవరినైనా ఏమైనా కష్టం కలిగే మాట అంటే ఏడుస్తాడు. వాణ్ణి విశాఖపట్నంకు తీసుకెడుతున్నాము, మందు ఇప్పించటానికి.”

పంతులు ఈ మాటలు విని అప్పటికి నోరువిప్పి మాట్లాడాడు: “పిచ్చి ఏమిటి నాన్నా! నేను ఎందుకు ఏడ్చానంటే, నాకు పెళ్ళి అయినాగూడా నాపెళ్ళాం చచ్చిపోతుందనీ, నాకు బిడ్డ పుట్టినా తరువాత అదిగూడా పోతుందని ఈయన చెప్పాడు!”

పెట్టెలో అందరూ ఈశ్వరరావువంక విచిత్రంగా చూశారు, ఎందుకు అల్లాటి పాడుమాటలు చెప్పాడా అని ఆశ్చర్యపోతూ!

“నేనుకూడా పోతానట నాన్నా! ఈ రైలు విరిగో, వంతెనమీదనుంచి రైలుబండి పడిపోయ్యో నామీదుగా ఒక కారు పోయో, నామీద ఒక ఎద్దుబండి విరిగో నేను పోవటంకూడా తప్పదట, నాన్నా!” అని మళ్ళీ ఏడ్చాడు ఆ పిల్లవాడు.

ఈశ్వరరావు ప్రాణాలు పోతున్నాయ్. ఏమి జవాబు చెప్పగలడు, ఎందుకు అల్లాంటిమాటలు అన్నావంటే.

శివ, శివ! ఈశ్వరరావు మనస్సులో పడుతున్న బాధ ఇంతా అంతా కాదు.

ముసలమ్మ అన్నది ఈశ్వరరావును చూస్తూ, “నీకేం పొయ్యేకాలంరా! పాపం, పసిబిడ్డను పట్టుకొని పాడుమాటలన్నీ అన్నావ్.”

ఒకాయన అన్నాడు, “అకఁయ్య చచ్చిపోయిందని ఏడ్చావు! అదేమిటి?”

అందరూ తనవైపే చూస్తున్నారు. ఇక లాభంలేదని బండి ఇంకా బాగా ఆగకముందే ఈశ్వరరావు బెజవాడ ప్లాట్‌ఫారము మీదికి దూకి, గుంపులో కనపడకుండా మాయమైనాడు.

ముసలమ్మా, ఆ పెట్టెలో ఉన్న ఇతర పెద్దమనుష్యులూ అంతా అతనికిగూడా ‘పిచ్చి’ — అని నిశ్చయించారు.

# హత్యా ? ఆత్మహత్యా ?

శ్రీ పోతుకూచి సాంబశివరావు

Stories relating to crime and detection are also popular among the Telugus. A great deal of detective fiction produced by Telugu writers is either an imitation or an adaptation of what is found in English. The following, however, is original, a story of grim tragedy by Potukuci Sambasiva Rao.

## హత్యా ? ఆత్మహత్యా ?

విద్యావతి ఆత్మహత్య చేసుకుందని వినగానే "ఆమెకష్టాలు యీనాటితో ఆఖరు" అని నిట్టూర్పు విడిచి, ఉబికివచ్చే దుఃఖంతో కన్నీరు కార్చాడు ప్రకాశరావు. ప్రక్కనే ఉన్న నాకు యీ విషాదవార్త చెప్పలేని బాధ కలిగించింది. ఇద్దరం పరుగెత్తాము రైలుపట్టాల వరకు.

తెగిపోయి రక్తంతో కలిసివున్న చెల్లెలి శరీరం చూసి "ఆత్మహత్య చేసుకుంది చివరకు" అని గొల్లున ఏడ్వసాగాడు ప్రకాశరావు. ఆదృశ్యం చూస్తుంటే నాకు ఒంటిలో మంటలు బయలుదేరాయి. "ఆత్మహత్య కాదు, హత్య యిది" అని అరిచాను.

"ఇలా చనిపోతే, ఇది హత్య అని యెలా అనగలం ?" అన్నాడు ప్రకాశరావు సందేహంగా.

అవును. యెలా అనగలం? అనలేము. మనిషి తనంత తాను వచ్చి రైలు వేగంగా పోతుంటే, రైలుకింద పడి ప్రాణాలు విడిస్తే యిది హత్య అని ఎలా అనగలం? చావు విషయం మాత్రమే దృష్టిలో పెట్టుకున్నంతకాలం యిది ఆత్మహత్య అనే అనుకోవలసివస్తుంది.

కాని యీ చావుకు ముందు జరిగిన ఘోరాలు? అవి ప్రజలకు అక్కరలేదూ ఆ చావు నిర్ణయించాలంటే? మానసికంగా, శారీరకంగా ఎంత బాధపడనిది ఆమె ఆత్మహత్యకు సాహసిస్తుంది? ఆమె బాధ ఆత్మహత్యకు కారణమైతే, అలా బాధపెట్టినవాడు ఆ ఆత్మహత్యకు

కారణం గాదూ? అలా అయితే, అతను నిజంగా ఒకవిధంగా హత్య చేసినవాడే. అందుకే నేను అరిచాను "హత్య యిది" అని.

అలా నేనాకర్ణ్ణో[B] అంటే ఎవరు వింటారు? ఎవరూ వినలేదు ఆఖరుకు అది ఆత్మహత్య అని నిర్ణయించారు అధికారులు. విద్యావతిని జీవితాంతందాకా పీడించి, , ఆమె చావుకు కారణమయిన ఆమెభర్త రామనరసును వదిలివేశారు శిక్షలేకుండా. ఎలాగయినా అధికారంలో ఉన్నవాడు ఆమాత్రం తప్పించుకోలేడూ!

నాకు బాగా తెలుసు విద్యావతికి వివాహం అయిన రోజులు. నాకు యీవూరు ట్రాన్స్ఫరుఅవడం, ఆమెకు వివాహం కావడం ఒకేసారి జరిగాయి.

తెలియనికుటుంబాలతో సంబంధం చేస్తే పెళ్ళిళ్ళయినాకగాని అందులోని రహస్యాలు లోపాలు తెలియవు. రామనరసు బాగా చదువుకున్నవాడు, అతను పెంపుకు కుదిరాడు. అతని పెంపుడుతల్లి నాలుగువిషయాలూ బాగా తెలిసిన మనిషి, తెలివైనది. అందుచేత కుటుంబంలో అంతా బాగానే వుందని విద్యావతిని రామనరసుకు యిచ్చి పెళ్ళి చేశారు.

విద్యావతి కాపురానికి వెళ్ళాకగాని అసలు విషయాలు ఎవరికీ అర్థంకాలేదు. పెంపుడుతల్లి తనకొడుకుతోనే అవినీతిగా ప్రవర్తిస్తుందని ఎవరనుకుంటారు? కామం గుడ్డిది. సాంఘికధర్మాలకు విరుద్ధంగా నీచంగా తల్లి వలె వున్న స్త్రీ యిలా

ప్రవర్తిస్తుందని ఎవరనుకోగలరు?

కాపురానికి వెళ్ళాక రామనరసు విద్యావతిని నిర్లక్ష్యంగా చూచేవాడు. యింట్లో చాకిరి అంతా ఆమెచేత చేయించేవాడు. చిన్న చిన్న విషయాలపై కోపం తెచ్చుకుని ఆమె శరీరం ముక్కలయ్యేటట్లు కొట్టేవాడు. వీటికన్నిటికీ వెనకనుంచి ప్రోత్సాహంయిస్తూ రాక్షసిలా ప్రవర్తించేది అతని పెంపుడుతల్లి.

తరువాత తెలిసింది ప్రకాశరావుకు, రామనరసుకు చాలా సంబంధాలు వచ్చి వెళ్ళిపోయాయని. మొదట బీద మేనరికం వద్దనుకొని కొత్త సంబంధము మంచిదేదైనా చెల్లెలికి కుదుర్దామని అనేక ప్రయత్నాలు చేసి, చివరకు దీనిని నిశ్చయించాడు ప్రకాశరావు.

రామనరసు, అతని తల్లి కొట్టే దెబ్బలకు చాలాసార్లు మూర్ఛపోయేది విద్యావతి. భర్త అంటే దైవమని పురాణకాలం స్త్రీలాగ యీ కష్టాలు తప్పక పోతాయి అని దైవాన్ని నమ్మేది. అప్పుడప్పుడు నా భార్యతో చెప్పుకునేది కొన్ని విషయాలు భరించలేక. ఆమె ద్వారా నే విన్న విషయాలు ప్రకాశరావుకు తెలియజేసేవాడిని.

ప్రకాశరావుకు ఒకరోజు కబురు పంపాను, అతని చెల్లెలి పరిస్థితి బాగులేదని ఒకసారి వచ్చి పుట్టింటికి తీసుకువెళ్ళమని. అతను వచ్చాడు. ఇంతలోనే యిలా కొంపమునుగుతుందని అనుకోలేదు.

ప్రకాశరావు రాకముందు రెండురోజుల క్రితం విద్యావతికి జ్వరం వచ్చింది. కాని ఆమెకు

యింటి చాకిరీ తప్పలేదు. చాలాసార్లు నీరసంవల్ల మూర్ఛపోయేది ఆమె. అలాగే ఆనాడూ మూర్ఛవచ్చింది. యింట్లో వంటకాలేదు. మధ్యాన్నం దాకా బయట తిరిగివచ్చిన తల్లీకొడుకులకు యింటికి రాగానే భోజనం లేకపోయింది. వారికున్న ఆకలిబాధతో ఆమెను చావగొట్టి ఆమెపై కసి తీర్చుకున్నారు.

శరీరంలో నీరసం, జ్వరం, మూర్ఛలు, ఒంటిమీద కాయలు దేరిన దెబ్బల నొప్పులు ఒకేసారి ఆమెను చుట్టి పీడించాయి. ఈ బాధలనుండి తప్పుకోవాలని విద్యావతి ఆనాటి రాత్రి ప్రక్కనున్న నూతిలో బడి చద్దామని ప్రయత్నించింది. కాని యిరుగుపొరుగువాళ్ళు వెంటనే ఆమెను నూతిలోనుంచి తీసి రక్షించారు.

విద్యావతి ఆత్మహత్యాప్రయత్నం విని ఆమె అత్తగారు మండిపడింది. ఇంట్లో గుంపు చేరిన ఇరుగుపొరుగువాళ్ళని బయటికి పంపించి తిరిగి విద్యావతిని తిట్టి కొట్టింది. "ఇంట్లో చస్తే నాకు అవమానం. బయట చస్తే మంచిది" అని అరిచింది. ఎప్పటికైనా చావక మానదనే ఊహతో ఎందుకైనా మంచిదని, ఆమె ఒంటిమీద నగలు తీసి దాచింది.

ఇంత ఘోరాలు జరిగినా విద్యావతి చావు ఆత్మహత్య అని నిర్ణయించిన అధికారులు కూడా చట్టాన్ని న్యాయాన్ని వదిలివేశారా అనిపించింది. రామనరసును వదిలివేశారు నిర్దోషి అని. అతను ఎలా నిర్దోషి అయ్యాడని నావాదన. ప్రకాశరావు మతిపోయిన పిల్లవాడిలా గొల్లుమని ఏడ్వసాగాడు.

చెల్లెలు మరణానికి అతని దుఃఖం నాహృదయాన్ని గొడ్డలితో చీల్చినట్లుంది.

పదిహేను రోజులు గడిచాయి. ప్రకాశరావును పోలీసు అధికారులు పిలిచారు. చెల్లెలి మరణవిషయంలో తెలిసిన సంగతులన్నీ చెప్పమని. అతను వాఙ్మూలము ఇవ్వడానికి మరలా మావూరు వచ్చాడు.

కేసు విచారణ జరిగింది. విద్యావతిని రామనరసు హత్య చేశాడని నిర్ణయించబడింది. హత్యానేరంపైన రామనరసుకు జీవితాంతంవరకు కారాగారశిక్ష విధించారు.

ఈవార్త విని ప్రకాశరావు ఆశ్చర్యపోయాడు. రామనరసుకు శిక్ష పడడం నిజంగా అతనికి ఆనందకరమైన విషయమైనా ఇది ఎలా జరిగింది అని అతని అనుమానం. చెల్లెలు ఆత్మహత్య చేసుకుందని రామనరసును వదిలివేసిన అధికారులే తిరిగి కేసు విచారణ జరిపి, అది హత్య అని నిర్ణయించి రామనరసుకు శిక్ష ఎలా విధించారా అని ఆశ్చర్యపోయాడు.

"దుర్మార్గాన్ని సన్మార్గంతో యెదిరించడం ఉత్తమపద్ధతే అయినా అది యీ యుగంలో లాభం లేదు. దుర్మార్గులను దుర్మార్గంతోనే శిక్షించాలి. వారి ముందు మనం సన్మార్గంతో ఉంటే, మననాశనం వాళ్ళు చూడక మానరు" అన్నాను జరిగినదానికి ప్రస్తావనగా.

"దుర్మార్గులను దేవుడు శిక్షిస్తాడు. మానవుడు దుర్మార్గులను దుర్మార్గంతో ఎదిరించడం సన్మార్గం కాదు" అన్నాడు ప్రకాశరావు.

"దైవత్వం మానవునిలోనూ ఉంది అన్యాయాన్ని అంతం చేయడమే దైవత్వం. అలా చేయగలిగితే, దైవత్వం వృద్ధి చెంది మానవుడు పరిపూర్ణత పొందుతాడు. ఎలా అంతం చేయడం అన్నది పరిస్థితులపై ఆధారపడి వుంటుంది. అన్యాయంతోనైనా అన్యాయాన్ని నాశనం చెయ్యాలి అన్నాను.

ప్రకాశరావు ఏకీభవించలేక పోయాడు. కాని 'ఊం' కొట్టుతూ జరిగిన దానికి ఆశ్చర్యంగా నావైపు చూశాడు. అతనికి నా దగ్గర ఉన్న ఉత్తరం కాపీ చూపించాను.

"ఆనాడు సాయంత్రం నన్ను నల్లమందు తెమ్మన్నారు. ఎందుకో అని తెచ్చాను.

మా గుడిసె దగ్గర నేను యథాప్రకారం మంచంపై పడుకున్నాను. రాత్రి ఒంటిగంటకు మెలకువ వచ్చి లేచి చుట్ట కాల్చుకుంటున్నాను. రామనరసుగారి దొడ్డితలుపు చప్పుడైనట్లు వినిపించింది. తరువాత ఇద్దరు మనుష్యులు ఒకమనిషిని జాగ్రత్తగా మోస్తూ రైలుపట్టాలవైపుకు వెళ్ళడం చూశాను. చీకటిగా ఉన్నా వాళ్ళెవరో గుర్తుపట్టాను. రామనరసుగారు, ఆయన తల్లి; వారింట్లో ఎప్పుడూ ఏవో దెబ్బలాటలు జరగడం మామూలే. వాళ్ళ సంగతి నాకెందుకని వచ్చి యథాప్రకారం పడుకున్నాను.

తెల్లవారగానే విద్యావతీ అమ్మగారు రైలుపట్టాలపై పడి చనిపోయారని వాళ్ళ పాలమనిషి నాకు చెప్పాడు. ఇట్లు, వీరన్న."

ప్రకాశరావు ఉత్తరం కాపీ చదివి అర్థంచేసుకున్నాడు. రామనరసు యింటివెనక గుడిసెల్లో ఉంటున్న వీరన్ననుంచి నేనే యీ ఉత్తరం వ్రాయించి కేసు తిరిగి విచారణ చేయించాను. అది నిజంకూడా.

ఈ ఉత్తరం అధికారులకిచ్చి రామనరసు యిల్లు పోలీసు అధికారులచే తనిఖీ చేయించాను. రామనరసు పరుపుక్రింద నల్లమందు పొట్లాము కనిపించింది. విద్యావతి పడుకునే పరుపుమీద నూనెమరకలు కనిపించాయి. దొడ్డిలో నూనె నల్లమందు కలిపిన చిన్నమట్టిపాత్ర కనిపించింది. అధికారులు అనుమానించి కేసు తిరిగి విచారణ చేశారు. ఇంటిప్రక్కవాళ్ళు ఎంతోమంది రామనరసుకు ఎదురుతిరిగి విద్యావతి బాధలగురించి చెబుతూ సాక్ష్యం యిచ్చారు. అందువల్ల రామనరసు విద్యావతిని, నల్లమందు నూనె యిచ్చి చంపి, రైలుపట్టాలపై రాత్రి పడవేసి, ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు పైకి పుకారు పుట్టించాడని అధికారులు నిర్ణయించి, అతనికి శిక్ష విధించారు.

"తగిన శిక్ష పడింది" అని ప్రకాశరావు మొదట తృప్తిపడ్డాడు. ప్రజలు ఆశ్చర్యపోయారు. ఇటువంటి హత్యలు జరిపే యముడా రామనరసు, అని అతని అవినీతి తెలిసినవాళ్ళు అందుకుకూడా అతను తగినవాడే అన్నారు.

"ఆనాడు ఇది హత్యే అని నేనన్నమాటలు నిజమైనాయి. ఇప్పుడేమంటావ్ ప్రకాశరావ్" అని అడిగాను.

నా మాటలు మౌనంగా విని అర్థం చేసుకున్నాడు ప్రకాశరావు "నేను నా చెల్లెలికి పెళ్ళి చేయలేను. ఆమెను హత్య చేశాను" అనుకుంటూ ప్రకాశరావు చేతుల్లో ముఖం పెట్టుకుని వలవలా ఏడ్చాడు. నేను అన్యాయాన్ని అకారణంగాలని చేసిన తనకార్యం అతన్ని బాధపెడుతుం దనుకోలేదు.

నేను అనుమానించాను. అనుమానించినట్లే అయింది. చెల్లెలు హత్య చేయబడిందనే మనోబాధతో ప్రకాశరావు తరువాత కొన్నాళ్ళకి చనిపోయాడు.

నేను దొంగతనంగా రామవరసు యింట్లో ఒకరాత్రి ప్రవేశించి, నల్లమందు అతని పరుపు క్రింద దాచడం, నూనె విద్యావతి ప్రక్కపై చిలకడం, దొడ్లో నూనె నల్లమందు కలిపిన ఒక మట్టిపాత్రను పారవెయ్యడం, వీరన్నచేత విద్యావతిని రైలుపట్టాలపై రాత్రి పడవేసినట్లు ఉత్తరం వ్రాయించడం, మొదలైన దృశ్యాలు నాకళ్ళముందు తిరిగాయి. ఆ పనులు చేసేటప్పుడు ఇలా అవుతుందని నేను ఊహించలేదు.

ప్రకాశరావు మరణవార్త విన్నాక, నన్నే నేను హత్య చేసుకున్నట్లయింది. కాని చావలేక బ్రతకలేక యిలా ప్రాణంతో ఉన్నాను. నేను

# దాంపత్యం

### శ్రీ నార్ల వేంకటేశ్వరరావు.

V. R. Narla (1908 --), a journalist of great recognition in Andhra, is credited with introducing a distinct style into Telugu journalistic writing. As a creative writer, he has published a great deal in the form of essays, one-act plays, and aphoristic verse. He has travelled widely and is actively associated with literary and educational activities in Andhra Pradesh. He is also a member of the Indian Parliament.

While some of the writings of V. R. Narla bear the influence of Western literature, it must be said in all fairness that they are more original than mere adaptations. He has an excellent mastery of the native idiom of the Telugu language. The following selection is taken from 'Kottagaḍḍa' (The New Soil), a collection of one-act plays.

# దాంపత్యం

పాత్రలు

చదువుకొన్న[A] భర్త

చదువు రాని భార్య

[ గమనిక : ఇతివృత్తం, పాత్రలు మొదలైనవాటిలో ఇది స్వతంత్ర రచన. టెక్నిక్ మాత్రం స్వీడిష్ రచయిత ఆగస్ట్ స్ట్రిండ్‌బర్గ్‌కు అనుసరణ. ఒకపాత్ర చేతనే మాట్లాడించి, రెండవపాత్రను మౌనంగా వుంచడం – ఈపద్ధతిని "దిస్ట్రాంగర్" అనే నాటికలో ఆయన ఉపయోగించాడు. ఈపద్ధతి మాత్రమే "దాంపత్యం"లో అనుసరించబడింది.]

అది ఆ దంపతుల యింటిముందు వసారా. రాత్రి తొమ్మిదిన్నర ప్రాంతం, పడక కుర్చీలో వాలి, భర్త పత్రిక చదువుతుంటూ వుంటాడు. వయస్సు ముప్ఫై ప్రాంతాల్లో వుంటుంది. గూడకట్టు కట్టుకున్నాడు; ఆహారం వేసుకున్నాడు. తమలపాకుల పళ్ళెంతో భార్య ప్రవేశిస్తుంది.

భార్య : ఏమండీ! ఈ పూటైనా మీరు సరిగా భోజనం చెయ్యనేలేదు.[B] విస్తరి ఇలా అలా కెలికి లేచొచ్చేశారు.[C] చూడగా వండుకోవడం, వార్చుకోవడం నాకోసంలానే వుంది. రోజురోజుకు చిక్కి సగమైపోతున్నారు. ఇలా చేస్తే, ఎలా చెప్పండి?

( కుర్చీ దగ్గర కూర్చుని తమలపాకుల ఈనెల్ని తీస్తూ వుంటుంది. )

భా: పోనీ, మీకు ఇష్టమైన కూరలేవో మీరు తెస్తే వండిపెట్టనన్నానా? కాని, బతిమాలుకొన్నా మార్కెట్టుకు వెళ్ళనంటారు. పనిమనిషిని పంపిస్తే, అది సగం డబ్బు దాచుకొని సగానికి తెస్తుంది. అబ్బబ్బ! అది వొట్టి దొంగముండ! ఇంటి వద్దకు మంచి కూరలేవీ రావడమే లేదు. ఎవడు తెచ్చినా వంకాయలూ, బెండకాయలూ తెస్తున్నాడు. అవైనా అన్నీ చచ్చులూ, పుచ్చులూ. ఇక నేనేం చచ్చేది - మీరే చెప్పండి?

( తమలపాకులకు సున్నం రాస్తూ వుంటుంది. )

భా: అన్నం మానేసి పాడు కాఫీహోటలులో, పాడు కాఫీ తాగుతూ వుంటారు. ఆ కాఫీనీళ్ళతో ఏం కడుపు నిండుతుంది? ఏ పచ్చడి మెతుకులు తిన్నా అన్నం అన్నమే![D] మా తాత మూడుపూటలు తవ్వెడు బియ్యం అన్నం[E] పెట్టించుకొని, మంచి మజ్జిగ పోసుకుని, జుర్రున జూరతాడు. ఎనభై యేళ్ళొచ్చినా ఇంకా రాయిలా ఉన్నాడు. కంటిచూపైనా తగ్గలేదు. ఇప్పటికీ సూదిలో దారం సులభంగా గుచ్చుతాడు.

( పోక చెక్క భర్తకు అందిస్తుంది. )

భా: అబ్బ! చదవొచ్చు లేండి. పొద్దున్నే పోతారు. పొద్దుపోయిన తర్వాత వస్తారు. "ఇదుగో వస్తారు; అదుగో వస్తారు" అంటూ ఎదురుచూసి చూసి

నా కళ్ళు కాయలు కాసిపోతున్నాయ్. ఆఫీసు పని అయిదుగంటలకే అయిపోయినా రాత్రి ఎనిమిది, తొమ్మిదిగంటలదాకా ఏం చేస్తారో, ఏమో, మీకే తెలియాలి. అసలు గడప దాటగానే మీరింటిమాటే మర్చిపోతారు లెండి! ఇవ్వాళ మట్టుకి "నాన్నొస్తాడు మిఠాయి తెస్తా" డంటూ పెద్దపిల్ల ఎదురుచూసి ఎదురుచూసి మీరొచ్చే ముందే చటుక్కున నిద్దరపోయింది. చంటిది కూడా "నాన! నాన!" అంటూ - పాపం! - కలవరించింది. దానికీపూట వొళ్ళు కాస్త వెచ్చగా వుందండీ! నిద్రలో - వెర్రితల్లి - ఉలిక్కిపడుతున్నది. దీపాలు పెట్టగానే గుప్పెడు మిరపకాయలు దిష్టి తీసి, పొయ్యిలో వేశాను. బిడ్డమీద ఏపాడుముండ కళ్ళు పడ్డాయో, ఏమో!

( భార్య అందించిన తమలపాకుల్ని అందుకుని, భర్త పత్రికలో మరింతగా దాక్కుంటాడు. )

భా: ఎప్పుడూ పత్రిక చదువుతూ కూర్చుంటే, కళ్ళకు జబ్బు కూడా. పిండారబోసినట్లు వెన్నెల కాస్తున్నది. చల్లటిగాలి వేస్తున్నది కూడా. పెందలాడే యింటికొచ్చి, వాకిట్లో కుర్చీ వేసుకు కూర్చుంటే హాయిగా వుండదండీ? ఇవ్వాళ వెన్నెల్ని చూసి పెద్దపిల్ల ఎంత సంతోషపడిందనుకున్నారు! "చందమామ రావే!" అంటూ మీరు దానికెప్పుడో పాట చెప్పారట. దాన్ని చెప్పమని నన్ను తెగ పీడించింది. (ఒక్క క్షణం సేపు ఆగి) పాలు చల్లారిపోతున్నాయి. ఇప్పుడే వొస్తా.

(లేచి వెడుతూ) ఈపూట మరీ పత్తెపు మెతుకులు
తిన్నట్టు తిన్నారు. పాలయినా తాగరాదుటండీ!
(జవాబుకోసం అన్నట్టు ఒకక్షణం ఆగి) ఏం!
తెమ్మంటారా?

(వద్దని భర్త తల ఊపుతాడు.)

భా: పోనీ, కాసినన్నే తాగండి. ఒక అరకప్పు తెస్తా.

(వద్దని భర్త మరింత గట్టిగా తల ఊపుతాడు.
భార్య లోపలికి వెడుతుంది. ఆమె వెళ్ళగానే
అతడు పత్రికను ఒకమూలకు గిరాటు కొట్టి,
పడకకుర్చీలోనుంచి లేచి, పక్కనే టేబులుపైనవున్న
పుస్తకం తెచ్చుకొని, దాన్ని చదువుతూ మళ్ళీ
కుర్చీలో కూలబడతాడు.)

భా: (తిరిగి వచ్చి) పత్రిక చదవడం అయిందనుకుంటే
పుస్తకం మొదలెట్టారటండీ? అదేం పాపమో
నాతో ఒక్క మాటైనా మాటాడరు. ఇంటికి
వచ్చినప్పటినుంచీ చదువు చదువు - అంతు పంతూ
లేని చదువు. నేనేమైనా అంటే, "అదిగో!
నా చదువు చెడగొడుతున్నా" వంటారు. కాని
స్నేహితులెవరైనా వస్తే, ఆ చదువేమౌతుందో
తెలవదు. అర్ధరాత్రివరకు వాళ్ళతో నవ్వుతూ
మాట్లాడుతూ కూర్చుంటారు. నాతో మాట
మాట్లాడ్డమంటేనే మీకు ....

(భర్త చటుక్కున పుస్తకం మూసి "ఈ సోది
వినక తప్పదు" అన్నట్టు ముఖం పెడతాడు.)

భా: (దైన్యంగా) ఇప్పుడు నేనేమన్నానండీ మీరంత

విసుక్కోడానికి! పిచ్చిదాన్ని కనక, ఎప్పుడు సాయంత్రమౌతుందా, ఎప్పుడు మీరొస్తారా అని గంటలు లెక్కపెట్టుకుంటూ కూర్చుంటాను. కాళ్ళ

డైతే చాలు, మీరేమోనని ఆలకిస్తాను. గేటు తీసిన చప్పుడైతే చాలు, మీరేమోనని ఎదురుచూస్తాను. దానికి రెండున్నరేళ్ళు నిండా వున్నాయో, లేవో ఆ అల్లరి పిల్ల "అమ్మా! నాన్నొస్తున్నాడేఁ" అంటూ చీటికి మాటికి పరుగెత్తుకొస్తూ వుంటుంది. వట్టిదే అని తెలిసీ వుండబట్టలేక వాకిట్లోకి ఆదరాబాదరాగా లేచొస్తాను. లేచొచ్చి, "ఎక్కడే?" అంటే, పకపక నవ్వుతుంది. (భర్త పెదవులపై చిరునవ్వు కనబడుతుంది.) చంటిదికూడా "నాన్న ఎక్కడమ్మా?" అంటే, ముఖం ఇంత చేసుకుని, వేలుతో గేటువంక చూపిస్తుంది. నా తల్లికి వేడి చేసింది. అజీర్తి చేసిందేమో అనుకోడానికి నిన్నే ఆముదం పెట్టాను! ఇవ్వాళ పొద్దునకూడా బాగానే విరోచనమైంది. వాసననాన్న లేదు. (భర్త ముఖం చిట్లించుకొని, చేతిగడియారం వంక చూస్తాడు.)

భా: ఇంటికి రావడానికి మీకొక టైము లేదు కాని, వచ్చాక టైము చూసుకోవడమే సరిపోతుంది. సంసారం మంచిచెడ్డలు చెప్పుకోడానికైనా మీకు తీరిక వుండదు. పగలంతా మీకోసం నేను ఎదురుచూస్తుంటాను. కాని, నాతో మాట్లాడితేనే మీ నోటి ముత్యాలన్నీ రాలిపోతాయనుకుంటారు!

(ఏదో జవాబు చెప్పబోయినట్లు భర్త పెదవులు కదులుతాయి.)

భా: మీరు ఏమనబోతున్నారో నాకు తెలుసులెండి. "నీతో ఏమిసంగతులు మాట్లాడమంటావ్? వండడం, వార్చడం తప్పితే నీకేమొచ్చు? చీరలు నగలు తప్పితే నీకేం కావాలి?" అనేగా? మాఅమ్మ, నాన్న నాకు చదువు చెప్పించారు కాదు. నా ఖర్మది. "ఏం! ఇప్పుడు మాత్రమేం! నే చెబుతా- చదువుకోరాదా?" అంటారు. "పోనీ మీకంత ముచ్చటగా ఉంటే చెప్పం" డని వచ్చి కూర్చుంటే, ఏ కాస్త తప్పొచ్చినా, చెడ్డ చిరాకు పడతారుకదా! "అబ్బబ్బ! ఎంత తల బద్దలుగొట్టుకున్నా, నీకేమీ అర్థం కాదు. వొట్టి మట్టిబుర్ర" అంటారు--- ------- ఔను! నాది మట్టిబుర్రే! లేకపోతే, మీ కెందు కింత లోకువౌతాను? "భూమి గుండ్రంగా వుంటే, అడుగు పక్కనున్నవాళ్ళు తలకిందులుగా నడుస్తారా?" అన్నానని ఆ పూటంతా మీకు ఒకటే నవ్వ!

(భర్త ఆవులిస్తాడు.)

భా: "ఏమండీ! కామ్రేడ్ అంటూ చాలామందికి పేరుముందు వుంటుందికదా? కామ్రేడ్ ఇంటిపేరు గలవాళ్ళు దేశంలో అంత ఎక్కువగా వున్నారటండీ?" అని ఒకనాడడిగినందుకు ఏమి హేళన చేశారు! ఏమి హేళన చేశారు!

(భర్త వొళ్ళు విరుచుకుంటాడు.)

భా: ( భర్త విసుగును గమనించకుండానే ) మీలా
అందరూ చదువుకున్నవాళ్ళే వుంటారా? నిజానికి
- నా బాధంత! - ఇంకా నాకేం చదువు? అప్పుడే
ఒకరికిద్దరు బిడ్డలయ్యారు. ఇటు నేను
ఇంటిపనే చేసుకోనా? అటు వాళ్ళనే చూసుకోనా?
పగటిపూట ఇలా కాస్త కనుమూసే ప్రాప్తంలేదు.
బద్ధకించి ఎప్పుడైనా కాసేపు నడుం వాలిస్తే,
పిల్లలిద్దరు పైనబడి గోలచేస్తారు. మరి
నెలరోజులనుంచి చంటిపిల్ల రాత్రిపూటైనా
కంటిమీద కునుకు పడనివ్వడం లేదు. పాలు చాలక
"కుయ్యో, మొర్రో" అంటూ తెల్లవార్లూ ఒక్కటే
గోల! వాట్టి రొమ్ము దానినోట్లో పెట్టి పడుకుంటే
దానికడుపు నిండుతుందా?

( తలనొప్పి వచ్చినట్టు భర్త కణతలు నొక్కుతుంటాడు.)

భా: ఏమండీ! తలనొప్పిగా వున్నదా? మరి ఆమాట
చెప్పారు కారేం? తలనొప్పిగా వుంటే అన్నమెలా
సయిస్తుంది? అందువల్లే ఈపూట కాసినన్ని
మెతుకులైనా తిన్నారు కాదు. తలనొప్పి మందు
రాయనా?

( కణతలు నొక్కుకోవడాన్ని వెంటనే మానివేసి,
మందు గిందూ వద్దన్నట్టు భర్త సైగ చేస్తాడు.)

భా: అయితే, నామాటలతో మీకు తలనొప్పిగా వున్నా
యంటారు. అంతే లెండి. నేనన్నా, నామాటలన్నా
మీకు తలనొప్పి. మీకు పుస్తకాలు కావాలి;
పత్రికలు కావాలి. దేశం సంగతులతో, ప్రపంచం సంగతులతో

మీకు పొద్దు పోతుంది. నాకు నాయిల్లే దేశం;
నా పిల్లలే ప్రపంచం.... పెళ్ళయినాక ఒక్క ఏడాదిపాటు
నాతో ఏంతిన్నగా వున్నారో! ఆ తర్వాత
నేనేం పాపం చేసుకున్నానో కాని, నా నీడైనా
మీకు గిట్టడం లేదు. పిచ్చిదాన్నికనక మీరెంత
తోసేస్తున్నా, మీనీడలాగ వుంటున్నాను. మీరు
సంతోషంగా ఒక్క మాటాడితే, అదే పండగనుకుంటాను.
కాని, నే నెదురుగా వస్తేనే మీకు చిరచిరలు,
బురబురలు: చిరాకు.

(పడకకుర్చీలోనుంచి గభాలున లేచి, భర్త
పచారు చేయ నారంభిస్తాడు.)

భా: అయ్యో. కూర్చోండి - పాపం! - కూర్చోండి.
నామూలాన మీకు లేనిపోని కాళ్ళనొప్పులు
కూడా దేనికి లెండి! ... చదువురాని దాన్నని
మీకు మొదటే తెలుసుగా! తెలిసికూడా నన్నెందుకు
చేసుకున్నారు? ఆ కిరస్తానీ దాన్నే కట్టుకోకపోయారూ?
కీసర బాసర మాట్లాడుతూ దాంతో హాయిగా....

(పళ్ళు కొరుకుతూ భర్త "హుఁ!" అని
జడిపిస్తాడు.)

భా: (తెగించినట్టు) జడిపించినంతకాలం జడిపించారు.
ఇంకేమి జడిపిస్తారు లెండి. ఇదేమితలవ్రాతో నాకు.
లేకపోతే అది ఇప్పుడీవూరు బదిలీ ఎందుకు
చేయించుకుంటుంది? "నాతోపాటు కాలేజీలో
చదువుకుంది. ఇస్కూళ్ళ ఇనస్పెక్టరమ్మ" అంటూ
దానికి నాచేత చాకిరీ చేయించారు. కాఫీలు,

ఫలహారాలు, భోజనాలు – ఓం! ఏం చేయించలేదు?
... దాని కాళ్ళు పట్టించడం ఒక్కటే మినహా.
నల్లగా – కారివిలా – కోతిముండ! ముట్టుకుంటే
చేతికి ఎక్కడ మసి అవుతుందో అన్నట్టుగా వుంటుంది.
మరి, దాని అందం ముందు నా అందం పట్టడంలేదు
కాబోలు! ముఖానికి ఇంత బూడిద కొట్టుకొని,
చేతికి నలుసంత గడియారమొకటి తగిలించుకుని,
కాళ్ళకు గాడిదగిట్టల బూడ్సులు వేసుకుని,
టిక్కుటిక్కుమంటూ (వెక్కిరిస్తున్న గొంతుతో)
"హలో" అనేసరికి ముఖం చేటంత అవుతుంది.
ఇక దాంతో ఒక్కటే పకపకలు, ఇకఇకలు!
నేనెక్కడ వినిపోతానో అని ఇంగ్లీషులో తప్ప
మాట్లాడరు. ఆ ఇంగిలీపీసు రాకపోతే మాత్రం
నాకు కళ్ళు లేవూ మీ నాటకమంతా చూడ్డానికి?
ఈ మధ్య మరీ ఆ ఇంటినుంచి ఈ ఇంటికి,
ఈ ఇంటినుంచి ఆ ఇంటికి నడిచే పుస్తకాలు
పుస్తకాలు కావు; పత్రికలు పత్రికలు కావు.
వాటితోపాటు ఎన్ని ఉత్తరాలు నడుస్తున్నాయో!
మీరు విడిచిన చొక్కా మొన్న చాకలికి వేస్తూ
జేబు చూశానుగదా, సినిమాటికెట్లు రెండు
కనబడ్డాయి. దాన్ని వెంటబెట్టుకు వెళ్ళారు కాబోలు!
లేకపోతే రెండెందుకుంటాయి? ఇంతవరకొచ్చాక
ఇంకా చాటు దేనికి? హాయిగా ఆ పోరిని తెచ్చి
ఇంట్లో పెట్టుకోరాదూ?

(కోపం పట్టలేక భర్త నేలను తన్నుతాడు.)

భా: నేలను తన్నడం దేనికి! మీకు కాలు నొప్పి కూడా!
నన్నే తన్నండి. తన్ని తగిలేస్తే, మీకు పీడ పోతుంది.
పాపం! ఆ పోరిది కష్టాలమారి
బ్రతుకట. దానికి నా అన్నవాళ్ళెవ్వరూ లేరట.[N]
అమ్మా, నాన్నా చిన్నతనంలోనే పోయారుట.
ఎంత పెద్ద ఉద్యోగం చేస్తున్నా, ఎంత జీతం
తెచ్చుకుంటున్నా దానికి సుఖమే లేదట. తన
ఉద్యోగానికీ, సంపాదనకీ ఆశపడి వచ్చే వాళ్ళని
చూస్తే దానికి కంపరమట. దాని తాలూకు వాళ్ళెవరూ
దాన్ని చూడటానికి రారట. అదంటే ఎంత జాలి!
పోనీ, మీరే ఆ పోరిని కట్టుకోరాదూ?
( భర్త కొట్టడానికి చెయ్యెత్తబోయి, మళ్ళీ
అంతలోనే దించివేసుకుంటాడు. )

భా: ( ఇంకా తెగించినట్టు) ఆగిపోయారేం! కొట్టండి.
బిడ్డల తల్లికి ఆ ముచ్చటే తక్కువగా వుంది.
ఇంతకాలం నుంచి అన్నీ దిగమింగి వూరుకొన్నా!
ఏమైనా సరే, ఇఖ వూరుకునేది లేదు. అది
వుండడమో, నేనుండడమో ఇవ్వాళ తేలిపోవాలి.
మీకు వొండిపెట్టడానికి నేను కావాలేం? మీకు
పిల్లల్ని కనడానికి నేను కావాలేం? మీతో మాట
మాట్లాడ్డానికి మాత్రం నేను పనికిరాను! ఎంత
చదువురాని మొద్దునైతే మాత్రం మీకు చాకిరీ
చేస్తూ మూల పడివుండాలని ఎక్కడున్నదేమిటి?
పొట్టకూటికి నేనేమీ ముఖం వాచి లేను.
కావాలంటే ఇంత ముద్ద పెట్టడానికి నాకు

అమ్మా నాన్న వున్నారు. "ఆయన మనస్సు విరిగిపోయాక - భా - ఇంకా నేనిక్కడ దేని" కని ఆ పీడాకారి ముండ ఈ వూరొచ్చిన మూడునెల్లనుంచీ నేననుకోని రోజులేదు. కాని, పిల్లలే తగలాటమై పోయారు. వాళ్ళ నొదిలిపెట్టి వెళ్ళలేక.....

( తువ్వాలు పైన వేసుకుని భర్త వీధిలోకి దారి తీస్తాడు. )

భా: దానిదగ్గరకేనా ప్రయాణం? వెళ్ళండి! వెళ్ళండి! నా కాపరం నాశనం చేయడానికే అదిక్కడికి వచ్చినట్టుంది.

( వీధితలుపు గుభేలున వేసి భర్త వెళ్ళిపోతాడు.)

భా: పీడాకారి ముండ! నా ప్రాణానికి అదెక్కడినుంచి వచ్చి పడిందో? దాని తల పగల! దానింట్లో పీనుగెళ్ళ! ( ఒక క్షణం ఆగి) దాని కొంపకే వెళ్ళుండాలి. ఇంత రాత్రివేళ ఇంకెక్కడికి వెడతారు? ఆఫీసు పనయ్యాక అక్కడే కూర్చొనాస్తా వుండాలి. లేకపోతే, రోజూ ఎనిమిది, తొమ్మిది గంటలదాకా ఏమి పనులుంటాయ్! దిక్కుమాలిన ముండ! సిగ్గుమాలిన కుంక! దానికి బుద్ధి లేకపోతే ఈయనకైనా ఇదుండొద్దా? వీధి తలుపు తీసి, వీధిలో జూచి వచ్చి, దాని కొంప పడమర వీధిలో వుంటే, ఇలా తూర్పుకు వెళ్ళారు దేనికో? ఆఁ అదొక వేషం!... రెండు బజార్లు చుట్టి వెళ్ళి దాని తలుపు కొడతారు. ఈ సరికి అసలటు తిరిగే వుండాలి. మాయదారి ముండ!

పండంటి నా కాపరాన్ని నాశనం చేయడానికి అదిప్పుడు
....(చప్పున ఏదో జ్ఞాపకానికి వచ్చినట్లు) ఆఁ!
అన్నట్లు, ఇస్కూళ్ళ తనిఖీకి వారం రోజులనాడే
వెళ్ళిందనీ, ఇప్పటిలో అది తిరిగి రాదనీ ఈ దారిని
పోతూ నిన్న దాని బంట్రోతు చెప్పిపోయాడుగా?
(పెద్ద తప్పు చేసినదానివలె) అయ్యో! అయ్యో!!
ఎంత పాపిష్ఠిదాన్ని! ఒట్టినే నోటికొచ్చిన
కారుకూతలన్నీ కూసి ఇంత రాత్రివేళ ఆయన్ని
బయటికి పంపేశాను. మబ్బు మూసుకొస్తున్నది.
కొంపతీసి వర్షం పడుతుందేమో! తడిస్తే
ఆయనకు జలుబు చేస్తుంది! నేనిప్పుడేం చెయ్యను?
ముందొకసారి ఏదో మాటా మాటా వచ్చి,
ఇలాగే తెల్లవార్లూ వీధులెంట తిరిగి తిరిగి
తెల్లవారేసరికి గంపెడు జలుబుతో, జ్వరంతో
యింటికొచ్చారు. అప్పుడు వారం రోజులకు గాని
ఆయన కోలుకోలేదు. పాపిష్ఠిదాన్ని! ఇప్పుడాయన
కేమి తెచ్చిపెట్టడానికింత రాద్ధాంతం చేశానోగదా!
(తలా, నోరూ కొట్టుకుంటూ) నా బొంద పడ!
నేనెంత పాపిష్ఠిదాన్ని! అయ్యో! అయ్యో!!

(తెర పడుతుంది.)

# దేశం నాకిచ్చిన సందేశం.

శ్రీ బుచ్చిబాబు.

Bucci Babu

Sivaraju Venkata Subba Rao (1916 --), who writes under the pen-name "Bucci Babu", is one of the most successful writers in Telugu. His short-stories are usually long, with a novelty in the technique of narration or characterization. In many of his stories, Bucci Babu projects an external world in order to spotlight the deep psychological aspects of his characters. He is also a successful novelist, though his novels are few. A great deal of his thinking seems to be influenced by the English writers Somerset Maugham, O. Henry, and a few others. He holds a master's degree in English literature.

The following story shows the author's keen observation of the attitudes and ideas of certain individuals in the Telugu society. Narrated apparently in the form of a monologue, it makes an interesting reading from start to finish.

# దేశం నాకిచ్చిన సందేశం

"ఏమైంది?"

"పోయింది"

"నేననుకుంటూనే వున్నా. నాటకాలు, సంగీతాలు, ఆటలు పెట్టుకుంటే చదువులు వస్తాయా?"

"ఇప్పుడు నేను ప్యాసవకపోతే దేశానికొచ్చిన నష్టం ఏముందంటారు?" అని అడిగాను కొంత ఆవేశంతో.

"దేశానికేం - దేశం హాయిగా వుంటుంది. నీ మంచి కోసమే. ప్యాసవుతే నాలుగురాళ్ళు గడించుకుంటావు. మీ నాయనగార్ని సుఖపెడతావు. పెళ్ళానికి చీరలూ, నగలూ పెడతావు. అంతే!"

"నాలుగురాళ్ళ తోనే?"

ఆయన నా ప్రశ్న వినిపించుకోలేదు. వెళ్ళిపోయాడు.

ఇంటికొచ్చాను.

చేతిలో పత్రికా, నా వాలకమూ చూసి; మామగారు చతికిలపడ్డాడు. నేను తిన్నగా గదిలోకెళ్ళాను. సుందరం గోళ్ళు కొరుక్కుంటూ మంచం మీద కూర్చుంది. నన్ను భోజనానికి ఎవ్వరూ లేవమన లేదో, లేక, అంటే నేను వినిపించుకోలేదో, నా అంతట నేనే వెళ్ళి తిని వచ్చాను.

సాయంత్రం క్లబ్బుకెళ్ళాను.

"ఏమోయ్ బ్రదర్! నన్ను విడిచిపెట్టి నువ్వొక్కడవు ప్యాసవడం ఏం ధర్మంరా?" అన్నాడు మాధవరావు.

"ప్యాసైన వాళ్ళు మనల్ని విడిచిపెట్టలేదు-?"

"వాళ్ళలో త్యాగం లేదురా. ఇంతకీ వాళ్ళందరికీ ఉద్యోగాలు సిద్ధంగా వున్నాయా?"

"ఉండాలన్న చట్టం వుందా?

"లేకపోతే ఎందుకూ ప్యాసవాలన్న ఆదుర్దా — నీలా, నాలా హాయిగా ఫేలవకూడదూ?" అంటూ మాధవరావు మెల్లిగా పేకాటబల్లకేసి వెళ్ళాడు. అమ్మయ్య అనుకుని, గోడకు ఆనుకొని, నా చదువును గురించి ఆలోచించడం మొదలెట్టాను. నేను వొంటిగాణ్ణి అనే భయం పోయింది. నా అనే వాళ్ళూ, నా శ్రేయస్సు కోరే వాళ్ళూ ఎందరో ఉన్నారు. నేనొక ముఖ్యమైన వ్యక్తిని. నా సంగతులు కోర్టు పని మీద వెళ్ళే పెద్దమనుష్యుల్ని నిలిపివేస్తాయి; మామగార్ని చతికిలపడేటట్లు చేస్తాయి; మాధవరావుల్ని సంతోషపెడతాయి. సుందరం కళ్ళల్లో కన్నీళ్ళని కలిగిస్తాయి. దేశం అంటే మాటలా! ఎవరో "దేశం అంటే మట్టి కాదోయి, దేశం అంటే మనుష్యులోయ్" అని పాడుకున్నారు. దేశం అంటే సందేశం.

"పోయిందటగా ..."

ఉలికిపడ్డాను. రాజారావుగారు — తాశీల్దారు, నాన్నగారి ప్రాణస్నేహితుడు.

"అవునండి."

"నీవు పరీక్ష ఫేలవడం ఏమిటయ్యా!"

"…. …. …."

"ఐ.సి.యస్. ప్యాసై, మా జిల్లాకి కలెక్టరుగా రావల్సినవాడవు ...."

"... ... ..."

"ఈ సారైనా బాగా చదువు, ఫస్టుగా పాసవాలి. అంతటి బాధ్యత నాతల మీద పెట్టి వెళ్లారు. రాజారావు గారు. నేనొక సామాన్యుణ్ణి అనుకోవడానికి వీలులేదు. నేను సామాన్యుణ్ణి కాదు. ఒక మహా వ్యక్తిని; లోకోద్ధారకుణ్ణి. దేశం తన పని కాసేపు మానేసి, నాకు సందేశం యిచ్చిందంటే, నేనెంతటి వాణ్ణి అవాలో; దేశం సామాన్యమైనదా? 36 కోట్ల జనాభా - ఉత్తరాన హిమాలయం, తూర్పున బంగాళాఖాతం; హరప్పా నాగరికత; అజంతా ఎల్లోరాల శిల్పకళ; వాల్మీకి సంస్కృతి. భారతమాత! ---- - - - - - - ---- ఆమెకి - నాతో అవసరం వుంది. నాలుగురాళ్ళ నుండి ఐ.సి.యస్. వరకు నాయిష్టమొచ్చినదాన్ని సంపాదించుకోమంది. ఇంకేం కావాలి?

పరీక్షలు ఫెయిలయినకొద్దీ నేనొక మహావ్యక్తి నన్న నమ్మకము నాలో ఎక్కువ అవుతూ వచ్చింది. చివరికి పరీక్షలు ఎల్లాగో ప్యాసయ్యాను. ఆమహానుభావుడు ఆరోజు సందేశం యిచ్చినట్లు, నాలుగురాళ్లూ గడించడం కూడా జరిగింది. మొదట్లో మనసంస్థానికి నానాలుగు రాళ్ళ విషయంలో కొన్ని అనుమానాలు కలగక పోలేదు. మొట్టమొదట పరామర్శించిన మహానుభావుడు ఒకరోజు నన్ను నిలబెట్టి అడిగాడు.

"అయితే, అబ్బాయి, నీకేమిస్తారు?"

"ఏవో నాలుగురాళ్ళు" అన్నాను.

"అది సరేలేవోయి - అసలెంతిస్తారు?"

"చెప్పాడుగా."

పెద్ద చదువులు చదివావు. ఉద్యోగం చేస్తున్నావు. ఎన్ని వెటకారం మాటలైనా అంటావు" ఆయన సందేహం తీర్చనందుకు ఆయనకు చిరాకు పుట్టింది. సంఘం ఆయనచేత ఆప్రశ్న వేయించింది. ఆప్రశ్న వెనుక మన జాతీయత, నాగరికత, సంస్కృతి దాగివున్నాయి. ఆలస్యం చెయ్యకూడదు. వెంటనే సమాధానం యిచ్చితీరాలి.

"నాలుగు రాళ్ళండీ" అన్నాను ఆయనమీద నాకు మనసులో కసివుందో లేక నా అజ్ఞాన తక్కువని చెప్పుకోవడం చిన్నతనమో, — నేను తిరిగి ఆజవాబే యివ్వడానికి కారణం అయింది.

"అంటే నాలుగు రూపాయలా? వహ్వా!" అని వెటకారంగా అన్నాడు

"మీరు భావించినట్లు" అన్నాను కొంచెం కసిగా.

"ఆ - యిప్పుడు తెలిసిందిలే - రోజుకి కాబోలు!"

"కాదండి."

"వారానికి నాలుగా? గంటకి నాలుగా?"

"మీకంత హేళనగా వుంది."

"చంపక చెప్పు." అన్నాడు ఆమహానుభావుడు.

చూడండి; ఆసందేహం ఎట్లాంటిదో, ప్రాణాన్ని కూడా తీసేస్తుంది. ఆయన ఆక్షణాన చచ్చిపోతే, నేను హత్యచేసిన వాణ్ణవుతాను. చెప్పితీరాలి.

"నాలుగు అంకెగల రెండంకెల సంఖ్య" అన్నాను. ఆయన కొంత కోలుకున్నాడు. గుండెలు

యథా ప్రకారం కొట్టుకుంటున్నాయి.

"తొంభై నాలుగా? అని అడిగాడు పూర్తిగా ఊపిరి విడుస్తూ:

"నలభై తొమ్మిది కాకూడదా?" అన్నాను.

"ఇంత చదువూ చదివి యుంటే!, కిళ్లీ కొట్టువాడు సంపాయించుకుంటాడు! ఓవేళ ముందు ముందు పెద్దదవుతుందేమోతే" అంటూ ఆయన వెళ్లిపోయాడు.

కిళ్లీ కొట్లను చూస్తూ యింటికొచ్చాను. నాలాంటి ఆర్జనగల యితర వ్యక్తులను గురించి ఆలోచించడం మొదలెట్టాను. రిక్షా వాడొకడు కనిపించాడు. ముష్టిగ మనిషి - మోటారు డ్రైవరు. ఏమో, వాళ్లింకా ఎక్కువ ఆర్జిస్తారేమోనన్న సందేహం నాలో బయలుదేరింది. ప్రతి వాడింటికీ వెళ్లి కనుక్కొని ఒక చార్టు తయారు చేస్తే? అట్లా చెయ్యడం ఒక వుద్యోగం అయితే ఎంత బాగుంటుంది?

భోజనాల దగ్గర మామగారికీ ఆ సందేహమే వచ్చింది.

"ఎంతిస్తారేమిటి?"

నాకు మామగారి మీద కోపమొచ్చింది. వాళ్లమ్మాయికి ఉత్తరంలో ఆ విషయం వ్రాయనే వ్రాశాను.[B] ఓ వేళ యిందాక పరామర్శించిన మహానుభావుడు ముందే ఇక్కడికొచ్చి, యీయనకి, 'నో' యిచ్చి పోయ్యాడా!

మీకు తెలుసుగా అన్నాను."

ఆయన వింతగా నవ్వడం మొదలెట్టాడు.

"అంటే వచ్చే సంవత్సరానికి"

ఇంక్రిమెంటు ఎంతో నాచేత చెప్పిద్దామనే ఆయన పట్టుదల!

"ప్రొబేషన్ పూర్తవుతుంది" అన్నాను. ఆయన గడుసరి. మళ్ళా ఆ విషయం నాతో ప్రస్తావించలేదు.

సాయంత్రం క్లబ్బుకెళ్ళాను.

"ఏరా బ్రదర్, ఎంత డ్రా చేస్తున్నావురా? అని అడిగాడు, నాతో పాటు ఫెలవుతూ వొచ్చిన మాధవరావు. నా నిజమైన సహాధ్యాయుడు. సంఘానికి వొక సమాధానంతో నమ్మకం లేదుం కాబోలు! సాక్షుల చేత చెప్పించి, నిజానిజాలు బుజువు చేస్తే గాని వూరుకోదు కాబోలు! ఈతని చేత తన సందేహం యింగ్లీషులో చెప్పించింది. అది 'డ్రా' చెయ్యడం అంటే ఆవుని పాలు పిండినట్టు సంఘాన్ని పీడించి, బలవంతంగా లాక్కోవడం.

"నువ్వెంత "డ్రా" చేస్తున్నావో నేనూ అంతే" అన్నాను.

"ఓరి ఫూలా, మనం యింకా డ్రాయింగూ ట్రీయింగూ లేదు, తెలీదు? అని నవ్వడం మొదలెట్టాడు ఈ మహానుభావుడు.

ఏం చెప్పను?

"అవుతే, నువ్వు "డ్రా" చెయ్యడం మొదలెట్టినప్పుడు ఎంత "డ్రా" చేస్తావో, అంత" అన్నాను. ఆ దెబ్బతో ఉలికిపడ్డాడు. పేకాట బల్లకేసి కుంటుకుంటూ వెళ్ళాడు.

అడుగడుక్కీ ఈ ప్రశ్న నన్ను ఎదుర్కొంటూనే వుంది. కనపడిన వ్యక్తిని ముందుగా నేనే అడిగేస్తే ఎల్లా వుంటుందో? ఎవరో నా భుజం చరిచారు. వెనక్కి తిరిగాను. రాజారావుగారు; తాశిల్దారు. ఆయనకేంతిస్తారో?

"ఉద్యోగం దొరికిందిటగా, ఏమిస్తారు?

నన్ను గురించి తెలుసుకోవలసిన విషయాలు ఎన్నో వున్నాయి. నా మనస్తత్వం, ఆంతరంగికం, ఆదర్శాలు, శృంగార జీవితం, రాజకీయాలపై నా అభిప్రాయాలు — ఇవన్నుండగా నా జీతం వొక్కటేనా అడగవల్సింది?

"ఏదో — అందర్లాగే."

"అంటే?"

"మొదట్లో సాధారణంగా అందరికీ ఏమిస్తారో నాకూ అదే!

చూపుడువేలు చూపించి తల వూపాడు?

నాకు వెంటనే అర్థం కాలేదు.

"వందా?" అన్నాడు

"యించుమించు" అన్నాను

"అయ్యో కర్మ! వందకూడా కాదా?

"రిటైరయ్యేటప్పటికి రెండొందల దాకా వెడుతుంది లెండి. మీకో?

రాజారావుగారు నవ్వడం సాగించాడు. ఆయనకి నామీదున్న అభిప్రాయం కొంత తగ్గినట్లు కనిపించింది. మానాయనగారి ఆరోగ్యమైనా

అడుక్కుండా కదిలి పోయ్యాడు నవ్వుకొంటూ. నాకాశ్చర్యం కలిగింది. జీవితం వేళాకోళం కావడం అంటే యిదే కాబోలు! నాకొచ్చే జీతం అతనికి అంతటి ఆనందాన్ని కలిగించింది.

మూడేళ్ళు గడిచాయి.

నా జీతం ఎంతో ఎవరైనా అడిగినప్పుడల్లా, డైరీలో వ్రాసి గుర్తు పెట్టుకుంటున్నాను. అప్పటికి రెండు వందలా యిరవై సార్లు యీ ప్రశ్న అడగడం జరిగింది. అది యించుమించు నే కలుసుకొన్న వ్యక్తుల సంఖ్య. ఒక వ్యక్తి ఆ ప్రశ్న వేసి సమాధానం తెలుసుకుంటే, ఆ సమాధానం తన కుటుంబంలో అందరికీ తెలుస్తుందని అనుకొందాం. అప్పుడు ఒకొక్క వ్యక్తి కుటుంబంలో పదిమందైనా వుంటారని అనుకుంటే రెండు వేల మందికి పైగా నా జీవితం గురించి తెలిసిందనుకోవచ్చు. అంటే యించుమించు నా జీవితంలో ఎంత మంది పరిచితులవుతారో అందరికీ నా ఆర్జన సంగతి తెలిసిపోయింది. అమ్మయ్య - అని నిట్టూర్చాను. గుండె నెమ్మదిపడింది. కాఫీ తాగి, సినిమాకెళ్ళాను. ఇంకెవ్వరూ, ఎప్పుడూ ఆ ప్రశ్న వెయ్యరు. ఒక పెద్ద సమస్య పరిష్కారం ఐపోయింది.

సుందరం బంధువులింట్లో వివాహానికి నేనూ వెళ్ళాను. రెండో నాడు పెండ్లి వారింట్లో, రెండోసారి కాఫీలు వచ్చే సూచనలు లేకపోతే,

నేను హోటలుకేసి వెళ్ళాను. ఎదురుగా రంగనాథం కూర్చున్నాడు. నాకు పరిచితుడే.

"అప్పుతే నువ్వు యిప్పుడెక్కడుంటున్నావు?"

ఫలానా చోటని చెప్పాను.

"అవునవును — జ్ఞాపకం వొచ్చింది. నీకిప్పుడేం తీస్తున్నారు?" అని నాకేసి వింతగా చూశాడు.

రంగనాథానికి యిదివరకొకసారి చెప్పడం జరిగింది. ఈ విధంగా అడిగిన వాళ్ళే మళ్ళీ అడగడం ఆరంభిస్తే, దానికి అంతుందా?

"అది కూడా జ్ఞాపకం చేసుకో" అన్నాను నేను.

"వెనకోసారి చెప్పావు. నాకు మందమతిరా."

"నా మాటకేంగాని, నీ విషయం చెప్పు. జీతం విషయం కాదు. మీ ఆవిడ ఆరోగ్యం ఎట్లావుంది? ఆ మధ్య చాలా జబ్బు చేసిందటగా?" అన్నాను, ధోరణి తప్పిద్దామనీ, నిజంగా తెలుసుకుందామనీ.

"ఇప్పుడు నెమ్మదిగానే వుంది. న్యూమోనియా వచ్చింది. రెండు నెలల జీతం ఖర్చయింది డాక్టర్లకి. ఏదో రొందత్తెంది." అని మౌనంలో పడ్డాడు; కష్టాలు జ్ఞాపకం చేసుకుంటూ. ఇంక ఆ మనిషిని పరామర్శించడం మంచిది కాదని తోచింది. ఎందుకంటే అతని జీతం ఎంతో నేను అడక్కుండానే చెప్పేశాడు. తన జీతం తెలియచేసిన వ్యక్తి అవతల వాడిదెంతో

కనుక్కోకుండా వదలడని నా అనుభవం. మెల్లిగా లేచి బిల్లు చెల్లించి రాబోతున్నాను.

"ఉండు, నేనూ వొస్తున్నా" అని లేచి వొచ్చాడు.

రోడ్డు మీదకి రాగానే ఈ మహానుభావుడు అడిగేశాడు.

అవుతే నాకేం తీస్తున్నారంటావు ?"

"సుర్భా మోనియా? బాలా ఘోరాతైన వ్యాధన్న మాట!" అన్నాను.

సుర్భామోనియాను వర్ణించాడు రంగనాథం.

పెళ్లివారిల్లు చేరుకున్నాము. పన్నెరు E జల్లేటందుకు రంగనాథాన్ని పిలిచారు. వెళ్ళాడు.

ఎంతో సేపు కాలేదు.

బంధువులు, మిత్రులు, పరిచితులు, వో పది మంది చేరారు. ఆడపెళ్లివారి పెనాసితనాన్ని చర్చిస్తున్నారు. చర్చలో పాల్గొన్న వారిలో ముఖ్యుడు, వొకాయన, పొడుగ్గా వున్నాడు గిరిజాలు, జరీ కండువా, కోటూ, గడియారం అవీ వున్న ఆ పెద్ద మనిషి, నా పక్కన కూర్చున్న కళ్ళజోడు వ్యక్తిని పలకరిస్తూ —

మీరెవరి తాలూకు? అని అడిగాడు

కళ్ళజోడు వ్యక్తి ఆడపెళ్లి వారి తాలూకని చెప్పాడు.

"ఏం చేస్తున్నారు?"

ఫలానా అని చెప్పాడు.

"మీకేమిస్తారు?"

సభ సమాధానం కోసం వర్షం కోసం మేఘాల కేసి చూస్తున్న రైతుల్లాగ నిశ్శబ్దంగా ఎదురు చూసింది.

కళ్ళజోడు వ్యక్తి గుండెలు ఆగిపోయింది.

"ఎనబై" అన్నాడు — వడగళ్ళ వర్షం పడింది.

గిరిజాల వ్యక్తి చాలా వెటకారంగా నవ్వుతూ ఇల్లా అన్నాడు.

"మా వాళ్ళ తాలుకోకడు మీ దాంట్లోనే వున్నాడు. నలబై అని చెప్పాడే!" అన్నాడు.

సభలో నిశ్శబ్దం, ఆశ్చర్యం, వేళాకోళంగా కిలకిలలు.

కళ్ళజోడు వ్యక్తి — అబద్ధాలకోరు — మోసగాడు, దొంగ — దొరికిపోయాడు. సత్యాన్ని కాళ్ళూ చేతులూ కట్టేసి, గిరిజాల వ్యక్తి అరచేతిలో పెట్టి నొక్కుతున్నాడు.

"నలబైని రెండెట్టి గుణిస్తున్నారే," అని రెట్టించాడు. కళ్ళజోడు వ్యక్తి తన జీతాన్ని రెట్టించినట్లు.

కళ్ళజోడు వ్యక్తి చాలా గడసరి మనిషి

"అంటే, అసలు జీతం — బేసిక్ పే — నలభయ్యే ననుకోండి. వార్ ఎలవెన్సు, సిటీ ఎలవెన్సు, తిండి ఎలవెన్సు, ఆ ఎలవెన్సు, ఈ ఎలవెన్సు అన్ని కలుపుకొని, ఎనబై, ఎనబై ఐదు

అరవై, డెబ్బై, డబ్బై ఐదు దాకా వస్తుంది!" అన్నాడు. కాని, ఎన్ని కలిపినా ఎనభై కి రాలేదు. సభ అతన్ని చూసి జాలి పడింది. నల్లజోడు వ్యక్తిని ఈ పరీక్షకు లాగినందుకు రెండు నెల్లు కాలం హాస్పిటల్లో వుంచాలనిపించింది.

గిరిజాల భూతద్దం దృష్టి నా మీద ఎక్కడ పడుతుందోనని భయపడుతూనే వున్నాను. సత్యాన్వేషకుల్ని ఎవరు ఆపగలరు? నా మీద కూడా పడ్డాడు.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్లున్నాను? అన్నాడు.

"అవును. మీకు నా విషయం అంతా తెలుసు. జ్ఞాపకం చేసుకోండి అన్నాను.

"కాకినాడా?"

"ఇంకా సందేహమా" అనే శానం తెగించి

"ఇప్పుడేం చేస్తున్నారు?"

"అప్పుడొకటి, ఇప్పుడొకటి వుంటుందా; ఎప్పుడూ ఒకటే" అన్నాను.

సభలో కిలకిలలు

"జ్ఞాపకానికి రావడం లేదు" అన్నాడు గిరిజాల భూతద్దం.

"తమరేం చేస్తున్నారు?" అన్నాను. చూడండి — నలుగుర్లో కెళ్లి మాట్లాడడం అంటే నాకెంతో హడలు. అట్లాంటిది, సంఘం నాకెంత ధైర్యం ఇచ్చిందో!

"నేను రిటైరయ్యాను లెండి అన్నడాయన

ఆ బాణంతో నేను కిందపడ్డాను

కాసేపు మౌనంలో వుండి కోలుకొని గిరిజాల వ్యక్తి ఇంకొక పెద్దబాణం నా మీద వేశాడు.

"మీకేమిస్తున్నారు?"

నేను సమాధానం చెప్పకూడదని నిశ్చయించుకొన్నాను.

"మీ పెన్షన్ ఏమాత్రం?" అన్నాను.

ఉద్రేకంతో అతని తెల్ల గిరిజాలు కదిలాయి.

"మాదంతా ఐపోయింది... మీది ఓల్డు స్కేలా? న్యూ స్కేలా?"

"మాది తులాభారం

ఇద్దరు ముగ్గురు సంతోషించారు. ఒకడు మెచ్చుకున్నాడు కూడా.

"ఏదో పెద్దవాళ్లని అడిగాను, చంపక చెప్పవూ!" అన్నాడు గిరిజాల వ్యక్తి

"చెప్పకపోతే మరణిస్తానంటారు?" అన్నాను.

"చెప్పితే నీ నోటి ముత్యాలు రాలుతాయా చెప్పవూ?

గిరిజాల వ్యక్తి నన్ను బుజ్జగించాడు, బెదిరించాడు, కోపించాడు — కాళ్లా వేళ్లా పడి బ్రతిమలాడాడు. ఏమిస్తారో చెప్పమని దైన్యంగా కోరాడు.

అనుభవజ్ఞులు — మీరే చెప్పుకోండి" అన్నాను. ఆయన జీవితంలో నేర్చుకున్న పాఠాలని వల్లె వేసుకుంటున్నాడు— వందా? నూట యాభై య్యా? రెండు వందలా? ఏది? అబ్బ! బాధగా వుంది—చెప్పాలి. భూమి పాదాల కింద విడిపోతోంది. ఆకాశం పడిపోతోంది. చెప్పు, చెప్పు—నాకేంతీస్తారు?, ఏమిస్తారు? దేశం చెప్పిన సందేశం అది.

సభికులు విసుక్కొన్నారు.

కళ్ళజోడు వ్యక్తి ఆడదైతే నన్ను బలవంతంగా వివాహం ఆడును— అంతటి సంతోషం అతడు చూపించాడు. నేను సమాధానం యివ్వనందుకు నేనొక కథానాయకుణ్ణి అంటున్నాను. సంఘం ఈ ప్రశ్న ఎందుకడుగుతుందో నాకర్థం కాలేదు. బ్రిటిషు వారు పాలించిన రోజుల్లో ప్రభుత్వం నడపడానికి, వారికి చాలా మంది గుమాస్తాలు కావల్సి వొచ్చింది. మధ్య తరగతి కుటుంబాలు ఈ ఉద్యోగాలకి వెళ్ళారు. వారికి వ్యవసాయం చేయడం గౌరవానికి లోపం. భూములను ఎవరికో వ్యవసాయానికిచ్చి, జమీందారుల్లాగ కూర్చునేటంతటి భూములూ లేవు. అంచేత వారి గుమాస్తాగిరి కోరుకున్నారు. మొదట్లో గుమాస్తాలుగా చేరినా, చాలా ఆస్తులు సంపాదించగలిగే వారు—లంచగొండితనం వల్ల. మా ముత్తాతకి తన పేరు సంతకం చెయ్యడం కూడా రాదు. రెండిళ్ళు, నలభై ఎకరాల భూమి సంపాదించాడు— ఎనిమిది రూపాయల జీతంతో. అంతే కాదు; తాలూకా గుమాస్తాగా చేరినా, ఆరోజుల్లో

నాలుగింగ్లీషు ముక్కలు వస్తే, గబగబ పెద్దపెద్ద వుద్యోగాలలోకి వెళ్ళేవారు. ఆ వుద్యోగాలకి పెద్ద జీతాలూ, హోదాలు కూడా వుండేవి. హోదా వున్నవాళ్ళని, ఎదురుగా వెళ్ళి జీతం ఎంతో అడిగే ధీమా, ధైర్యం ప్రజా సామాన్యానికి లేదు. అంచేత వారికి ఆ హోదాలో ఎంత జీతమో తెలుసుకోవాలని ఆదుర్దా వుండేది. ఆ సంప్రదాయంలో పెరిగిన గిరిజాల వ్యక్తుల వంటి వారు మన సంఘంలో ఎందరో వున్నారు. అందువల్ల వారంతా ఈ ప్రశ్న అడుగుతున్నారనుకుని ఓదార్చుకొనేవాడిని. ఇది పెద్దవారి ఆదుర్దాకి సమాధానం కావచ్చు. మిగతా వారి మాటేమిటి?

ఒక మృగం మరొక మృగాన్ని అడివిలో ఎదుర్కొంటుంది. తనకంటె బలమైనదైతే అది శత్రువు; దాన్నుండి పారిపోతుంది. తనకంటె బలహీనమైనదైతే దాన్ని తినేస్తుంది. దానితో సమానమైనదైతే స్నేహం చేస్తుంది. మనుష్యుల్లోనూ అంతే. జంతువులలో బలాబలాలు నిర్ణయించేటందుకు తగినంత పరికరాలున్నాయి — కోరలు, కొమ్ములు, జూలు, పరుగెత్తడం, ఎత్తు ఎగరడం, దూకడం; మనుష్యుల్లో ఈ పరికరాలు లేవు — ఏ కొద్ది మందికో మోటారుకార్లుండొచ్చు. మిగతా విషయాలలో ఇంచుమించు అందరూ ఒకే లాగుంటారు. పైగా మేడలకి, కార్లకి, జీతానికి సంబంధం వుంది. అందుకని, ఆర్జన ఎంతో కనుక్కుంటారు.

అవతలవారి జీతం తెలిస్తే మనం క్షేమంగా

వుంటాం. అట్లా తెలిసిన తర్వాత, వారికి ఓ విలువ కట్టేసి, సంఘంలో ఒక స్థానం ఇచ్చి మనం మరో చోట నిశ్చింతగా వుంటాం. ఈ దేశంలో ఎన్ని మతాలున్నాయి. యుగానికొకటి చొప్పున ఆధునిక యుగంలో మతం సృష్టించారు. వారు — వారిది జీతాల మతం — పై అధికారి, కింద అధికారి మత ప్రచారకులు. ఇచ్చేవాడు దైవం. అదెంతో తెలుసుకొనేవారు భక్తులు. జీతం లేనివారు అస్పృశ్యులు, ఈ తరగతికి సహాయం చేసి, అస్పృశ్యతని నాశనం చేయటానికి, ప్రభుత్వం కృషి చేస్తూ వుంటుంది. ఈ లాంగ లోకంతో సంఘంతో సమాధానపడ్డాను.

మరో మూడేళ్లు గడిచాయి. నా వుద్యోగం మారింది. పెద్దదైంది. జీతం మూడింతలైంది. ఈ మూడేళ్లలోనూ జీతం ఎంత అని అడిగిన వారి సంఖ్య నూట ఎనభై. వారు కోరింది జీతం ఎంతని కాదు. "యిప్పుడెంతిస్తారు" అని. వుద్యోగం మారడం, జీతం పెద్దదవడం కూడా బాధే అనిపించింది.

నా జీతం తక్కువగా వున్నప్పుడు చెప్పడానికి సిగ్గుపడ్డావు కాని, యిప్పుడు నిర్భయంగా, సంతోషంగా, అడక్కపోయినా చెప్పకూడదా అంటారేమో మీరు! దానికి రెండు సమాధానాలున్నాయి. గవర్నర్ జనరల్ నైతే తప్ప, నా మీద నాకంటె పెద్ద జీతగాళ్లు ఎందరో తప్పక వుంటారు. నా జీతం ఎంత? అని ప్రశ్నించిన వారికంటె, నాది ఎక్కువ జీతమైతే

ఆ ప్రశ్నకి సమాధానం చెప్పడం సులభమే. అందుచేత నన్ను యీ ప్రశ్న అడగదల్చుకున్నవారు ముందు వారి జీతం ఎంతో చెప్పేసి నా సమాధానం కోసం ఎదురు చూడాలి. వారిది నాదానికంటె ఎక్కువైతే సమాధానం రాదు. ఈ ఏర్పాటు ఎందరు ఒప్పుకుంటారు. పైగా, "యిప్పుడేమిస్తారు?" అని అడగటంలో కొంత కసి కూడా వుంది. అంటే, "ప్రస్తుతం నీ జీతం గొప్పదైనా, మొదట్లో చిన్నదే లే" అన్న హేళన కూడా వుందిగా.

బజార్లో, బాల్య స్నేహితుడు బలరామయ్య కనబడి నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళాడు. తన యిద్దరి చిన్నబిడ్డల్ని చూపించాడు. బలరామయ్య డబ్బున్నవాడు. ఉద్యోగం చేసే అవసరం లేదు. ఉద్యోగాలు, జీతాలు- వాటిని గురించి తెలుసుకోవాలన్న మనస్తత్వం కనబర్చనందుకు సంతోషించాను.

"ఇప్పుడెల్లా వుంది నీ కథ?" అన్నాడు మొదట్లో బెదిరిపోయాను.

"అంటే?" అన్నాను

"ఒకటా, రెండా? —"

నాకు భయమేసింది. నా నాడి ఆగింది.

"లేక నాలాగ రెండా?" అని వాక్యం పూర్తిచేశాడు.

"పిల్లలా?" అన్నాను.

"మరింకే మనుకున్నావు. ఉద్యోగం చేసి, రెండు మేడలు కడతావనుకుంటానా?" అన్నాడు.

కట్టిన వాళ్ళు లేరా?" అన్నాను గర్వంగా.

"వెనకటి రోజుల్లో వున్నారేమో." విషయం మార్పించేటందుకు అతని పిల్లల ఆరోగ్యం కనుక్కున్నాను.

"మీ అబ్బాయి పెద్దయింతర్వాత ఏంచేస్తాడు?" అని అడిగాను.

"పెళ్ళి చేసుకుంటాడు" అని చెప్పి నవ్వుకున్నాడు. ఇంతలో అతన్ని స్నానానికి పిలిస్తే లోపలికి వెళ్ళాడు.

ఇద్దరు పిల్లలూ సిరాబుడ్డి తీసుకుని ఆడుకుంటున్నారు. పెద్దవాడు వాళ్ళమ్మ పిలిస్తే లోపలికెళ్ళాడు. రెండోవాడు సిరాతెచ్చి నాచొక్కా మీద పోశాడు.

పెద్దవాడు గ్లాసులో కాఫీ తెచ్చి బల్లమీద పెట్టాడు. తలుపువెనక నిలబడ్డ ఆమె వాళ్ళమ్మ.

ఆవిణ్ణే నే నెరుగుదును. ఆవిడ పేరు సూరమ్మ. మొదట నాకిచ్చి వివాహం చెయ్యాలనుకున్నారు. నాకు తగినంత ఆస్తి లేదని మానుకొన్నారు. సూరమ్మకి తగిన మొగుడు ఆ పల్లెలో లేడనుకొన్నారు — ఏ ఉత్తర హిందూస్థానం నుంచో రావాలిట! అంత అందమైందని అనుకొనేవారు.

"ఎక్కడుంటున్నారు?" అంది సూరమ్మ నీరసించిన కంఠంతో — ముగ్గురు సంతానం కలిగాక కంఠంలో తియ్యదనం ఎక్కడుంటుంది.

ఫలానా చోటని చెప్పాను. ఏం చేస్తున్నారంది; ఫలానా అన్నాను. "ఏమిస్తారు?" అంది.

నాకు మండిపోయింది.

సామాన్య ప్రపంచానికి భిన్నంగా వుండాల్సిన ఆ సూరమ్మ — అదా నాకివ్వవలసిన సందేశం!

"రోజులు గడుస్తాయి" అన్నాను చమత్కారంగా. సూరమ్మకు గాజులు మోచెయ్యిదాకా వున్నాయి.

"నెలకింతా అని లేదూ?" అనిరెట్టించింది.

"మీరెంజోవాడు భలే అల్లరి చేస్తాడు కదూ?" అన్నాను. నేవేసే ప్రశ్నలో నాకే విశ్వాసం లేదు.

"మీకు పిల్లలా?" అంది.

"అమ్మాయ్యా" అని లోపల అనుకోవల్సింది పైకి అనేశాను, ఆవేశంలో

"అంటే?" అని, సూరమ్మ తెల్లబోయింది. ఆశ్చర్యంతో కనుబొమలు కదిలాయి.

"లేరు" అన్నాను.

"మీ ఆవిడ్ని ఓమారు తీసుకురామా యింటికి. జీతం ఎంతో చెప్పకపోతే పోనీలే" అంది.

"వాడి జీతం కథ కనుక్కుంటూంగా" లోపల నుంచి బలరామయ్య కంఠం వినబడింది.

ఏం, తను రాకూడదూ? భాగ్యవంతులైతే, వారింటికి నా భార్యని తీసుకెళ్ళాలా? తీసుకెళ్ళి ఉద్యోగం జీతం అంతా బైట పెట్టేతే సంతోషించి మళ్ళా తిరిగి నాకు వప్పచెప్తారా! సరే అన్నాను ఆ సమయంలో — లోపల పంపకూడదని నిశ్చయించుకున్నాను.

ఇంతట్లో బలరామయ్య వొచ్చాడు.

" అబ్బో నువ్వేకడ! పెద్ద ఉద్యోగస్తుడవయ్యావు. నువ్వు మీ ఆవిడ్ని తీసుకొస్తావూ?" అన్నాడు వెటకారంగా. వెటకారంగా అన్నా, అతనన్నది నిజమేనని నాకు లోపల తోచింది. ఆలోచించండి. పెద్ద జీతం వాడు, చిన్న జీతం వాడింటికి సాధారణంగా వెడతాడూ? వెడితే వాళ్ళ ఇంటిని పవిత్రం చేసినట్లు భావిస్తాడు. చిన్న జీతం వాడు, పెద్ద జీతం వాడింటికి వెడితే చిన్నతనం. అనుకొని వెళ్ళడు. మొత్తం మీద ఒకడింటికి యింకొకడు వెళ్ళడు. బాల్యంలో ఎంత స్నేహితులైనా, యిద్దరి మధ్యా ఒక గోడ లేస్తుంది. మొదట్లో కేవలం యిటికల గోడ — మధ్య మధ్య పెళ్ళిళ్ళు పండుగలూ — అనే కన్నాలుంటాయి. ఈ కన్నాలు కూడా కొంతకాలమే. వారి వారి భార్యలు రాంగానే కన్నాలు కప్పి సిమ్మెంటు చెయ్యడం జరుగుతుంది.

" ఏం, మాట్లాడవేం?" అని భుజం మీద చరిచాడు. కంగారుపడి లేచాను. అవుననో, కాదు కాదనో నవ్వేశాను. ఆడదానికి కన్నీరు, మొగాడికి నవ్వూ కొన్ని అవాంతరాలలో రక్షిస్తాయి.

నువ్వూ సూరమ్మా మాయింటికి రాకూడదూ? అన్నాను. బలరామయ్య ఆశ్చర్యపడ్డాడు.

" మా ఆవిడ పేరు నీకెట్లా తెలిసింది?" అని అడిగాడు.

"శుభలేఖలో వుండదరా?" అన్నాను

"ఓరే — నీకింకా జ్ఞాపకం వుందా?"

"మరుపు భాగ్యవంతుడి స్వభావంలో రత్నంలాంటిది" అన్నాను హాస్యధోరణిలో

"బీదవాడిలా మాట్లాడుతున్నావే — జీతం ఎంతేమిటి?" అని అడిగేశాడు. నా తెలివి తక్కువతనాన్ని తిట్టుకొని నాలిక కొరుక్కున్నా.

"చెప్పవేం?"

"నాలో సంస్కారాన్ని బట్టి, నా జీతం నువ్వే నిర్ణయించవచ్చు" అన్నాను, వ్యంగ్యంగా.

"జీతాన్ని బట్టి సంస్కారాన్ని నిర్ణయిస్తే, జమీందారులు గొప్ప సంస్కారం గల వాళ్ళవాలి" అన్నాడు. బలరామయ్య.

"నువ్వు చెప్పింది కొంతపాళ్ళు నిజం. కాని చిన్న భేదం వుంది జమీందార్ల ఆదాయాన్ని జీతం అనరు. అది ఆర్జించని ఆదాయం. అదే మన నాగరికతకో, కళకో, విజ్ఞానానికి సంస్కారానికీ పునాది .... వెన్నెముక" అన్నాను, తెచ్చిపెట్టుకున్న ఆవేశంతో.

"సార్జితం కాని ఆదాయంగలవాళ్ళకి తప్ప మిగతా వాళ్ళకి సంస్కృతి లేదంటావు?"

"లేదన్ను. వారి సంస్కృతి యొక్క పరిమాణం జీతాన్ని బట్టి వుంటుంది."

"ఒప్పుకుంటాను మహానుభావా! అప్పుడే నే సంస్కృతిని బట్టి జీతం వెయ్యి రూపాయలని

నాకు తోచింది" అన్నాడు బలరామయ్య వేళనగా
"జీతాన్ని బట్టి మనకు తెలిసేది ఒక సంస్కృతే కాదు; అజ్ఞానం కూడా." అన్నాను. బలరామయ్యకి అది నచ్చలేదు. ఏ విధంగా నాకు కూడా నచ్చలేదు.

"పోనీ, సరే నంటాను. అజ్ఞానాన్ని బట్టి చూచినా, నా జీతం పన్నెండు వందలకి తక్కువ కాకూడదు" అన్నాడు బలరామయ్య నవ్వుతూ.

"బాగుంది. అజ్ఞానం లెక్కించి, సంస్కృతి తీసెయ్యి" అన్నాను.

"ఉండు, వుండు... తీసివేతలూ, భాగహారాలూ మనకి బాగా రావు – ఆ... రెండు వందలన్నమాట" అన్నాడు.

సరిగ్గా అంతే కాదనుకో... ఆ చుట్టు పక్కల ..." కొంతసేపు మౌనంగా వుండి తర్వాత అన్నాను.

"సరియైన అంకె తెలుసుకోవాలంటే ఓ మార్గం వుంది. ఉద్యోగస్థుడి భార్య యొక్క అజ్ఞానం, సంస్కృతి కూడా నిర్ణయించి భర్తకీ, భార్యకీ వున్న భేదం ఎంతో అది సరియైన సంఖ్య."

"గొప్పగా వుంది. దాన్ని బట్టి నా జీతం ఎంతో చెప్పు?" అన్నాడు.

"నాది జీతం కాదు ఆర్జించని ఆస్తి" అన్నాను.

"చంపేశావు. పోనీ స్త్రీలకి జీతం లేదు కదా, వారి సంస్కృతిని నిర్ణయించడం ఎట్లా? అని అడిగాడు.

"వారి సంస్కృతి చక్కదనాన్ని బట్టి తెలుస్తుంది. మొగాడికి జీతం అవకాశాలు కల్పించినట్లుగానే, ఆడదానికి చక్కదనం అవకాశాలు కల్పిస్తుంది.

"ఈ వాదం ప్రకారం, చక్కదనం కొద్దీ ఎక్కువయ్యేది అజ్ఞానమా, సంస్కృతా?"

"అవకాశాలు" అన్నాను.

"అంటే?"

ఆస్తి, డబ్బు యిష్టం వచ్చినట్లుగా జీవించే అవకాశాలు కల్పిస్తుంది. విశ్రాంతి, డబ్బు-రెండూ వుంటేనే సంస్కృతి వుంటుంది. స్త్రీకి యీరెండూ చక్కదనంతో వస్తాయి అంటే, యీరెండూ వున్నవాడు ఆమెకు లభిస్తాడు.

"ఆగు, ఆగు. లభించిన తర్వాత, మొగుడికి ఆరెండూ లేకపోతే!"

ఆ విషాదగాధలు సాంఘిక జీవితంలో విప్లవానికో, సారస్వతంలో అభివృద్ధికో కారణాలు."

"మరోటి, కర్మవశాత్తు ఒక అందమైన ఆడదానికి యీరెండూ లేనివాడు దొరుకుతాడనుకో అప్పుడు?" అని అడిగాడు.

"అవకాశాలుండనే వుంటాయి. తన చక్కదనంవల్ల, మొగుడికి ఆరెండూ కలగవచ్చు" అన్నాను. బలరామమూర్తి ఎందుకో ఆలోచనలో పడ్డాడు. మనిషి మొహంలో కాంతి తగ్గింది. నా మాటలు సూరమ్మకు అన్వయించి బాధపడుతున్నాడా? ఏమో! సెలవు తీసుకుని

నే వెళ్ళి పోయ్యాను. ఆ మర్నాడు ఆదివారం సాయంత్రం అతడు మా యింటికొచ్చి సుందరాన్ని చూసి, కొంత నెమ్మది పడి వెళ్ళి పోయ్యాడు. నాకదొక అపూర్వమైన అనుభవం.

ఆవేశంలో, అనేక సిద్ధాంతాలు చేసేశాను. నాగరికతపై విప్లవం చేసే శక్తి అందరికీ వుండదు. వంటింట్లో విప్లవం చాలా సులభం మూడు సంవత్సరాలైన తర్వాత, బలరామయ్య, సూరమ్మను విడిచిపెట్టేశాడని విన్నాను. ఎందుకో వివరంగా తెలిసింది కాదు. నా జీతం ఎంతో అడక్కపోతే, సూరమ్మ జీవితం అట్లాగే వుండేదేమోననిపించింది. "జీతం"! – "జీవితం"! వీటి అర్థం, ఎంత దగ్గిర!!! సృష్టి రహస్యం అర్థం కాకుండా, ఒక్క అక్షరం ఎక్కువగా వుంది!

మరో మూడు సంవత్సరాలకి నా జీతం మూడింతలైంది. నా సమకాలికులందరికీ జీతం ఎంతో తెలిసి పోయింది. మరో తరం బైలుదేరింది. వారందరికీ మేం పెద్దలం; ఆదర్శ వ్యక్తులం; మార్గదర్శకులం. మా జీతాలతో వారికంత అవసరం లేదు; మాకు గౌరవం వుంది సంఘంలో

అలవాటు చొప్పున నా సమకాలికులలో కొందరు యింకా నిలేసి నా జీతం ఎంతో అడిగిన వాళ్ళు లేక పోలేదు. ఏం చేస్తారు? అడిగే టందుకు వారికి మరో ప్రశ్న కనబడలేదు పాపం!, ఇచ్చే టందుకు మరో సందేశం లేదు.

భార్య ఆరోగ్యం?

పిల్లలు కులాసా?

ఇంక్రిమెంటొచ్చిందా?

ట్రాన్స్‌ఫరైందా?

రిటైరైతే పెన్షనెంత?

ఇది – వారు పాడుకొనే భావగీతం

నాకాడ పిల్లలు లేరు. అంచేత అల్లుడు లేడు. ఉంటే వారు పాడే పాట వేరు.

అల్లుడికేమిస్తారు?

అబ్బాయికేమిస్తారు?

పెద్ద కుటుంబాలైతే ధోరణి వేరు.

మొదటి వాడికి రెండొందలా?

రెండో వాడికి వందా?

మూడో వాడికి చిత్రం మూడొందలటగా

చిన్న చదువుకి పెద్ద జీతం

అజ్ఞానానికి సున్న.

అరెర్రే పాపం! జ్ఞానానికి అరసున్నా!

ఆ రోజుల్లో నా జీతం అడిగే వారు, యించుమించు నాలాంటి ఆర్జన కలవారే. వాళ్లు ప్రశ్నించే ధోరణి వేరు – అదొక కళ. వారు హైరోడ్డు మీద నడవక సందుల్లో నడుస్తారు.

రామనాథం, నేనూ రైల్లో ప్రయాణం చేస్తున్నాం. మేం యిద్దరం ఎరుగున్న కుటుంబరావుని గురించి మాట్లాడుకుంటున్నాం.

"పాపం కుటుంబం –" అన్నాడు.

"అవునవును" అన్నాను వినిపించుకోకుండా.

"ఆ జీతం నా సిగరెట్లకు చాలదు" అన్నాడు. నిజానికి నాకు రామనాథానికి ఎంతిస్తారో తెలీదు. పెద్ద జీతమై వుండాలి.

"నువ్వే మాత్రం ఇన్సూర్ చేశావు?" అని అడిగాడు.

"ఏమీ చెయ్యలేదు."

రామనాథం ఆశ్చర్యపడ్డాడు.

"పోనీ బాంకులో ఏమాత్రం?"

"సున్నా."

కొంర్య బూరాడు.

"ఏం కథ, గుర్రం పందాలా... లేక..."

"... ... ..."

ఏమోలే... అల్లా అనుకోవలసి వస్తోంది.

"... ... ..."

"మరి జీతం అంతా ఏమవుతోంది?"

"ఎంత చెట్టుకి అంత గాలి" అన్నాను.

"నీ చెట్టు సైజు ఏమాత్రం?"

అది నాగరికుల మార్గం. మొహాన మురికి వాళ్ళు జల్లరు - అందులో కాస్త పన్నీరు కలిపి చల్లుతారు.

"మాట్లాడరేం?"

"చెట్టు ఎంత పెద్దదైతే అన్ని కొమ్మలు" అన్నాను.

"పిల్లలకవుతోందన్న మాట!"

"నీకెందరు?" అని అడిగాను

వివరాలు చెప్పాడు. పెద్దవాడు రంగూన్‌లో

వున్నాడు. వాడి జీతం మూడొందలు. అదృష్టవశాత్తూ రైలు నిలిచింది. నేను దిగి ప్లాట్ ఫారం మీదికి నడిచాను. రాజారావుగారబ్బాయి, రంగారావు కనిపించాడు. నాచేతిలో బాగ్ తీసుకొన్నాడు.

" ఏమండోయ్ — విన్నారా — నాకు ఉద్యోగం దొరికింది అన్నాడు సంతోషంతో.

" సంతోషం."

" ఆరంభంలో నూరు. మీకెంత జీ?" అని అడిగాడు. బాగ్ లాక్కొని గబగబ నడిచిపోయాను.

మరో తరం వారు వేరన్నాను యిందాకా. ఇందులో నే పొరబడ్డాను. వారి సందేశం కూడా యిదే — అని బాధపడ్డాను. సమానత్వం అనేది మానవుడి స్వప్నంగా వుండాల్సిందే కాని లోకంలో నిజం కాదేమో!

నాకా వూరు కొత్త. జబ్బు చేసింది. మంచాన పడ్డాను. సుందరం కూడా జబ్బుగానే వుంది. ఓ మిత్రుడు వొక డాక్టర్ని తీసుకొచ్చాడు. ఆయన అన్నీ పరీక్ష చేసి మందు పంపించాడు. రెండు రోజులైంది. నయం కాలేదు.

" మలేరియా — రెండు రోజుల్లో తగ్గుతుంది" అని హామీ యిచ్చాడు.

ఇది సీజన్. చైర్మన్ కే యిదే జబ్బు, నా ట్రీట్మెంటే; మొన్న సబ్ కలెక్టర్ మామగారు పైరిస్తే వెళ్లాను, మలేరియా" అవన్నీ వర్ణించాడు డాక్టరు.

" మీరు యీ వూరికి కొత్త. ఏం చేస్తున్నారు?"

ఫలానా అన్నా.

"ఏమిస్తారు?"

సబ్ కలెక్టర్ కో, చైర్మన్ కి ఏమిస్తారో ఆయనికి తెలుసు మరి నా విషయమేమో! తెలిస్తేగాని, తను అల్లుకున్న వలలో నన్ను యిమడ్చలేడు. చేపల వలలో బురదపాము పడితే ఎట్లా? నాకు నీరసం, దిగులు. మాట్లాడిస్తాడు. ఆ ప్రశ్నకి సమాధానం యిచ్చినేను కళ్ళు మూస్తే బిల్లు పంపకపోయినా ఆయనికి చింత లేదు.

నేను భయంతో కళ్ళు మూసుకున్నాను. నాకు కోపం రాలేదు. జాలేసింది. ఏడుపొస్తోంది.

"బిల్లు పంపించండి" అంది సుందరం.

ఆయన పంపలేదు, మళ్ళా రాలేదు.

మరో మూండేళ్ళు గడిచాయి. ఏళ్ళు గడవడం కథల్లోనే కాకుండా జీవితంలోంచి కూడా సులభం. గడిచిపోవడం గురించి ఆలోచిస్తే నే జీవితం అంతా ఒక చెడ్డ స్వప్నంలా ఉండటం, సృష్టి అంతా మాయగా తోచడం జరుగుతుందేమో! ఎంత దూరం, ఎంత కాలం ప్రయాణం చేసినా, అక్కడే వున్నాను — అద్దంలో చూచుకుంటే ప్రయాణం అలసట కొంచెం కనబడొచ్చు. సంఘానికి నాజీతం గురించి పరామర్శలు తగ్గాయి. కొత్త వ్యక్తుల మీదికే పోయింది. సంతాన నిరోధక మార్గం మనదేశంలో ప్రచారం కాకపోవడం వల్ల నాకు జరిగిన లాభాల్లో యిదొకటి. కొత్తగా జన్మించిన వారి జీతాల విషయం

కనుక్కుంటుంది మరి!

నా జీతం పెద్దదైంది. ఇంత కంటె పెద్దదయ్యే అవకాశాలు లేవు. దేశానికి స్వాతంత్ర్యం కూడా వొచ్చింది. అంచేత నాకు మరి అంతకంటె పెద్ద వుద్యోగం, "కేంద్రం" లో దొరకడం గొప్ప కాదు. నా అభిప్రాయాలు చాలా వరకు స్థిర పడి పోయాయి. మంత్రులందరూ జీతాలతో కనపడతారు. సంఘం అంటే ఎంత? అని అడిగే ఏక ధ్వని. స్త్రీ అంటే జీతాన్ని మాయం చేసే ఏక శక్తి. స్త్రీ జీతాన్ని తగ్గించగలదు; హెచ్చించగల్దు. అసలు లేకుండా మాయం చేయగల్దు. సత్యం అంటే జీతం ఎంతో కనుక్కోవడం. సౌందర్యం జీతం ఎంతో అడగడం. సంస్కారం అంటే అదే చమత్కారంగా అడగడం; "కళ" అంటే అదెంతో చెప్పక పోవడం - యీ విధంగా నా మనస్తత్వం తంతరారైంది. నే నేం చెయ్యను?

నేనే యింకొకరికి జీతాలిచ్చే ఏర్పాటుంటే - అప్పుడు నన్ను "మీరేమిస్తారు?" అని అడిగే మహానుభావులుంటారు. ఆ ఏర్పాటు లేదు; అంచేత వొక్కటే మార్గం వుంది; సన్యాసం పుచ్చుకోవాలి - సన్యాసి యివ్వడు, పుచ్చుకోడు - పుచ్చుకుంటే ఎప్పుడైనా పాలు, పళ్ళు; ఇస్తే ఎప్పుడేనా కాస్త బూడిదిస్తాడు.

సుందరం మనస్సు కూడా నెమ్మదిగా లేదు. ఏదో మూగ బాధ; నా కేసి చూళ్ళేదు: నాతో మాట్లాడ లేదు. వెఱ్ఱిగా చూస్తుంది. స్వప్నంలో సంచారం; మేం ఒకరి కొకరం దూరమై పోతున్నాం. పిల్లలు చెయ్యీ చెయ్యీ కలుపుతున్నారు. వేళ్ళు నొప్పితో వదిలేస్తాం. శరీరాలు విడిపోయి, ఆత్మలు రెండూ ఏకం అవుతున్నాయనుకోవాలి.

ఏమిటో అదంతా భ్రమ! మాయ! శరీరాలు భ్రమైతే, ఆత్మలు భ్రమ కాకూడదా?

విశాలానంద స్వామిని ఒకసారి దర్శనం చేశాం. ఆయన గొప్ప యోగి; ఆయన్ని గురించి వింతగా చెప్పుకున్నారు. ఒక ప్రశాంతత హృదయాన్ని నింపుకుంటుందన్నారు. చాలామంది జనం వెళ్ళి ఆయన్ని చూచి వొస్తున్నారు. మాకూ ప్రశాంతత కావాలి.

ఉదయం ఎనిమిదైంది. ఆశ్రమంలో వో పదిమంది కంటె ఎక్కువ జనం లేరు. వెళ్ళి నేలమీద పడి నమస్కారం చేసి కూర్చున్నాం నేనూ, సుందరమూ.

విశాలానంద స్వామి నిండైన మనిషి. విశాలమైన నుదురు. పెద్ద కళ్ళు. వెడల్పైన నోరు. లావైన మెడ— నాటకం లోని ఖామండి వేషంలా వుంటాడు. సగం మూసిన కళ్ళతో ధ్యానం చేసి, కొంతసేపటికి కళ్లు తెరిచాడు. చిరునవ్వు నవ్వి, దగ్గరగా చేరిన నలుగుర్ని కుశల ప్రశ్నలు వేస్తున్నాడు. చనువుగా మాట్లాడాడు. నాకు భయం పోయింది. కొందరు యోగులు మాట్లాడరని మౌనంగా వుంటారని ప్రతీతి. ఈయన అట్లా కాదు. నాకు సంతోషం కలిగింది. నా సందేహాలన్నీ తీర్చుకోవచ్చునని, పరమానందంతో కూర్చున్నాను.

నేను ఎక్కడనుంచి వొచ్చిందీ అడిగారాయన.

నమ్రతతో చెప్పాను.

ఏం చేస్తున్నదీ అడిగారు.

ఇంకా నమ్రతతో ఫలానా అని చెప్పాను.

"ఏమిస్తారు?" అన్నారాయన

నేను కొయ్యబారి పోయాను. చావడం సులువై వుంటే, చనిపోయ్యేవాణ్ణికూడా. సమాధిలో పడ్డాను. ఒక గొప్ప తేజస్సు నాలో లేచింది. ఎవరో హృదయాన్ని బైటికి తీసి, కడిగి మళ్ళా స్వస్థానంలో వుంచినట్లయింది ఆ అనుభవం. జ్ఞానోదయమైంది. సత్యాన్ని తెలుసుకున్నాను. ఆత్మశుద్ధి జరిగింది. ఆత్మ పవిత్రమైంది. సందేహాలు, సంశయాలు నశించాయి. ఆత్మబోధచే సత్, చిత్ ఆనందాలు జీవాత్మగా మారి పరమాత్మలో ఐక్యమయ్యాయి. అదే ఉపదేశం నాకిచ్చిన సందేశం.

దాని ఫలితం?

నేను ఉద్యోగాన్నించి రిటైరయ్యాను
గోదావరీ నదీ తీరాన చిన్న పాక వేసుకున్నాను.
ఒక ఆవుని తెచ్చుకున్నాం.
సుందరం నదిలో స్నానంచేసి, పాలు పిండుతుంది.
ఇద్దరం పాలు త్రాగి, లోకాన్ని విశ్వాన్ని పరిశీలిస్తాం.
ఎవరైనా వాస్తే, కాసిని పాలిస్తాం.

గడ్డిపోచల్ని కోస్తుంది సుందరం— నేను ఆ గడ్డిపోచల్ని వొకటొకటే నదిలో వొదిలి అలల మీద వాటి ప్రయాణం పరిశీలిస్తాను.

సంధ్య వెలుగులో ఎర్రనైన గడ్డిపోచ నీటిని పచ్చగా కలవరపెట్టి నిశ్చింతంగా కదిలి, నా మనస్సులో నిలిచిపోతుంది.

అదే, అది నాకిచ్చిన సందేశం.

# మానవసేవ

శ్రీ ధనికొండ హనుమంతరావు.

Dhanikonda Hanumanta Rao (1919 --) is a popular writer. He possesses the rare ability and the technique to make an interesting story out of any ordinary problem. His stories usually appear in the Telugu periodicals and many of them are yet to be collected and published in volumes. Like many writers, he is liberal in the use of English words. Most of his stories are on problems of sex and love as seen in present-day society. He tells his stories with a touch of erotic realism, though the following story is not of that type.

## మానవసేవ

తీయని కలలుకన్న నిద్రనుంచి మెలకువ వచ్చింది- డాక్టరు గోపాలానికి. ఐతే మంచం మీదినుంచి దిగడానికి యిష్టంలేదు. గడియారం నాలుగు గంటలు కొట్టింది. ఇంకా గంటన్నర టైమున్నది. కనుక మరో అరగంటసేపన్నా తీయని ఆలోచనల్ని సాగించుకోవచ్చనుకున్నాడు డాక్టర్, తన జీవితంలోని ముఖ్య ఘట్టాలన్నీ ఆయన తలలో మెరుపులవలె మెరిసినవి.

బాల్యంలో తాను అనుభవించిన బీదరికమూ, తల్లి ఎన్నో కష్టాలుపడి చదువు చెప్పించటమూ, తాను తల్లి కష్టాన్ని వృథా కానీకుండా ఫస్టుగా ప్యాసు కావటమూ, స్కాలర్షిప్స్, ఇతర బహుమానాలెన్నో పొందటమూ, కాలేజీ చదువులు కూడా పూర్తిచేసి డాక్టరు అయ్యేందుకు ఉత్సాహపడటమూ, ఇంతలో తల్లి కూడా మరణించగా, ఏకాకిగా మద్రాసు వచ్చి, వారాలు చేసుకుంటూ, ట్యూషన్లు చెప్పుకుంటూ మెడిసిన్ చదవటమూ, — తన ప్రతిభా విశేషాల కారణంగా నలుగురిలో గౌరవాన్ని పొందటమూ, ముఖ్యంగా విశ్వేశ్వరరావుగార్ని — అంతకన్న అనసూయాదేవి హృదయాన్ని ఆకర్షించగలగటమూ, ఏకైక పుత్రికను కాదనలేక, విశ్వేశ్వరరావుగారు అనసూయాదేవినిచ్చి తనకు పెళ్ళిచేయటమూ, ఆదెబ్బతో తన పని తంతే గారెలబుట్టలో పడ్డట్టు కావటమూ, ధనవంతుడైన మామగారి ధన

సహాయంతో కెనడాకు వెళ్ళి హృద్రోగ నిపుణుడు కావటమూ, ఆ తరువాత స్వంత ప్రాక్టీస్ పెట్టటంవల్ల కొద్దిమందికే తాను సేవ చేయగలుగుతానని భావించి లోకానికంతా తాను సేవ చేయాలనే ఉత్సాహంతో జనరల్ హాస్పిటల్‌లో హృద్రోగ నిపుణుడుగా చేరటమూ జరిగింది.

ఎంతమంది బీద ప్రజలను తాను మృత్యువు నుంచి తప్పించాడో తలచుకుంటే తన జన్మ పవిత్రమైనట్లు, శరీరం పులకలెత్తుతుంది. డబ్బు సంగతి లేకుండా మానవసేవే జీవిత ఆదర్శంగా వృత్తి ధర్మాన్ని స్వీకరించాడు. ఐతే తానుకూడా ధన సంపాదన చేసి తీరాలని నలుగురు అనటమూ, తానుకూడా నమ్మటమూ జరగటంలో, ఉదయం రెండు గంటలసేపు ఇంటి దగ్గర కన్సల్టేషన్ ఏర్పాటు చేశాడు. మొదట్లో ఐదురూపాయలతో ఆరంభమై ఇప్పుడది యాభై రూపాయలైంది. లక్షలు గడించిన తనకు ఇప్పుడూ ధనాశ కూడా లేదు. ఐనప్పటికీ రోగుల సంఖ్య ఐదు రూపాయలనాడు ఎలా ఉన్నదో, యాభై రూపాయలనాడూ అలాగే ఉన్నది. ఒక్కోనాడు విసుగు పుట్టి అనేకమంది రోగుల్ని మర్నాడు రమ్మని చెప్పటం, ఆ మర్నాడు తాను చూడలేనన్ని కేసులు కాచుకొని కూర్చోవటం జరుగుతూనే ఉన్నది.

స్పెషలిస్టుగా తన పేరుప్రఖ్యాతులు దేశంలో నాల్గుమూలలా వ్యాపించాయి. దూరప్రాంతాల నుంచి

లక్షాధికారులు వచ్చి, చికిత్స పొంది పెద్దపెద్ద మొత్తాలు ఇచ్చిపోతున్నారు. ఈ విధంగా తాను కలలోకూడా ఊహించలేనంత ధనవంతుడయ్యాడు.

ఇక దాంపత్య జీవితము — మూడుకాయలు ఆరుపూవులుగా ఉన్నది. అసలు ఇల్లాలి రాకతోనే అదృష్టదేవతకూడా తనవైపు చేరింది. అందుకనే అనసూయాదేవి (అసలు పేరు అనసూయే ఐనా "దేవి" తాను జేర్చాడు) అంటే తనకు ప్రాణం.

— ఆ తలపుల ప్రవాహానికి ఆనకట్టవలె టెలిఫోన గణగణమన్నది. టెలిఫోన్ వైపైనా చూడకుండానే గోపాలం ఎంతో చిరాకు పడ్డాడు. అదేమీ గమనించకుండా టెలిఫోన్ మోగుతూనే ఉన్నది. ఐనప్పటికీ గోపాలం లేచి వెళ్ళి టెలిఫోన్‌ను ఎత్తలేదు. అదే ఆగిపోతుందనుకున్నాడు గోపాలం. కాని అది ఆగకుండా గణగణమంటూనే వున్నది.

అనసూయాదేవి వచ్చి టెలిఫోన్ ఎత్తింది. కాస్త విని "లైన్" లో ఉండండి —" అన్నది.

అప్పటికి గోపాలం చిరాకుగా కళ్లు తెరిచాడు.

'ఏలూ ఫ్రోమ్ నుంచి-" అని అనసూయాదేవి టెలిఫోన్‌ను భర్త చేతికి ఇచ్చింది.

"హలో!" అన్నాడు. డాక్టర్ గోపాలం చిరాకు ధ్వనించే కంఠస్వరంతో.

"డాక్టర్ గారేనా మాట్లాడేది?

"ఔను.... డాక్టర్ గోపాలం, హార్ట్‌స్పెషలిస్ట్"

ERIC

ఆ చిరాకును రెట్టించాడు.

"నేను ఏరోడ్రోమ్ నుంచి మాట్లాడుతున్నాను సార్. ఛాప్ స్ట్యువర్డ్‌ను. బొంబాయి నుంచి వస్తున్న విమానంలో ఒక పాసింజర్‌కు హార్ట్ ఎటాక్ వచ్చిందనీ ఏరోడ్రోమ్ దగ్గిర హార్ట్ స్పెషలిస్టును సిద్ధంగా ఉంచమని వైర్‌లెస్ మెసేజ్ వచ్చింది. విమానం మరో గంటకో, గంటన్నరకో వస్తుంది. కనుక మీరు దయచేసి ఇక్కడికి రావాలని కోరుతున్నాను–"

డాక్టర్ గోపాలానికి చాలా చిరాకు వేసింది. ఈ రోగాలకు ఆదివారాలేమిటి, సోమవారాలేమిటి– రాత్రులేమిటి, పగళ్లేమిటి? తనను కాస్త విశ్రాంతి తేసుకోనివ్వరు గదా! ఇన్ని వేలమంది గుండెజబ్బులకు చికిత్స చేసే తనగుండె ఎలా తయారవుతుందో అనే సానుభూతన్నా ఉన్నదా వీళ్లకు? ఎవడో విమాన ప్రయాణీకునికి హార్ట్ ఎటాక్ వస్తే పిలుపు తనకేనా? టెలిఫోన్ డైరక్టరీ చూసి పిలిచి ఉంటారు. మొదట్లో రోగుల మీద ఉండే జాలి, దయా ఇప్పుడు, యీ వయస్సులో లేవు. అంతా రొటీన్‌గా సాగిపోతూన్నది. వృత్తి మీద శ్రద్ధకూడా పూర్వమంత లేదు.

"నాకు వేరే పనిఉన్నది. ఇంకెవర్నైనా పిలవండి —" అని కాస్త మృదువుగానే చెప్పాడు. డాక్టర్ గోపాలం.

"మీకన్న నిపుణులు లేరు. అవతల ఒక మానవ ప్రాణం డాక్టర్!"

డాక్టర్ గోపాలానికి చుర్రుమన్నది. డాక్టర్‌గా తన బాధ్యతను గూర్చిన హెచ్చరిక ఏమిటి? తాను ఎన్ని వేల మానవప్రాణాలను రక్షించలేదు. ఒకవేళ యీ మానవప్రాణిని రక్షించలేకుంటే తనకు కలిగే అపకీర్తి ఏమిటి? నష్టమేమిటి?

" అయ్యా, నేను ఆలిండియా డాక్టర్స్ కాన్ఫరెన్స్‌కు వెళ్ళితీరాలి. ఆదివారం నాడైనా కాస్త ఊపిరి పీల్చుకోవాలి. మీరు చెప్పేది అంత సీరియస్ కేసే ఐతే, నేను వచ్చి చేసేది ఏమీ ఉండదు. లేకుంటే రేపు ఉదయం దాకా ఎలాగూ రోగి బతికి ఉంటాడు కనుక, రేపు చూసుకుంటాను ...."

" డాక్టర్! మీరు —"

" వినండి — నాకు టైమ్ లేదు. మీరు జనరల్ హాస్పిటల్‌కు ఫోన్ చేసి ఏంబులెన్స్ తెప్పించుకోండి. అక్కడ, వాళ్లు చూస్తారు —" అని ఇక యీ సంభాషణను పొడిగించడానికి ఇష్టంలేక ఫోన్ పెట్టేశాడు డాక్టర్ గోపాలం.

— గదిలో ప్రశాంతత ఏర్పడ్డంతో గోపాలం తిరిగి తన తలపుల మత్తులో పడ్డాడు.

జీవితం తనకిష్టుడు వడ్డించిన విస్తరి.[8] తన ప్రతిభావిశేషాలకు తోడుగా అన్నీ కలిసి రావటంకూడా జరిగింది. సంసార సౌఖ్యం, పేరు ప్రఖ్యాతులు కలిగాయి. కలిగింది. ఒక్కడే కొడుకైనా — రత్నంలాంటి వాడు — మాధవరావు. 20 ఏళ్ళ వయసులోనే లండన్‌లో యం.డి., చదువుకు వెళ్ళాడు. తన తర్వాత తనంత

గొప్ప హార్ట్ స్పెషలిస్టు అవుతాడనేందుకు ఎలాంటి సందేహమూ లేదు.

ఇవాళ ఐదున్నరకు ఆలిండియా డాక్టర్స కాన్ఫరెన్సులో తాను "మానవసేవ" ను గురించి గొప్పగా మాట్లాడబోతున్నాడు. రాత్రి చాలాసేపు మేలుకొని కూర్చిన ముత్యాల్లాంటి వాక్యాలు ఆ ఉపన్యాసంలో ఎన్నో వున్నాయి. వాటిల్లో కొన్నిటిని డాక్టర్ జ్ఞాపకం చేసుకున్నాడు.

" నేనెంత సుఖపడుతున్నానని కాదు. నా చుట్టూ ఉన్న జనాన్ని ఎంత సుఖపెట్టావనేదే ముఖ్యం!

" ఎంతమందిని మృత్యువు నుంచి రక్షించావో; రక్షించాలని కంకణం కట్టుకున్నావో, అదే నీ జన్మకు సార్థకం."

" మానవుని విలువను డాక్టర్ వృత్తిలోకన్న గొప్పగా చూపే మరొక వృత్తి లేదు, డాక్టర్ ప్రాణదాత అనే దాన్ని మరవకు. ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరికైనా ఆపద కలిగితే వెంటనే నడుంకట్టుకొని మృత్యువుతో పోరాడి ప్రాణరక్షణ చేసి నీ జన్మను సార్థకం చేసుకో"

" మానవసేవే మాధవసేవ అనే విషయాన్ని గాఢనిద్రలో కూడా మరిచిపోకు. ఏ తరగతికి చెందిన వాడైనప్పటికీ మానవుడు ఒక్కడే! వాడి సేవకు ఎప్పుడూ సందేహించకు. నిండు మనసుతో నీ నేర్పును చూపు. ప్రాణరక్షణకు మించిన పవిత్ర కార్యం మరొకటి యీ ప్రపంచంలో లేదు. నీ శ్రమనంతటినీ

మానవాభ్యుదయానికే అంకితం చెయ్యి—"

ఇలాటి వాక్యాలను తలచుకుంటుంటే డాక్టర్
గోపాలానికి ఒళ్ళు పులకరించింది.

గడియారం అరగంట గడిచిపోయిందని
హెచ్చరించింది.

ఏమిటింకా ఏదో ఉన్నదన్నారు!" అని భార్య కూడా
చేసిన హెచ్చరికతో, ఎంతో ఉత్సాహం రాగా, గోపాలం
మంచంమీద నుంచి లేచాడు.

త్వరత్వరగా బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

గోరు వెచ్చని నీరు ఒంటిమీద పోసుకుంటూంటే
నిద్రతాలూకు అలసటంతా మాయమై హాయి హాయి
అనిపించింది. విదేశాల్లో తయారైన సబ్బు వాసన
ఇంకా హాయి అనిపించింది. జీవితంలో తనంత
హాయిగా ఉండే వారెవరైనా ఉన్నారా?

తన గదిలో మళ్ళా టెలిఫోన్ మోగుతోంది.
రుచికరమైన భోజనం చేస్తుంటే మధ్యలో పలుగురాయి
పంటికింద పడ్డట్లుందది! ఆధునిక ప్రపంచంలో
టెలిఫోన్‌ను చూసి మానవుడు సంతోషిస్తూవుంటాడు
కాని కొన్ని సమయాల్లో మానవుని ప్రశాంతిని,
విశ్రాంతిని అదిపాడు చేస్తుంది!

భార్య ఏదో మాట్లాడి ఉంటుందని అను
కున్నాడు గోపాలం. తొందర పడకుండా హాయిగా
స్నానం చేసి, డ్రెస్ చేసుకొని గదిలోకి వచ్చాడు.

" ఆ ఏరోడ్రోమ్ నుంచి మళ్ళా పిలిచారు—"
అంది భార్య.

"నేను వచ్చేందుకు వీల్లేదని చెప్పినా వాళ్ళకి బుద్ధి లేదు." అన్నాడు డాక్టర్ గోపాలం.

"మీరు వచ్చి మాట్లాడతారని చెప్పాను." అని చెప్పి తన బాధ్యతను మెల్లగా వదలుకున్నదామె.

చిరాకుగా ఉన్న భార్య మీది గౌరవం చేత, అనురాగం చేత డాక్టర్ గోపాలం టెలిఫోన్ తీశాడు.

"నేను డాక్టర్ గోపాలాన్ని మాట్లాడుతున్నాను. ఇంతకు ముందే నేను రాలేనని తమకు విన్నవించుకున్నాను. మాటి మాటికీ ఫోన్ చేసి..."

"డాక్టర్ గారూ! ఒకటి మనవి వినండి. తాము ముందు చెప్పినట్లు ఇతర డాక్టర్లకు ఫోన్ చేశాను. అందరూ ఆలిండియా మెడికల్ కాన్ఫరెన్సుకు వెళ్లాలనే అన్నారు. అందులోను ఇది హార్ట్ ఎటాక్ కేసు. ఆ వచ్చే రోగి ఎవరో, ఎక్కడివాడో కూడా మాకు తెలియదు. మా బంధువూ స్నేహితుడూ రాడు సరికదా— చివరకు పరిచితుడు కూడా కాదు. కనుకనే మొహమూ తెలియని ఆ మానవుణ్ణి రక్షించేందుకు మేము శ్రమ పడుతున్నాము. బాధ్యతగా భావించి —"

మధ్యలోనే డాక్టర్ చిరాకుతో అన్నాడు:

"మిస్టర్! ఆ మాత్రం బాధ్యతలు మీ కొక్కరికే తెలుసనీ, మాకు తెలియదనీ మీరు పొరబడుతూన్నట్లు తెలుస్తోంది. అహోరాత్రులు మేమెంత కష్టపడి మానవసేవ చేస్తున్నామో బహుశా మీకు తెలియదనుకుంటాను. "మానవసేవ" అంటే ఏమిటో, యీ వృత్తిలో ఉన్నవారు ఎంత మానవసేవ చేస్తున్నారో మొదలైన

విషయాలు ఇవాళ కాన్ఫరెన్సులో మాట్లాడుతాము. తీరిక ఉంటే మీరూ రండి; లేదా రేపు పేపరులో చదువుకోండి. నాకు టైం అయింది — వెళ్ళాలి —" అని టెలిఫోన్ పెట్టేసి డాక్టర్ గోపాలం త్వర త్వరగా తన కారు దగ్గరికి వెళ్ళాడు.

కాన్ఫరెన్స్ కళకళ్ళాడుతూ ఉన్నది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి డాక్టర్లు, పేరు ప్రఖ్యాతులుగల వారు ఎందరో వచ్చి ఉన్నారు. చిన్న చిన్న డాక్టర్లు కూడా ఎప్పటికైనా ఆ గొప్పవారి స్థాయిని అందుకుంటామూ అనే అనుమానంతోనూ, ఆ నిపుణులు మాట్లాడే ముత్యాల వంటి మాటలు విని జీర్ణించుకోవాలనే ఉత్సాహంతోనూ కాచుకొని ఉన్నారు.

"మానవసేవ" అనే విషయం మీద ఒకరిమించి ఒకరు మాట్లాడుతున్నారు. డాక్టర్ గోపాలం కూడా రాత్రి తయారు చేసుకున్న ఉపన్యాసాన్ని గంభీరంగా చదివేశాడు. అనేక సార్లు సభికులు చప్పట్లు కొట్టారు. తాను ఆశించిన దానికన్న ఎక్కువ ఎఫెక్ట్ వచ్చినందుకు డాక్టర్ గోపాలం సంతోషించాడు. కీర్తితో ఎంతో బరువెక్కిన ఆయన శరీరం గాలిలో తేలిపోతున్నట్లు తోచింది.

ఆ తరువాత మాట్లాడిన వారు డాక్టర్ గోపాలం ఉపన్యాసాన్ని పొగడటంలోనూ, ఆధునిక పద్ధతుల్లో ఆయన రోగులకు చేసే చికిత్సా విధానాన్ని పొగడటంలోనూ నిమగ్నులయ్యారు.

ఉపన్యాసాలు ఇంకా సాగుతూనే ఉన్నవి. ఎవరో "టెలిఫోన్‌లో పిలుస్తున్నారు సార్!" అన్నాడు.

వాడే — ఏరోడ్రోమ్ నుంచి తనను రమ్మని వేధించుకుంటున్న వాడే అనే అనుమానం కలగటంతో డాక్టర్ గోపాలానికి ఒళ్లు మండింది. కాని ఓపికతో మెల్లగానే 'ఇప్పుడు ఇక్కడ్నుంచి కదిలేందుకు వీల్లేదని చెప్పు' అన్నాడాయన. ఆ వచ్చినవాడు వెళ్లిపోయాడు.

సభంతా నిశ్శబ్దంగా ఉపన్యాసాలను వింటూ మానవసేవ తాలూకు పరమార్థాన్ని, సారాన్ని జీర్ణించుకుంటూ వుంది.

పావు గంట గడిచాక మళ్లీ ఎవరో వచ్చి గోపాలం చెవి కొరికారు!" మీ ఇంటి దగ్గర్నుంచి పిలుస్తున్నారు సార్!" అని.

ఈసారి చిరాకు పడకుండానే డాక్టర్ గోపాలం లేచి వెళ్లాడు. అవతలి నుంచి అనసూయాదేవి మాట్లాడుతోంది. ఆమె కంఠస్వరం వణికిపోతోంది.

"ఏరోడ్రోమ్ నుంచి కబురండీ.... మన మాధవుడు హార్ట్ ఎటాక్ తో బొంబే ప్లేన్ నుంచి దిగి గంట పైగా అయిందట...."

"ఎవరూ?.... మాధవుడా?—... వాడు లండన్ వెళ్లాడుగా! బొంబే నుంచి రావటమేమిటి?" డాక్టర్ గోపాలానికి అంతా అయోమయంగా ఉన్నది.

"మీరు వెళ్లాక కేబుల్ ఒకటి వచ్చింది. వేనప్పుడు అది విప్పలేదు. పారిస్ లో హార్ట్ ఎటాక్ రావటంతో — ఎవరెంత చెప్పినా వినక, మాధవుడు తిరుగు ప్రయాణం చేస్తున్నట్లుగా కేబుల్ లో ఉంది!"

ఇక మాట్లాడి ఆలస్యం చేయటం తెలివితక్కువ

తనమని డాక్టర్ గోపాలానికి అర్థమయింది.

"ఇప్పుడే వస్తున్నా—" అని టెలిఫోను పెట్టేసి డాక్టర్ గోపాలం గాలి వేగంతో ఇంటికి వెళ్ళాడు.

"ఏరోడ్రోమ్‌కు ఫోన్ చేశాను—" అన్నది అనసూయాదేవి. "ఎంతమంది డాక్టర్లకు ఫోన్ చేసినా ఒక్కరూ రాలేదట. సీరియస్ కేసనని అభిప్రాయ పడుతున్నారట..... డాక్టర్ల గుండెలు బండలుకాబోలు!

భార్య మాటలు డాక్టర్ గోపాలానికి సరిగా అర్థం కావటం లేదు. కాని చివరకు ఆమె అన్న మాటలు మాత్రం తన హృదయానికి తగిలింది. ఆమె పొరబడినట్లు తేలిగ్గా తెలుస్తోంది. ఎందుకంటే- ఆమె అన్నట్లు డాక్టర్ల గుండెలు బండలే అయినట్లయితే తన హృదయం ఇప్పుడిలా నీరై పోతూ, తనను నిలవనీకుండా చేస్తుందా?

భార్యతోకూడా డాక్టర్ గోపాలం అరవై మైళ్ళ స్పీడుతో ఏరోడ్రోమ్ వైపు కారు పోనిచ్చాడు.

డాక్టర్ గోపాలం నిద్ర మేల్కొని సూర్యోదయాన్ని చూశాడనటం కన్న మేలుకొనే ఉండి తన జీవితంలో మొట్టమొదటిసారి సూర్యోదయాన్ని యీనాడు చూశాడనటం సమంజసం.

తెల్లవారేవరకు గుండెలు పగిలేటట్లు దుఃఖించిన అనసూయాదేవి, నేలమీద తలకింద

తలగడ కూడా లేకుండా పడివుంది. తన చేతుల్లోంచి అన్ని అవకాశాలూ జారిపోగా కొయ్యబారి నిలబడి

పోయాడు డాక్టర్ గోపాలం.

ఉదయపు వార్తాపత్రిక వచ్చింది. బంగళాచుట్టూ భరించలేని దుఃఖం వ్యాపించింది.

యథాప్రకారంగానే పత్రిక విప్పాడు డాక్టర్.

గత సాయంత్రం "మానవ సేవ" ను గూర్చి తానిచ్చిన ఉపన్యాసం పెద్దపెద్ద అక్షరాలతో ప్రచురించబడింది. అదంతా చదువవలసిన పనిలేదు; దానిమీంద ఇంటరెస్టూ లేదు.

ఆ కిందనే ఉన్న వార్త కూడా తనకు కొత్తకాదు. సుప్రసిద్ధ హృద్రోగనిపుణుడైన డాక్టర్ గోపాలం ఏకైక పుత్రుడు మాధవరావు — సకాలంలో డాక్టర్ రాని కారణంగా, హార్ట్ ఎటాక్ తో ఏరోడ్రోమ్ లో మరణించినందుకు పత్రికవారు తమ దుంఖాన్ని తెలియజేశారు.

మానవసేవను గూర్చి తాను నిన్న చెప్పిన ఉపన్యాసంలోని ముత్యాల్లాంటి వాక్యాలు, తాను మనసా వాచా నమ్మినవి ఎంత నిరర్థకమైనవో డాక్టర్ గోపాలానికి నిన్న ఏరోడ్రోమ్ లోనే తెలిసింది. ఇప్పుడు వాటిని ఖండిస్తూ మరొక ఉపన్యాసం ఇవ్వవలసిన పనిలేదు. దేశంలో వార్తాపత్రికలు చదివే వారందరూ వాటిని ఎంతో మెచ్చుకోవచ్చు. పిల్లలకు రాసే పుస్తకాలకు గాను కొన్ని వాక్యాలను తీసుకోనూ వచ్చు. కాని ఆ మాటలన్నీ తన జీవితంలో

అర్థం లేనివి, సారం లేనివి — పనిలేనివాడు నిఘంటువు లో నుంచి వెదికి కూర్చిన పదజాలంవలె నిష్ప్రయోజనం. అందుకనే ఆ వార్తా పత్రికను చింపి ఒక మూల పారేశాడు డాక్టర్ గోపాలం.

ఇప్పుడు నిజమైన "మానవసేవ" ఏమిటో డాక్టర్స్ ఆచరించవలసిన విధులేమిటో డాక్టర్ గోపాలానికి అనుభవపూర్వకంగా అర్థమైంది. తనలో తను సిగ్గుపడుతూ, కుంగిపోతూ, మూలనున్న కుర్చీలో కూలబడి సకాలంలో మానవసేవ చేయలేని తన అప్రయోజకత్వాన్ని గూర్చి దుఃఖించసాగాడాయన.

# ఏమి మగవాళ్ళు!

శ్రీ పాకాల వెంకటరాజమన్నారు.

There are not many creative writers among the Telugus who have occupied high places in public life. P. V. Rajamannar (1901 --), a retired Chief Justice of Madras State, is an exception. He has been a writer in Telugu since his college days. As a playwright he occupies an enviable position for his originality in conceiving a problem. Most of his plays are on the social problems of the middle and upper classes. On matters of human sex relationships he presents a picture of realism and not idealism. The language in his writing tends to be more literary than colloquial, but his characters are lifelike and leave an indelible impression on the reader.

Rajamannar is a great connoisseur of fine arts, and till recently he was the President of the Indian Academy of Music and Drama.

"ఏమిం మంగవాళ్ళు!"

పాత్రలు:

వేణుగోపాల్ ....

సోమసుందరం ... వేణు పెదతండ్రి

సుందరమ్మ ... సోమ॥ రెండవ భార్య

కృష్ణమూర్తి ... సోమ॥ తమ్ముడు

శంకరశాస్త్రి ... సోమ॥ స్నేహితుడు

కనకాంగి ... వేశ్య, వేణు భార్య

నిర్మల ... సోమ॥ మొదటి భార్య కూతురు

కాలం — ప్రస్తుతం

---

రంగము: సోమసుందరంగారి ఇంట్లో

భోజనం చేసి తాంబూలం వేసుకుంటున్నారు సోమసుందరంగారు. వయసు సుమారు 50. ప్రాత కాలం వాడే. బుర్రముక్కు, స్థూలకాయం, అయితే ఒడ్డూ పొడుగూ ఉండడం చేత అసహ్యంగా లేడు.

సుందరమ్మగారు సోమసుందరంగారి రెండవ భార్య. మొదటి భార్య ఒక్క కూతుర్ని వదిలిపెట్టి గతించింది. సుందరమ్మకు 25 కన్న ఏండ్లు ఎక్కువ ఉండవు. సన్నగా ఉండటము చాలించింది గాని ఇంకా లావు కాలేదు. అందంగానే ఉంటుంది. ముస్తాబు క్రొత్త రకమే. గ్రామఫోను తిప్పుతూ నిలబడి వుంది.

ప్రక్కనే కృష్ణమూర్తి రికార్డులను అందిస్తూ నిలబడ్డాడు సోమసుందరంగారి తమ్ముడు.

సన్నగా ఉంటాడు. వయసు 25. ఇద్దరు పంచా చొక్కా
త్రాళ్ళు, కంటి కద్దాలు.

సుందరమ్మ అవకాశం ఉన్నప్పుడల్లా కృష్ణమూర్తి వంకనే చూస్తూ ఉంటుంది. కృష్ణమూర్తి, ఎప్పుడో తప్ప, గోడ మీది బొమ్మలు, పైకప్పు చూస్తూంటాడు...

నిర్మల (10 సం॥) సోమసుందరంగారి మొదటి భార్య కూతురు. గుమ్మం దగ్గరకు వచ్చి పాట వింటూ నిలబడ్డది.

సుందరమ్మ: (నిర్మలతో) వెళ్ళు. వెళ్ళి చదువుకో, పాటలేమిటి చిన్నపిల్లలికి

నిర్మల: పాఠాలన్నీ చదివేశాను పిన్నీ.

సుం: అబద్ధం

నిర్మ: లేదు. నిజంగా.

సుం: చూడండి!

సోమసుందరం: పిన్ని మాటలకు అలా ఎదురు మాట్లాడ్డం తప్పు కదూ... ఈ పాట విని వెళ్లిపో

సుం: గారాబం కూతురు!

నిర్మ: (పాట ముగించక ముందే వెళ్లిపోతుంది.)

సోమ: (పాట ముగిసింది) అబ్బ! ఎంతసేపూ ఈ పాంచీ నాటకం పాటలేనా, చెవులు చిల్లులు పడిపోతూ వున్నవి.

సుం: అరెర్రే! చండీదాసులో పాటలండి. సైగాల్ వాళ్లు పాడినవి.

సోమ: ఏడిచినట్లున్నాయి. రాగమా తాళమా — ఏదో గోల. ఒకటే త్యాగరాజు కీర్తనలో ఉండే

సంగీతం వుంది పాటునన్ను కలిపినా?

సుంద: అవిపేరు, ఇవిపేరు. ఫిల్ముల్లో త్యాగరాజు కీర్తనలు పాడితే ఏమీ రక్తి గట్టవు. అందుచేత మన తెలుగు ఫిల్ముల్లో కూడా బంగాళీ, మరాఠీ మెట్లే... ఏదీ కృష్ణా! మొన్న మనం వెళ్ళిన "చంద్రహాస" లో కనకాంగి పాడింది.

సోమ: చాలు చాలు. ఇవ్వాళటికి చాలు.

కృష్ణమూర్తి: ఈ కనకాంగినే మన వేణు పెళ్ళాడింది.

సోమ: ఎవత్తో ఒక భోగం ముండ, కనకాంగో — రత్నాంగో — చిత్రాంగో,[B] ఎవత్తైతే నేమి?

సుం: ఇక మనతో కలిసి వుండదుట కదా, తన భాగం తనకిమ్మని అడిగాడండీ వేణు?

సోమ: లేదుటే. కాని అడక్కుండా ఊరుకుంటాడా? చేతుల్లో గవ్వలు తగ్గగానే పార్టీషను దావా బయలుదేరుతుంది.

కృష్ణ: అతడూ వకీలేగా?

సోమ: అయితే మాత్రం భయపడతానా?

సుం: ఏమండి? ఈ వివాహం చెల్లుతుందండీ మన ధర్మశాస్త్రాల ప్రకారం?....

సోమ: మన ధర్మశాస్త్రాలు మట్టిలో కలిసిపోయినవి. ఇప్పుడు మనకు బాకళ్ళూ మంగళ్ళూ కూడా చట్టాలు నిర్మిస్తున్నారు.... శాసనసభల్లో

కృష్ణ: చట్టప్రకారం ఈ వివాహం చెల్లుతుంది వదినెగారు!

సోమ: ఏమి చట్టాలున్నా సరే. అగ్నిసాక్షిగా, ధర్మసమ్మతంగా, శాస్త్రప్రకారంగా చేసుకున్న దాన్ని

తప్ప ఇంకోదాన్ని భార్య అనడానికి నేను ఒప్పుకోను. సానిదానికి బొట్టు కడితే సతి అవుతుందా? కుక్కకూ కడతారు బొట్టు మున్నిసిపాలిటీ వారు.

సుం: మంచి సామ్యం చెప్పారు. మీ వేణుకు చెప్పండి వస్తే (వీధి తలుపు తట్టిన చప్పుడు) కృష్ణా! చూడు ఎవరో?

కృష్ణ: (నవ్వుచు) వేణు! అని వెళ్లును.

కృష్ణ: (మళ్లా ప్రవేశిస్తాడు చేతిలో కాగితంతో.) వినండి వినండి.

సోమ: ఏమిటి?

కృష్ణ: టెలిగ్రాము, వేణు దగ్గర నుంచి. ఈవేళ ఎక్స్‌ప్రెస్సులో వస్తున్నాడు — భార్యా సమేతంగా

సోమ: ఆఁ!

సుం: నిజంగా?

కృష్ణ: అంటే ఈపాటికే వచ్చివుండాలి. టెలిగ్రాము ఆలస్యమైంది చేరడానికి.

సుం: ఏమి చేస్తారండి?

సోమ: ఏమి చెయ్యడం. ఈ యింట్లో మాత్రం కాపరం చెయ్యనివ్వను. వాడి వాటా వాడి మొఖాన కొట్టడానికి సిద్ధంగా వున్నాను.

సుం: అయితే గడప తొక్కి వస్తే, వాళ్లని వెళ్లగొడతామా?

సోమ: నీకెందుకు? నా పూచీ అది.

సుం: వారే.

(మళ్లా వీధిలో ధ్వని.)

మైటు, తలసర్దుకుంటుంది. కృష్ణమూర్తి నిష్క్రమణ.

తెరలో మాటలు.

"హలో"! కృష్ణా! ఇది నా వైఫ్" "నమస్కారం" — "సామాన్లు ఈ గదిలోనే ఉంచేయి!" "ఏకులాలో! —" "హౌ ఈజ్ ఎవ్వరి బడి?"

[ప్రవేశం కృష్ణమూర్తితో వేణుగోపాల్, భార్య కనకాంగి సమేతంగా. వేణుగోపాల్ సోమసుందరంగారి అన్న కుమారుడు. వయస్సు 30. వేషం భాష అంతా నవీనం — తెలివి తక్కువ ఉత్సాహం ఎక్కువ. న్యాయవాది.

కనకాంగి పుట్టింది వేశ్యకులంలో. ఆమె మొదటి వృత్తి కులవృత్తియే, గత్యంతరం లేక. సంగీత జ్ఞానం సౌందర్యము, వాకచక్యం ఉండడంచేత కీర్తి గడించింది. ఆ కీర్తి ఫిలింకంపెనీ వాళ్ళని ఆకర్షించింది. నటి అయింది. నటి అయిన క్షణంలోనే మొదటి వృత్తి వదిలివేసింది. కొత్త చొక్కా రాగానే పాత చొక్కా వలె... ఇప్పుడు ధనం, కీర్తి కావలసినంత వున్నా గౌరవం, సంప్రదాయం అంటే అభిమానం. వివాహం అంటే గొప్ప మర్యాద... వయస్సు సుమారు 30 ఉన్నా 25 లాగా ఉంటుంది.

వేణుగోపాల్: బాబయ్యగారూ! నమస్కారం. పిన్ని గుర్తుపట్టినావా... మీకోడల్ని అందరికీ పరిచయం చెయ్యాలి అని పిల్చుకుని వచ్చాను.

కనకాంగి: నమస్కారం!

సుం: కూర్చోండి

కృష్ణ: బాగావుంది వదినెగారు! కోడలికి మర్యాద.

వేణు: ఏమి బాబయ్యా! నిరుడు చూచినప్పటికి

ఇప్పటికే చాలా వయసు మీరినట్లు కనబడుతున్నారు.
ఒంట్లో కులాసాగా ఉన్నదా?

సోము: ఆహా!, నాకేమీ లేదు — రొంపైనా పట్టలేదు.
నీవు అలసిపోయినట్లున్నావు.

వేణు: అది ప్రయాణం చేత ... పిన్నీ!, కోడల్ని లోపలికి
పిల్చుకు వెళ్లి నీళ్లుగీళ్లు ఇయ్యరాదూ?

సుం: ఇలా రా!, (దారి తీస్తుంది.)

కనక: (చెంగున లేచి) అలాగేనండి ... (సుందరమ్మతో
లోపలికి వెళ్లును. కృష్ణమూర్తి రెప్పవాల్చక
కనకాంగిని చూచి ఆనందిస్తున్నాడు —)

సోమ: అబ్బాయి!, ఏమిటో చుక్క వూడిపడ్డట్టు వచ్చావ్.

వేణు: (నవ్వుచూ) ఆశ్చర్యం కదూ!, అప్పను. మేము
నిన్నటి వరకూ అనుకోనే లేదు. ఆదివారం శలవు
రోజే గద, మిమ్మల్ని అందర్నీ ఒకసారి కలుసుకొని
రావచ్చునని కనకాంగి చెప్పితే సరేనన్నాను.
(మెల్లగా) కనకాంగికి మీ అందరిమీద చాలా
గౌరవం, భక్తి. దానికి కొంచమైనా గర్వం
బడాయి లేదు బాబయ్యగారూ!

సోమ: అయితే మళ్లీ ......

వేణు: వెళ్లడమా? రాత్రికో, రేపో

సోము: అలాగా ... కృష్ణమూర్తితో కబుర్లు చెప్తూవుంటూ
ఉండు. నేను అలా బజారుకు వెళ్లి వస్తాను.
(వెళ్ళును)

వేణు: ఏమి, కృష్ణా!, ఏమిటి విశేషాలు?

కృష్ణ: సరే. కూపస్థ మండూకం లాగ ఉన్నా నేను

విశేషాలు చెప్పేవాణ్ణి

వేణు: ఒప్పుకోను. పట్టణ విశేషాలు వేరంట, పల్లెటూరు విశేషాలు వేరు... పోనీ, నా వివాహం ఎప్పుడు?

కృష్ణ: విఘ్నేశ్వరునికి జరిగిన మర్నాడు.

వేణు: నేనూ అలాగే అనే వాణ్ణి

కృష్ణ: అందరికీ దారిలో బంగారం దొరుకుతుందా.

వేణు: అంటే?

(ప్రవేశం సుందరమ్మ, కనకాంగి.)

కనక: (కృష్ణమూర్తి మాటలు విన్నది.) నన్ను దెప్పి పొడుస్తున్నారండీ... నాలో లేక పోయినా నా పేరులో బంగారం వున్నదని.

వేణు: (నవ్వుచు) ఓహో! కనకాంగి వనా?

కృష్ణ: (కనకాంగితో) ఏమండోయి!, నా మీద అన్యాయంగా అపనింద వేస్తున్నారు. తమరు సార్థక నామధేయులు. యదార్థం చెప్తున్నాను.

సుం: వేణూ! నీవు కాఫీ పుచ్చుకోవూ?

వేణు: ఎస్!, కాఫీ అంటే జ్ఞాపకం వచ్చింది. నా ఓల్డు ఫ్రెండ్ రామారావును కలుసుకొని వాడితో కమలమ్మగారి కాఫీ హోటలుకు వెళ్ళిరావాలి. ఇప్పుడు కనకం!, వెళ్ళనా?

కనక: అబ్బెబ్బే! నా ఆజ్ఞ మీదనే నడుచుకొంటున్నారు కాబోలు — మీ వాళ్ళ దగ్గర అగుడు చెయ్యడానికి నన్ను — అంతే...

వేణు: ఆల్ రైటు; పార్డన్ మి.... గుడ్ బై (వెళ్ళును)

[కొంత వరకు ఎవ్వరూ మాట్లాడరు. కృష్ణమూర్తి

కనకాంగిని కండ్లతో తినేస్తున్నాడు. సుందరమ్మ కృష్ణమూర్తి వంక కోపంగా చూస్తున్నది.]

కనక: ఓహో! గ్రామఫోను! సంగీతమంటే అందరికీ ఇష్టమే నా

కృష్ణ: నాకు మరిన్ని ... మీ పాటలంటే చాలా ఇష్టం...

కనక: నా పాటలా! టాకీల్లో వేనా? అన్నీ సెకండు హ్యాండు హిందీ తర్జుమాలేగా?

కృష్ణ: అయితే మాత్రం మీ కంఠం! అది ఫస్టు హ్యాండు కాదూ?

కనక: నా కంఠం మీరే మెచ్చుకోవాలి.

కృష్ణ: నేనొక్కడినేనా ... ఎందరో — వేలకు — పదివేలకు మించి ...

సుం: మీది ఏవూరండీ?

కనక: ఒకటి గాదు. పుట్టింది ఏలూరు — పెరిగింది కాకినాడ — నాటకాలు ఫిల్ము కోసరం ఏవూరు పడితే ఆవూరు — బొంబాయి, కలకత్తా తోసహా

కృష్ణ: మాకు పుట్టడం, పెరగడం, చావడం — అన్నీ ఒకటే వూరిలోనే లెండి.

కనక: శాంతి జీవులు.

కృష్ణ: ఆఁ — జీవచ్ఛవాలం...

సుం: ఒంటరిగానే వెళ్తారా అన్నిచోట్లకీ?

కనక: అంటే?

సుం: మాంచి రాజుని పెళ్లాడక పూర్వం?

కృష్ణ: ఏమి ప్రశ్న అది వదినెగారు?

కనక: జవాబు చెప్పుతున్నా... పదిమందిలో
ఒంటరిగానే...

సుం: సమస్య

కనక: పరమసత్యం...

వేణు: బలే! ఎంత భావం చెప్పేశారు...

సుం: (కోపంగా) ఏమిటో!, నాకేమీ అర్థంకాలేదు.
మొద్దుముండను... మీరు మాట్లాడుకోండి
నేనింట్లో పనులు చూచుకుంటాను.
(రయ్యిమని వెళ్ళిపోతుంది. కృష్ణమూర్తి కనకాంగి
వంక చూస్తాడు. కనకాంగి ఫక్కుమని
నవ్వుతుంది. కృష్ణమూర్తి కూడా పకపకా
నవ్వుతాడు...

కనక: కోపం వచ్చింది మా వదినెగారికి

కృష్ణ: ఎందుకని?

కనక: మీకే తెలియాలి

కృష్ణ: పోనివ్వండి — ఒక పాట పాడరూ?

కనక: అమ్మరెల్యా! ఇక్కడ పాడడమే?

కృష్ణ: ఏవిటాం? అరణ్యమా?

కనక: అరణ్యంలో చక్కగా పాడుకోవచ్చును.
దుష్టమృగాలు కూడా పాడుతూవుంటే ఏమీ
చెయ్యవట.

కృష్ణ: అయితే యీ యిల్లు అరణ్యంకంటె చెడ్డదన్న
సింహశార్దూలాల కన్న నేను దుష్టుణ్ణి అని
మీ అభిప్రాయం.

కనక: అంతంత ఊహలు చేసినన్ను చంపకండోయ్.

పోనీ ... మెల్లగా పాడతాను (పాండొ పాట పాడుతుంది)

కృష్ణ: (పరవశుడై పోతున్నాడు. ఆ సన్నని స్వరం మరింత తేల త్రిప్పిస్తూ వుంది. పాట పాడే టప్పుడు కొంచెంగా ఎత్తిన మెడ, విప్పిన కండ్లు, అదరు తూ ఉన్న నాసికా పుటాలు కృష్ణమూర్తిని మోహ సముద్రంలో ముంచేస్తున్నాయి.) హాయి! హాయి! ఏమి ఆనందం! (ఆకస్మాత్తుగా తెలిసియో తెలియకనో కనకాంగి చెయ్యి పట్టుకుంటాడు.

కనక: (పాట ఆపి) ఆగండి! ఏమిటిది? ... మరచి పోతున్నారు. (చెయ్యి లాగుకో పోతుంది.)

కృష్ణ: (పిచ్చిగా) వదలను. నేను వదలను ......
బంగారం చేతికి దొరికితే వదుల్తానా?

(ప్రవేశం వేణు.)

వేణు: హలో! (చూచి ఆగిపోతాడు)

కృష్ణ: (కనకాంగి చెయ్యి వదిలివేసి లేచి. వేణు వంక చూడకుండా) చాలా థ్యాంక్సు! పాట అద్భుతంగా వుంది. (నిష్క్రమిస్తాడు)

కనక: (కృష్ణమూర్తి వెళ్ళగానే గొల్లుమని నవ్వి) రండి. రండి. చాలా సంగతులు చెప్పాలి. రండి.

వేణు: (నవ్వడు, ఉత్సాహం చూపించడు.)

కనక: మీ యింట్లో ముచ్చట్లు చెప్తా. రండి. కూర్చోండి.

వేణు: (కూర్చుని) ఇంతలోనే విశేషాలా?

కనక: కావలసినన్ని ...... అయితే వాదించ కండా

వినాలి... మొదటి విశేషం మీపిన్నిగారికి
మరిది మీదే మనస్సుంతా?

వేణు: (ఉలికిపడతారు)

కనక: సందేహం లేదు. అవిడ అతన్ని కళ్ళతో చూ
డ్డం లేదు. తినేస్తూ వుంది. పాపం ఆ అబ్బాయికి
తెలిసినట్లు లేదు. లేదా తెలిసినా
మ్రింగా లేక కక్కా లేక సందిగ్ధావస్థలో
బాధపడుతూ వున్నాడు! రెండో విశేషము,
నేను వచ్చినప్పటి నుంచీ మీ కృష్ణమూర్తికి
నా మీదే కళ్ళు. మంచి యౌవ్వనం. బ్రహ్మచారి.
సంగీత సాహిత్యాలలో అభిరుచి. ఈ సంగతి
అప్పుడే కనిపెట్టింది మీ పిన్ని... అల్లాంటి
సంగతులు మా ఆడవాళ్ళకు సులభంగా
తెలుస్తాయి లెండి!!!

వేణు: తరువాత?

కనక: ముగ్గురమూ కూర్చొని రెండు నిముషాలు
మాట్లాడే సరికి... మీపిన్ని కోపం చేసుకొని
రివ్వు మని తారాజువ్వలాగా లేచి, వెళ్ళిపోయింది.
ఇద్దరమే వుండిపోయాము. పాడమని
బ్రతిమాలాడు, పాడుతూ ఉంటే గభాలున
చెయ్యి పట్టుకున్నాడు. పిచ్చివాడు... నిజంగా
అంత మతిపోయి ప్రవర్తిస్తాడనుకోలేదు.
ఇంతలో మీరు వచ్చారు, ద్రౌపదీ మానసంర
క్షణ కోసం వేణుగోపాలమూర్తి వలె. E

వేణు: తల తిరిగి పోతూ వుంది... రాత్రికే తప్పక

వెళ్ళిపోవాలి ...

లోపలికి వెళతాడు.

కనక: (ఒంటరిగా వుంది. కూని రాగం తీస్తూ. ప్రవేశం మెల్లమెల్లగా నిర్మల.)

కనక: రావమ్మా!, రా. ఎవరమ్మాయివి?

నిర్మ: పంతులుగారి అమ్మాయిని.

కనక: అమ్మగారు ఏమి చేస్తున్నారు?

నిర్మ: (పలకదు.)

కనక: నాతో మాట్లాడవద్దన్నారా?

నిర్మ: (ఏడుస్తూ) మా అమ్మ లేదు. చచ్చిపోయింది.

కనక: (కరిగిపోయి) నా తల్లివి కదూ. ఏడవ వద్దు. రా. (అని మెల్లగా తన ప్రక్కన కూర్చో పెట్టుకుంది.)

నిర్మ: పిన్ని చూస్తే తిడుతుంది.

కనక: నేనున్నాను గా, భయం లేదు. చదువుకుంటున్నావా?

నిర్మ: ఓ ... వరాలబ్బాయి పాడకలాండా నేర్పుతారు. నాకు పాటంటే ఇష్టం ...

కనక: నే పాడనా?

నిర్మ: (సంతోషంతో తల ఊపుతుంది.)

కనక: ("చక్కని రాజమార్గము" F అనే కీర్తన పాడుతూ వుంటుంది. ప్రవేశం వెనకనుంచి సోమసుందరం గారు పాట రుచిని అనుభవిస్తూ)

సోమ: (పాట ఆగగానే) చాలా బాగా పాడుతావు. అందులో కీర్తన, బంగారం లాంటి కీర్తన (నిర్మల జారిపోతుంది.)

కనక: (లేచి గౌరవంగా) కూర్చోండి. మామగారికి
వెధవ హిందుస్థానీ మెచ్చుకన్నా మన పూర్వపు
కీర్తనలపైనే అభిమానంలా వుంది.

సోము: ఆఁ బాగా చెప్పావు. వెధవ హిందుస్థానీ మెచ్చు...

కనక: నాకసలు మన సంగీతం అంటేనే ఇష్టం.
చిన్నప్పుడు కొంచెం నేర్చుకున్నాను కృతులు,
పదాలు, జావళీలు.

సోము: జావళీలు కూడా వచ్చునా..?

కనక: ఏవో కొన్ని — పాడనా?

సోము: మెల్లిగా పాడు. మెల్లిగా, మృదువుగా పాడితే
జావళీలు సుఖంగా ఉంటవి.

కనక: అబ్బో! మామగారు రసికులు. (జావళీ
పాడుతుంది.)

సోము: వహ్వా! చిన్నప్పుడు చదువుకున్న మనుచరిత్ర
జ్ఞాపకం వచ్చింది నీ కంఠం వింటే. (కొంచెం
రాగంతో పాడును.)

కనక: (చప్పట్లు తట్టుతూ) సంగీతం, సాహిత్యం
అన్నిట్లో ప్రవేశం వుంది మామగారికి!

సోము: (ఒళ్ళు తెలియకుండా లేచి ముచ్చటగా కనకాంగి
దగ్గరకు లాక్కొంటాడు.) ఏదీ! ఇంకో పదం
ఒకటి పాడు
(కనకాంగి పాడుతూ వుంటుంది.)

సోము: (కనకాంగి పాడుతూ వుంటే తాళం వేస్తుంటాడు.

తప్పిపోయేమో; బుద్ధిపూర్వకంగానో ఒకదురువు కనకాంగి తొడ మీద వేస్తాడు.)

కనక: (చప్పుమని పాట ఆపి లేచి నిలబడుతుంది) శ్రుతి మారిపోతూంది.

సోమ: (కంగారుతో లేచి, నిలబడుతూ వుంటే వీధి తలుపు తట్టిన చప్పుడు వినబడుతుంది) వస్తున్నా; వస్తున్నా, (అని త్వరగా వెళ్ళి శంకరశాస్త్రితో ప్రవేశిస్తాడు. శంకరశాస్త్రి సోమసుందరం గారి స్నేహితుడు. ఏకవయస్కులే ఇద్దరు. రసికుడు.)

శంకరశాస్త్రి: ఎవరది? కనకమా?.... కనకమే!

కనక: శాస్త్రిగారు!

సోమ: (ఇకనిక్కడ వుండకూడదనుకొని).... కూర్చో. కూర్చో. ఇప్పుడే వస్తా. (వెళ్తాడు)

శంక: నిజంగా ఇవి నా కళ్ళేనా?... నేను మేలుకున్నానా? ఎన్నాళ్ళకెన్నాళ్ళకు.

కనక: అంత అభిమానం!

శంక: (కూర్చుని) నేనేమి చెయ్యను? అందరాని పండువై పోయావు... అన్నట్లు ఇక్కడికెల్లా వచ్చావు, ఆశ్చర్యంగా వుంది.

కనక: ఇంకా ఆశ్చర్యం... నేనెవ్వరి ననుకున్నారు? ...... సోమసుందరం గారి కోడల్ని.

శంక: (పకపక నవ్వుచు) తరువాత?

కనక: మీరు నమ్మటం లేదు.

శంక: అంటే, పెళ్ళాడాడా నిన్ను?

కనక: ఊఁ

శంకర: ఎలాగ? చెప్తుందా?

కనక: ఓ; చట్టం వుందట.

శంకర: ఓస్, ఎంత పని చేశావు! సోమసుందరంగారి వంశం అంటే అంత ఛాందసులని ప్రతీతి... దిగ్విజయం చేసేది... ముసలివాడు ఒప్పుకున్నాడా?

కనక: వివాహం అయ్యాక తెలిసింది వారికి. నన్ను చూచింది లేదు.

శంకర: మండి పడ్డాడా?

కనక: లేదు. వచ్చినప్పుడు చల్లగా పైకి వెళ్ళిపోయారు. మళ్ళా వచ్చారు ఎవ్వరూ లేకపోతే నా ప్రక్కన వచ్చి కూర్చున్నారు; పాడమన్నారు. పాట మెచ్చుకొన్నారు. ఆ లోగా మీరొచ్చారు.

శంకర: ఆఁ ఆఁ...

కనక: (నవ్వుతూ) పాట పరవశులై కాబోలు పొరపాటున తాళం నా తొడపైన వెయ్యడం మొదలుపెట్టారు.

శంకర: (పకపక నవ్వుతూ) ఓరి ముసలి నక్కా.

కనక: (నవ్వుతు) పాపం! కంగారు పడిపోయారు — నేను అరిచేప్పటికి.)

శంకర: ఎంత అవస్థ!

(ఇద్దరు కలిసి నవ్వుతుంటే, ప్రవేశం వేణుగోపాల్.)

వేణు. (కలవరంగా) కనకం! ఏమిటిది?...

శాస్త్రులుగారూ! నమస్కారం!

శంక: చాలాకాలమైంది కదూ, వేణూ!, విన్నాను కనకం చెప్పింది. అదృష్టవంతుడవు. కనకం మంచిపిల్ల.

వేణు: (ఈ సంభాషణ నచ్చడం లేదు.)

కనక: శాస్త్రులుగారు నన్ను చిన్నప్పటినుంచీ ఎరుగుదురండీ.

వేణు: ఓహో!

సోమ: (ప్రవేశించి) శంకరం!, రావోయి!...
(అని వీధిలోకి దారి తీస్తాడు.)

శంక: కనకం!, సెలవు. కొన్నాళ్లు రోజులుంటారా?

వేణు: లేదు. రాత్రికే ప్రయాణం.

శంక: అయితే సెలవు. (సోమ, శంకర. నిష్క్రమణ.)

కనక: ఎందుకండీ అంత కోపంగా ఉన్నారు?

వేణు: నీ వైఖరి బాగా వుంది. వచ్చి రోజన్నా కాలేదు, కృష్ణమూర్తితో సరసం, ఎవడో కోనకి సాకి శాస్త్రులతో నవ్వులు, పిన్నితో దెబ్బలాట...

కనక: అవును. అన్నీ నా తప్పేగదూ? ముసలివాణ్ణి కట్టుకొని మరిది మీద మోపిన్న మనసు పెట్టుకోవడం నా తప్పే. పిచ్చి బ్రహ్మచారి అందమైన పిల్ల కనబడగానే అవకతవకగా ప్రవర్తించడం నా తప్పే. మరిది నామీద కన్ను వేశాడని ఆవిడ ఉలికి పడితే నాదే తప్పు... 50 ఏండ్ల ముసలివాడు ధర్మశాస్త్రాలు తలక్రిందులుగా చదివే మా బాబయ్య ఒంటరిగా చూసి దగ్గర చేరి, ఏమాత్రం నీతి లేకుండా, నా తొడ మీద చెయ్యి వేస్తే నాదే తప్పు. ఎప్పుడో రాకేనాడలా

మా యింటి ప్రక్కనున్న శాస్త్రులతో ఆగొడవ
చెప్పుకొని నవ్వితే అదే నా తప్పు...

వేణు: ఆఁ ఆఁ ... అంత పని చేశాడా బాబయ్య...
తనంత... నువ్వు ప్రోత్సాహం చెయ్యకుండా...
కృష్ణమూర్తి మాత్రం ... నువ్వే వాళ్ళని బుట్టలో
వేయడానికి ప్రయత్నించి ఉంటావు.

కనక: రామ రామ!

వేణు: చాలించు. అసహ్యం. వెనుకటి బుద్ధి
ఎక్కడ పోతుంది.

కనక: (లేచి దైన్యంగా) అలా అనకండి. నన్ను
చంపేస్తున్నారు.

వేణు: నిన్ను పది నిముషాలు వదిలి వెళ్ళడానికి
సంకోచంగా వుంది. ఏమైనా చేస్తావు...
అప్పుడు. నీ లాంటి దాన్ని పెళ్ళి చేసుకోవడమే
పెద్ద పొరపాటు.

కనక: ఆఁ

వేణు: అప్పుడే ఇద్దర్ని చెడగొట్టినావు.

కనక: నేనా? పెద్ది కుర్రాళ్ళగ వాళ్ళు మైన బడితే...

వేణు: ఛప్, నోరు ముయ్యి.

కనక: (దుఃఖం కోపం ఆపుకుంటూ) ఎందుకంత
మాట?

వేణు: వెళ్ళి పోవాలి ఈ రాత్రికే

కనక: సరే.

వేణు: (లోపలికి వెళ్ళిపోవును)

కనక: (కండ్లు నీళ్ళు తుడుచుకొని, నిరాశతో

పెదివి విరిచి, మంగళసూత్రం చేతితో తెంపి పారవేసి)
ఛి ఛీ! ఏమి మగవాళ్ళు!
(వీధి గుమ్మం వైపు వెళ్ళుతుంది.)

# పడవ ప్రయాణం

శ్రీ పాలగుమ్మి పద్మరాజు.

Palagummi Padmaraju (1915 --) was a college science teacher until 1952, when his short-story 'Cyclone' won a prize in an international competition of short-stories conducted by the New York Herald Tribune. Since then he has written a good many short-stories of literary merit, though he writes mainly for Telugu films. He is adept in delineating the psychological aspects of different human types, from a beggar-woman to a business magnate.

The following story by Padmaraju is included primarily to expose American students to a lower-class dialect of coastal Andhra.

# పడవ ప్రయాణం

ప్రొద్దుపోయిన తరువాత లోకమంతా దిగులుగా ఉంది. పడవ మెల్లిగా నీటిమీద జారుతోంది. చీకట్లో ప్రపంచం అంతా నిశ్శబ్దంగా ఉంది. దగ్గరగా ఉన్న చెట్లు చీకట్లో పెద్ద దెయ్యాల్లాగ వెనక్కి నడుస్తున్నట్లున్నాయి. ఆకాశంలో నక్షత్రాలు మెల్లగా అలలమీద మత్తుగా కదులుతూ కన్ను తెరిచి నిద్రపోతున్నట్లున్నాయి.

గాలి లేదు. అప్పుడప్పుడు పడవలాగే తాడు బిగువుగా, ఒదులుగా అవుతోంది. పడవ వెనుక భాగంలో పొయ్యిలో నిప్పు మండుతోంది. అప్పుడప్పుడు గప్పుమంటోంది. అప్పుడప్పుడు తగ్గిపోతోంది. లోపలికి వచ్చిన నీళ్లు ఒక కుర్రవాడు కాలవలోకి పారబోస్తున్నాడు. పడవ లోపల ఏవేవో బస్తాలున్నాయి. ధాన్యం, బెల్లం, ఉప్పు, చింతపండు వగైరా. పడవ టాపుమీద నేను వెల్లకిల పడుకున్నాను. పడవ లోపలనించి చుట్ట పొగలు, ఏదో సంభాషణ కలిసి మెల్లగా తాపీగా అన్ని దిక్కులకీ వ్యాపిస్తున్నాయి.

గుమాస్తా కూర్చున్న గదిలో గుడ్డిదీపం మినుకు మినుకుమంటోంది. పడవ సాగుతోంది.

"ఏయ్ పడవా? ఈ గట్టుకు రానా!, ఈ గట్టుకి," అని ఎవరో పిలిచారు.

పడవ గట్టుకి చేరడంతోనే ఇద్దరు ఎక్కారు. పడవ ఆ పక్కకి కొంచెం వాలింది.

"టాప్పు మీద కూర్చుంటాంలే!" అంది ఆడగొంతుక.

"ఇన్నాళ్లూ ఎడపోయారావే? కనపట్టంలేదు" అన్నాడు చుక్కాని కాస్తున్న మనిషి.

"ఇజానగరం, ఇశాకపట్నం, మావోడూ, నేనూ కలిసి తిరిగొచ్చాం. అప్పన్నకొండ కెల్లాం."

"ఎడ బోతున్నా?"

"ముండపేట పోతున్నాం మరిదీ! కులాసగున్నావా? గుమాస్తాగారు పాతోరేనా?"

"ఆ!"

మగవాడు టాప్పు మీద అడ్డదిడ్డంగా పడుకొని ఉన్నాడు. అతని జోబ్లో చుట్ట పక్కకు పడితే ఆడమనిషి తీసి ఆర్పేసింది.

"ఒరేయి! లెగిసి కూర్చోరా!"

"నోరు ముయ్యి..... సెంజా! నేను తాగాననుకుంటున్నావా? ఎముక లిరగదంతాను." ఒక పక్క నుంచి ఇంకో పక్కకి తిరిగి పడుకున్నాడు. ఆడది అతని పొంటి మీద గుడ్డ కప్పింది. తను ఓ చుట్ట తీసి అంటించింది. అగ్గిపుల్ల వెలుగులో అమె ముఖం చూశాను. నల్లగా వున్న ముఖం ఎర్రగా

వెలిగింది.

ఆమె గొంతుకలో మగజీరవుంది. ఆమె మాట్లాడుతున్నప్పుడు చనువుగా మాటాడినట్టు వుంటుంది. ముఖం అందమయినది కాదు. జుట్టు చెదిరిపోయినా ముఖంలో ఏదో పెద్దమనిషి తనం వుంది. నల్లటి రవిక వున్నట్టు తెలియడం లేదు. చీకట్లో కూడా ఆమె కళ్లు మేలుకున్నట్టు మెరుస్తున్నాయి. అగ్గిపుల్ల వెలుగులో పక్కని పడుకున్న నన్ను చూసింది.

"ఈ పక్కనెవరో పడుకున్నార్రా!" అంది.

మగవాళ్లో తట్టి లేపింది.

"తొంగోమే సెంజా. గొడవెడితే లేచితంతాను."

మగవాడు అతి ప్రయత్నం మీద కొంచెం దూరంగా జరిగాడు.

ఇంతలో దీపం పైకెత్తి గుమాస్తా పడవ పక్కని నిలబడి చూచాడు. "ఏమే రంగీ, ఈడెవడు?" అని అడిగాడు.

"మా వోడండి, బాబూ, రేవూరుకు రాయించ వండి" అంది రంగి.

"పద్దాలే! దింపెయ్యి! దొంగ తొత్తుకొడుకుని. నాకు బుద్ధిలేదూ! మళ్లీ ఆళ్లో పడవెక్కించా?

తాగుబోతోళ్లే

"నే తాగండే. ఎవరు సెప్తాగానంటం?" అన్నాడు పద్దాలు.

ఒరే దింపెయ్యండర్రా! ఎందుకెక్కనిచ్చారో ళ్లే! చిత్తుగా తాగున్నాడు."

"చిత్తుగా లేదు. కొంచెం తాగాను."

"ఊరుకోరా! గుమాస్తాగార్రా! బాబ్బాబు, మండపాకాడ దిగిపోతాం."

"గుమాస్తాగారూ! దండాలండీ! తమ దయుండి. నేను తాగలేదు బాబూ!"

"ఏమన్నా అల్లరి చేస్తే కాలవలోకి తోయించేస్తాను, జాగ్రత్త!" గుమాస్తా గదిలోకి వెళ్ళిపోయాడు. పద్దాలు లేచి కూర్చున్నాడు. నిజానికి చిత్తుగా తాగినట్టు లేదు.

"కాలవలోకి తోయించేస్తాడంట!", నా కొడుకు అన్నాడు మెల్లిగా.

"ఊరుకోరా! ఇనపడద్ది."

"రేపొద్దున్న పడవ సూసుకోమను. యాసాలేత్తాడు, నా కొడుకు."

"ఉస్సు! ఆ పక్కెవరో పడుకున్నారు."

"ఎవరు?... నిద్దరోతన్నారు," పద్దాలు చుట్ట అంటించాడు.

పద్దాలుకి మొద్దు మీసాలు, కోల ముఖం. వెన్నెముక విల్లులాగ వంగి నిలబడుతుంది. మొత్తం మీద మనిషి కొంచెం సన్నగా నిర్లక్ష్యంగా ఉంటాడు.

పడవ మళ్ళీ నిశ్శబ్దంగా సాగుతోంది. పడవ వెనక భాగంలో నిప్పు మండడం లేదు. సరంగులు తిండి తిన్న గిన్నెలు తాపీగా మాట్లాడుతుంటూ కడుక్కుంటున్నారు.

గాలి చలిగా లేదు. అయినా నేను కండువా కప్పుకున్నాను. అంతులేని ఆ చీకటికి నా శరీరాన్ని అప్పగించడానికి నాకు భయంవేసింది. గాలి మాత్రం చురుకుగా ఉంది — మెత్తని స్త్రీ స్పర్శలాగ. పడవ నీటి మీద ఎంత మృదువుగా జారిపోతోంది. చెప్పలేనంత మృదుత్వం. విశాలమయిన ప్రకృతి ఆ రాత్రిలో నిండుగా ఆవరించుకొని ఉంది. ఆ కౌగిలిలో నాకు చిరకాలం నాటి విషాదగాథలు మెల్లగా జ్ఞాపకం వస్తున్నాయి. అనాది నుంచీ మగవాళ్ళ లాలించి పోషించిన స్త్రీత్వపు గాథలు.

నాకు కొంచెం దూరంలో రెండు చుట్టలూ ఎర్రగా కాలుతున్నాయి. జీవితం బరువుగా అక్కడ కూర్చుని ఆలోచించుకుంటూ చుట్ట కాలుస్తున్నట్టు నాకు అనిపించింది.

"వొచ్చేదే వూరు?" అన్నాడు పెద్దాలు.

"కొల్దారి" అంది రంగి.

"ఇంకా శానా దూరముంది

"ఇయ్యాల జాగత్తుంద్రా. పొద్దు పొద్దు. ఈలు సూసుకుని తరవాత? ఏరా నామాటినవా?" రంగి జాలిగా బతిమాలుతూ అడిగింది."

"బెదురు, సెంజకి" అన్నాడు పెద్దాలు. అంటూ ఆమె పక్కలో వేలెట్టి పొడిచాడు.

"అమ్మో!" అంది రంగి. అని పరవశంతో ఆకాశంలోకి ముఖమెత్తి చీకట్లోకి చూసింది.

ఆ స్పర్శ శాశ్వతంగా ఉండిపోవాలని కోరుతున్నట్లుగా అమె ముఖమెత్తింది.

నాకు క్రమంగా నిద్రపట్టింది, పడవంతా కుదుపు కూడా నిద్రపోతూ, నీటి వాలుకి మెల్లిగా జారిపోతూంది. నాకు కొంచెం దూరంలో ఆ ఇద్దరు వ్యక్తులూ కొంతసేపు గుసగుసలాడుకున్నారు. నాకు నిద్రపట్టినా, పూర్తిగా పట్టలేదు. పడవ నడుస్తున్నట్లు, నీరు జారుతున్నట్లు, చెట్లు వెనక్కి పోతున్నట్లు తెలుసును. పడవనెవరూ లాగడం లేదు. పడవ లోపల అంతా కునుకుతున్నారు. రంగి నా పక్కనించి నడిచి చుక్కాని దగ్గరకు వెళ్ళి కూచుంది.

"మరిదో! ఎల్లాగున్నా?" అంది.

"నువ్వెల్లాగున్నా?" అన్నాడు చుక్కాని కాసేవాడు.

"ఎన్నెన్ని సిత్రాలు సూపించాడనుకున్నావు మా వోడు! చెని మాటెల్లాం! ఓడల్ని సూశాం! ఓడంటే ఓడ కాదు మరిదో! మా వూరంతుంది, మరి సుక్కానెక్కడుందో గాని!" రంగి అల్లా ఏదో చాలాసేపు కబుర్లు చెప్తూ కూర్చుంది. ఆ కబుర్లు నన్ను జోకొడుతున్నట్టున్నాయి.

"పిల్లా! నాకు నిద్దరొత్తోందే!" అన్నాడు చుక్కాని కాసే మరిది.

"సుక్కాని నే సూత్తాలే. నువ్వెల్లా తొంగో మరిదో!" అంది రంగి.

పడవ మళ్ళీ మెల్లిగా జారిపోతోంది—నిశ్శబ్దంగా.

రంగి ఆ నిశ్శబ్దాన్ని చెదపకుండా తన గొంతు ఎత్తి చల్లగా పాట పాడింది!

" ఎరాడున్నాడో — నావోడు — యాడున్నాడో!
కూడు గిన్నెలోపెట్టి — కూకుని సూత్తుంటే
నేడల్లే మాపెల్లి నిదరే కంటికి రాదు — ఎరాడున్నాడో!!
తెల్లల్లే కొండెత్తి — తెగకుట్టే సలిగాలికి
నాలోపలంతా బిగిసినాదో మరి దో
ఎంచ్చని నా వాళ్ళు నవ్వుత్తే గాని
సచ్చిపోతానేమొ!...... ఎరాడున్నాడో!!"

రంగి గొంతుకలోని మగజిలలో సంగీతముంది. ఆ పాటలో పడుకుని ఉన్న అన్ని ప్రాణులూ ఒక్కసారి మనికాయి. గడిచిన యుగాల ప్రేమగాధలు వింతగా, మెల్లిగా, విషాదంగా ఆ పాటలో వంపించాయి. ఆ పాడ నాటి వెల్లువై పొంగితే అందులో లోకం చిన్న పడవలాగ తేలిపోయింది. మానవ జీవితం ఈ ప్రశాంతతంతో మధురంగా, వింతగా, బరువుగా తోచింది.

నాకు కొంచెం దూరంలో పద్దాలు నెత్తిని ముసుగు ముసుకుని కూర్చున్నాడు. కాని అతనికీ రంగికీ మధ్య కొన్ని యుగాల అంతరమేదో ఉన్నట్టు తోచింది. అతను చూపు దిగి పడవలోకి పోతలాడు. నేను ఒంటరిగా వెల్లికిల పడుకుని చూస్తున్నాను. రంగి అల్లాగే పాడుతోంది.

" గుండెమెనక సందులో గుంటున్నా దాని
సడి సెయ్యనక నువు దగ్గర చేరితే

గుడి వెనక గుంటెవరు ? బావా?
నడి పంరుసంలో నేను రానా !"

నాకు నిద్ర పడుతోంది. రంగి పాట అల్లా లరిగాలు తిరిగి వచ్చి మళ్లా మెల్లిగా నాగుండెల్ని తాకింది. నాకు నిద్ర పట్టింది. నిద్రలో ప్రాకృతికమయిన ప్రపంచం నాముందు గంతులు వేసింది. పచ్చెటూళ్లలో కాపు పడుచులు తమ ప్రియులతో దాగుడు మూతలాడుకొంటూ పాటలో కలిసి పోయారు. నేనెరగని ఒకానొక స్వప్నలోకం నాకళ్ల ముందు నిద్రలో తెరుచుకుంది. అందులో రంగి పద్ధాలు అనేక రూపాలతో తిరుగుతున్నారు. పాట క్రమంగా నాకు దూరమైంది. నిద్ర నామనస్సు తలుపులు మూసింది

పడవలో కొంచెం గొడవయింది. నేను కళ్లు నులుపుకుంటూ లేచాను. పడవ గట్టుకి చేర్చి ఉంది. రెండు లాంతర్లు పట్టుకొని సరంగులు కంగారుగా పడవ వెనక్కి దిగుతున్నారు. గట్టు మీద రంగిని ఇద్దరు గట్టిగా పట్టుకున్నారు. అందులో ఒకడు గుమాస్తా, అతని చేతిలో ఒక తాడుంది, రంగికి అప్పుడే దెబ్బలు తగిలుంటూయి. నేను చటుక్కుని పడవ దిగి గట్టు మీదికి గెంతాను. ఏం జరిగిందని అడిగాను.

"ఆ దొంగ నాకొడుకు పారిపోయాడు, సరుకు ఎత్తుకుపోయాడు. ఈ లంజ ఎక్కడో గట్టుకి చేర్చింది పడవని. సుక్కాని పట్టుకుంది లంజ!"

గుమాస్తా కోపంగా, చిరాకుగా, నిస్పృహతో అన్నాడు.

"ఏం పోయాయి?" అని అడిగాను.

"రెండు బెల్లం బుట్టలు, మూడు చింతపండు బుట్టలు. నేనందుకే వాళ్ళని ఎక్క నివ్వొద్దన్నాను. యజమాని నాకడుతారు నష్టమంతాను. ఎక్కడ దింపుకు పోయాడే?"

"కాల్దారి కాడండి! బాబయ్యా!"

"ఛీ లంజా! కాల్దారి కాడ మేలుకునుంటే నే?"

"అయితే నిదర పోలు కాదేనండి!"

"ఇదిప్పుడు చెప్పడు. రేపు అత్తిల్లో పోలీసోళ్ళకప్పగిద్దాం! ఎక్కు, పడవెక్కు."

"నేనిక్కడ దిగిపోతాను" బాబ్బాబు?"

"అట్టే యేసాలెయ్యకు. ఎక్కెక్కు!" గుమాస్తా ఆమెను పడవేప్పు తోశాడు. ఇద్దరు సరంగులు ఆమెను పడవెక్కించారు." నిద్దర మొకాలు! జేరారు! సూసుకోవద్దా! దాని చేతిలో సుక్కాని ఎవరెట్టమన్నారు? బుద్ధి లేదూ!" గుమాస్తా అందరి మీద విసుక్కుని గదిలోకి పోయాడు. రంగిని టాప్పు మీదికి ఎక్కించారు. ఒక సరంగు ఆమె పారిపోకుండా కాపలా వున్నాడు. నేను కూడా టాప్పు మీదికి ఎక్కాను. పడవ మెల్లి కదిలింది. నేను చుట్ట ముట్టించాను.

"అయ్యగారో సుట్ట ఇప్పించరూ!" రంగి చనువుగా అడిగింది. నేనో చుట్ట అగ్గిపెట్టె ఇచ్చాను. ఆమె చుట్ట ముట్టించింది. "మరిదో! నన్ను

పోలీసోళ్ళ కప్పగించి ఏం లాభం?"

"గుమాస్తా పాండులడు!" అన్నాడు సరంగు.

"పద్దాలు నీ మొగుడా?" అని అడిగాడు.

"మా వాడు" అంది రంగి.

"దాన్ని లేవదీసుకుపోయాడండి!, పెళ్ళాడలేదు. ఆడికి ఇంకొకత్తె వుంది. ఇప్పుడది ఎక్కడుందే?" అన్నాడు సరంగు.

"కోవూరులో వుంది. రంగూ, పొడుగూ బాగుందిప్పుడు. నేను తిన్నన్ని తన్నులు తింటే అదా నాలాగే అవుద్ది, గుడిసేటి సెంజ."

"మరి నీకింకా వాడితో ఎందుకు!" అన్నాను నేను.

"ఆడు నా వోడండి!" అంది. అంతా అందులో వున్నట్టుగా.

"మరి ఇంకొకత్తితో పోతున్నాడన్నావుగా?"

"నా దగ్గరికి రాకుండా ఎక్కడ పోతాడు? వెలిగోడికెంతమందయితే మాత్రమేం? ఆడంటే అయ్యగోరూ! మారాజండే. అల్లాంటి మనిశి లేడండి మళ్ళీనా."

"బాబో! ఆడి సంగతి మీరింకా ఎరగరు. ఇదెంత రంగుగా ఉండేదనుకున్నారు? ఓ తూరండి, దాన్ని గుడిసెలో పెట్టి గుడిసె అంటించేశాడు. మగ్గిపోయిందనుకోండి! ఇంకా దానికి భలామ్మొద నూంకలున్నాయి గాని" అన్నాడు సరంగు.

"అయ్యగోరు! అప్పుడు ఆడు కనమరిత్తే గొంతు కోసేద్దామనుండేది. కాలిన గజ్జటి ఈపు

మీద పడిందండి." ఆమె వెనక్కి తిరిగి రవిక కొంచెం పైకెత్తింది. తెల్లటి మచ్చ ఆ చీకటిలో కూడా స్పష్టంగా కనబడింది.

"మరి నిన్నిల్లా చేస్తుంటే ఇంకా వాళ్ళే పట్టుకు తిరుగుతున్నావేం?" అని అడిగాను.

"ఏం చెయ్యను? ఆడు కంటబడితే అన్నీ మరిచిపోయి కరిగి పోతాను. ఎంత జాలిగా మాట్లాడతాడని! ఈ సందేల కొవ్వూరులో బయలుదేరాం. దాన్లో నన్ను ఎంతో జాలిగా బతిమలాడాడు. ఈ పడవలో ఎక్కి చేతికి చిక్కిన సరుకు దించి పారెయ్యాలని. నేనుంటే గాని సాగదు. అడ్డదోవని నడిచి పడవ జేరుకున్నాం..."

"ఎక్కడ దింపేశాడు సరుకు?"

"ఎక్కడో నాకు గుర్తు నేదండో!"

"దొంగ నెంజ!" అన్నాడు నవ్వుతూ సరంగు.

రంగి మొగం చూడాలని నాకు ఎంతో కుతూహలం వేసింది. కాని ఆ కటిక చీకటిలో ఆమె మాయ మనిషి లాగ అస్పష్టంగానే ఉండిపోయింది.

పడవ మెల్లగా సాగుతోంది. నడిరాత్రి గడిచిన కొద్దీ గాలి కాస్త చలిగా తగులుతోంది. చెట్ల ఆకులు కొద్దిగా కదులుతున్నాయి. మళ్ళా పడవని సరంగులు లాగుతున్నారు. నాకింకా నిద్ర పట్టలేదు. కొంత సేపటికి కాపలా ఉన్న మనిషి కునికి పాటి చివరికి నిద్రపోయాడు. రంగి

మాత్రం ఇంక పారిపోయే ప్రయత్నం మానుకుంది. తాపీగా చుట్ట కాలుస్తూ కూర్చుంది.

"నీ కసలు పెళ్ళి అవలేదా?" అని అడిగాను నేను.

"లేదు. చిన్నతనంలోనే పద్దాలు నన్ను లేవదీసుకొచ్చాడు."

"మీదే వూరు?"

"ఈంద్రపాలెం... అప్పుడు తాగుతాడని నాకు తెలీదు... ఇప్పుడు నేనూ తాగుతానను కోండి. తాగితే తప్పులేదు. తాగి సావగొడతాడు."

"మరి వాణ్ణి వొదిలి వెళ్ళకపోయావా?"

"తన్నులు తిన్నప్పుడల్లా గనిపిత్తది. అయినా అంతటి మనిసి లేడండి. మీరెరగరు. మిగతాప్పుడు, వెన్నలా కరిగిపోతాడు. వొందమందితో పోయినా సరే ఆడు నాకాడికొచ్చి తీరతాడు. నేను లేకపోతే గుండె ఆగి సచ్చిపోడూ?"

నాకు వింతగా అనిపించింది ఆమె స్వభావం. వాళ్ళిద్దరికే మధ్యనున్న అనుబంధం ఎట్లాంటిదో నాకు అర్థం కాలేదు. రంగి మళ్ళా చెప్పడం మొదలు పెట్టింది.

"మాకిద్దరికీ ఏ పనీ సరిపడింది కాదు. సిగురికి ఇలా దొంగతనాల్లోకి దిగాం. మా యమ్మ వుండేది, మొన్నే సచ్చిపోయింది. నన్ను తిడుతుండేది. జీనాడండీ, నా గుడిసికి ఆనెంజని తోసుకొచ్చాడు."

"ఎవరిని?"

" ఇప్పుడున్న గుంటని. నా యెదురు గుండా,
నా యింట్లో దాంతో తొంగున్నాడు. నా కళ్లెదర!
చిత్తుగా తాగొస్తాడు. అదీ తాగింది. నా సయితే!
దాని మీంద పడి పీకాను. ఆడు నన్ను సంపదన్నాడు.
అద్దరేత్తిరికాడ దాన్నెక్కడికో తీసుకుపోయరాడు.
మళ్లా వొస్తాడు. నేను తిట్టాగు. ఇంటూకి రావద్దన్నాను.
గుమ్మంకాడ వలంతుని పిల్లోడికన్నా జాలిగా
ఏడిచాడు. నా గుండె కరిగిపోయింది. నేను
దగ్గరగా జేరితే నన్ను వాళ్లోకి తీసుకొని నా
నానుపేటు ఇమ్మన్నాడు. ఎందుకన్నాను. ఆ గుంట
తెమ్మందన్నాడు. నాకు ఒళ్లు తెలీదు. నానా తిట్లు
తిట్టాను. ఏడిచాడు. ఆ గుంట లేకపోతే బతక
లేనన్నాడు. నా కోపం ఎకువైపోయింది. గుమ్మం
లోంచి గెంటి తలుపేసుకున్నాను. తలుపు లాగి
లాగి సివరికి ఎల్లిపోయాడు. నాకు శానాసేపు
నిద్దర రాలేదు. కొంచెం కునుకు పట్టేసరికి ఇల్లంటు
కొంది. తలుపుకు గొళ్లేమేసి యింటికి నిప్పంటిం
చాడు. ఎవరూ రాలేదు. నడిరాత్తిరి. నా వొళ్లంతా
మగ్గిపోయింది. తలుపు లాగి లాగి సివరికి నాకు
తెలివి తప్పింది. ఇంతలో అవతల్నించి తలుపు
తెరిచారు. మర్నాడు ఆ కళ్లో పోలీసోళ్లు పట్టు
కున్నారు. ఎవరి మీంద అనుమానముందో
నన్ను చెప్పమన్నారు. ఆడు మాత్రం కాదని
ఖచ్చితంగా చెప్పేశాను. సందేల నాకాడకొచ్చి,
ఎంతో జాలిగా ఏడిచాడు. తాగినప్పుడల్లా

ఏడుస్తాడు. మిగతాప్పుడసలు ఏడుపే రాదు. నవ్వుతుం టాడు. సుక్కడితే సాలు, ఏడుపే. పిల్లోడిలా ఎక్కువగా ఏడుస్తాడు. నానా నుపేటిచ్చేశాను.

"నువ్వింకా వాడితో ఎందుకు తిరుగుతావు ఈ దొంగతనాల్లోకి?"

"ఏం జెయ్యమంటారు? అదొచ్చి గోలెడితే?"

"మరి నిన్ను విజయనగరం అక్కడికే తీసుకొని వెళ్ళాడన్నావు"

"వొట్టిది. ఊరికే అలాసెప్పాను. నేనంటే కొంచెం సరంగులికి నమ్మకం. ఇదిగాక రెండు తూర్లు ఈ పడవలో దొంగతనం జరిగింది."

"నిన్ను పోలీసులు పట్టుకుంటే ఏం జేస్తావు?"

"ఏవిటా చెయ్యను. నన్ను పట్టుకునేం జేత్తారు? నాకాడ దొంగ సొమ్ము లేదు. ఏమో ఎవరెత్తుకు పోయ్యారో, ఓరోజు కొడతారు. మన్నాజదిలేత్తారు."

"పద్దాలుని పట్టుకుంటే? ఆ దొంగ సొమ్ముతో దొరికిపోతే?"

"ఆడు దొరకడు. ఈ పాటికంతా అయిపోద్ది. ఆడు దొరకుండానే నేను పడవలో ఉండిపోతా."

ఆమె నిట్టూర్పు విడిచి "మళ్ళా ఆగుంటకే అంతాను. దాని మీద మోజు తగ్గేదాకా దాన్నొదలడు. నాకు ఈ కష్టాలన్నీని. దొంగసెంజ! నా ఉసురోసుకుంటుంది.

ఆ మాటల్లో నిజంగా ఉద్రేకమేమీ లేదు. ఆమె అతన్ని ఉన్నవాళ్ళో ఉన్నట్టుగా అంగీకరించింది.

పద్దాలు కోసం ఆమె ఎలాంటి పనైనా చెయ్యడానికి సిద్ధంగా ఉంది. అది ఒక ఆదర్శమూ కాదు, భక్తీ కాదు, ప్రేమా కాదు. ఎన్నో చిత్రమయిన భావాలతో, ఆశలతో, అనురాగాలతో కలిసిన స్త్రీహృదయం! అయినా ఆ హృదయం అన్నిటికీ ఫలితంగా ఒకే చోట లగ్నమయి ఉంది. తన మగవాడికోసం ఆమె నిరంతరం తపిస్తుంది, కాని అతడు పెద్దమనిషిగా, నీతిగా నడుచుకోవాలని ఆమెకి పట్టింపు లేదు. అతని సుగుణాలతో, దుర్గుణాలతో అతన్ని ఆమె అంగీకరించింది. నాకామె బ్రతుకు బరువనిపించింది. నిజానికి నా బ్రతుకే బరువేమో అంతకంటే.

గాలి అంతకంతకీ బాగా వీస్తోంది. పడవ కొంచెం వేగంగా పోతోంది. అలసట తీర్చుకున్న లోకం నిద్ర మేలుకోబోతోంది. అక్కడక్కడ రైతులు పొలంగట్లని నడుస్తూ కనబడుతున్నారు. వేగుచుక్క ఇంకా పొడవలేదు. రంగి వెలాకాళ్ళ ముడుచుకొని ఎటో నిర్లక్ష్యంగా చూస్తోంది.

"ఆడు నావోడు! ఎన్ని తిరుగుళ్ళు తిరిగినా నావోడు నాదగ్గరకే వొత్తాడు." అని తనలో తను అనుకుంది. అందులో ఒక ఆశ, ఒక ధైర్యం, ఒక విశ్వాసం వుంది. ఆ మాట ఆమె జీవితానికంతకీ కేంద్రంలాగా కనిపించింది. నేను భయంతో, భక్తితో, జాలితో ఆ మాట విని ఊరుకున్నాను. అలాగ తెల్లవారిదాకా మేమిద్దరం

కూర్చున్నాం.

నేను పడవ దిగి పోయేముందు జేబులోంచి ఒక రూపాయి తీసి చటుక్కుని ఆమె చేతిలో పెట్టి తొందరగా ఊళ్లోకి పోయాను. ఆమె జవాబు చెప్పేదాకా నేను నిలబడలేదు. ఆమె సంగతి తరువాత ఏం జరిగిందో నాకు తెలియదు.

ERIC